www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


Galaxy S25 Ultra
Galaxy AI


శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 342 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం,తిథి: చతుర్దశి రా.7:56 తదుపరి అమావాస్య, నక్షత్రం: పూర్వాభాద్ర రా.10:09 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: తె. ఉ. 7:45, అమృతఘడియలు: మ.2:57-4:23, దుర్ముహూర్తం: ఉ.8:41-9:30, మ.12:44-1:33, రాహుకాలం: ఉ. 10:30-12:00, సూర్యోదయం: 6:16, సూర్యాస్తమయం: 6:24 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru









Cheil-25291/25

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఓలా, ఊబెర్‌కు పోటీగా.. 10

సర్కారీ సహకార్ ట్యాక్సీ

కొన్ని నెలల్లో అందుబాటులోకి!

లోక్‌సభలో అమిత్ షా ప్రకటన



ఠారెత్తిస్తున్న ఎండలు

ప్రకాశంలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత 12

నేడు, రేపు తీవ్ర వడగాడ్పులు

శుక్రవారం | 28-3-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ప్రస్తుతం బూట్ల ధర రూ.159.09. అవే బూట్లను వైసీపీ సర్కారు రెండేళ్ల క్రితం రూ.187.48లకు కొనుగోలు చేసింది. అలాగే... రెండేళ్ల క్రితం స్కూల్ బ్యాగ్ ధర రూ.272.92. అదే బ్యాగు ఇప్పుడు రూ.250. బెల్టు అప్పుడు రూ.34.50.. ఇప్పుడు రూ.24.93. యూనిఫాం నాడు రూ.1081.98, నేడు 1061.43. నోట్ పుస్తకం ధరలు ఇప్పుడు రూ.35.64. అప్పుడు రూ.52. ఏటేటా ధరలు పెరగాలి గానీ, తగ్గాయేమిటనుకుంటున్నారా!? ఇదీ నాటి వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు అందించిన కిట్ల ధరలలో చేసిన మాయాజాలం!

కిట్స్‌తోపాటు అంగన్వాడీలకు సరఫరా చేసే గుడ్లు, చిక్కీల్లోనూ అవినీతే. ఆ మొత్తం రూ.1000 కోట్లు అని అంచనా. అప్పట్లో ఓ మంత్రికి కమీషన్ 5 శాతం కాగా, మిగిలిన సొమ్ము ఎవరి ఖాతాల్లోకి చేరిందన్నది ప్రశ్న. ప్రస్తుతం కూటమి సర్కారు ధరలు తగ్గించి దోపిడీకి చెక్ చెప్పింది. దాంతో ఐదేళ్లలో ప్రభుత్వ సొమ్ము 1000 కోట్లు ఆదా కానుంది.

బూటు, బెల్టులోనూ బొక్కేశారు!

జగన్ సర్కారులో విద్యార్థుల కిట్లు, గుడ్లు, చిక్కీల్లో 1000 కోట్లు స్వాహా

- ధరలు పెంచేసి అన్నింటా కమీషన్లు
- గుడ్ల రవాణాలోనే 36 కోట్ల దోపిడీ
- అప్పట్లో ఓ మంత్రికి 5% కమీషన్
- కూటమి సర్కారు వచ్చాక దోపిడీకి చెక్
- ధరల తగ్గింపుతో అన్నింటా పొదుపు
- ఏడాదికే కిట్లలో 64 కోట్ల ఆదా
- చిక్కీల్లోనూ రూ.63 కోట్ల మిగులు
- వచ్చే ఐదేళ్లలో 1000 కోట్ల ఆదా



(అమరావతి-ఆంధ్రజ్యోతి) ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా రూ.వెయ్యి కోట్లు! జగన్ ప్రభుత్వంలో విద్యార్థుల కిట్లు, చిక్కీలు, గుడ్లు, మరుగుదొడ్ల నిర్వహణ కెమికల్స్ తదితర వస్తువుల కొనుగోళ్లలో జరిగిన దోపిడీ ఇది! ధరలు పెంచి కాంట్రాక్టులు ఇవ్వడం, వారి నుంచి కమీషన్లు దండుకోవడం.. ఐదేళ్లూ ఇదే వరస. కూటమి ప్రభుత్వం వచ్చాక

మిగతా 12వ పేజీలో...

వైసీపీకి వేసవి సెలవులు!

- వానాకాలం వచ్చేదాకా కార్యక్రమాల్లేవ్.. ప్రతి గురువారం బెంగళూరుకు జగన్
- లోక్‌సభ స్థానంలో మూడేసి రోజులు బస చేస్తానంటూ గతంలో హామీ 11
- జిల్లాల్లో పర్యటిస్తాననీ ప్రకటన.. అతీగతీ లేదని వైసీపీ శ్రేణుల్లో అసంతృప్తి

పుష్కరాల్లోపే పోలవరం!

ముందు పరిహారం.. ఆ తర్వాతే ప్రారంభం: చంద్రబాబు

- 2026 డిసెంబరుకల్లా చెల్లింపులు
- ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేశారు
- వారికి న్యాయం చేసే బాధ్యత ప్రభుత్వానిదే
- గత పాలకులవన్నీ మాయమాటలే
- పరిహారం ఇస్తామన్నారు.. ఎక్కడ?
- మేమే ఇచ్చాం.. ఇంకా ఇస్తాం
- పోలవరం నిర్మాణం నా సెంటిమెంటు
- చెప్పిన పనులు చేయకపోతే బ్లాక్ లిస్టులోకి కాంట్రాక్టర్లు: సీఎం
- పోలవరంలో క్షేత్ర స్థాయి పర్యటన
- ఏరియల్ వ్యూ ద్వారా పనుల పరిశీలన
- నిర్వాసితులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నా సెంటిమెంట్. నష్టం జరిగినా, జాప్యం జరిగినా ఎక్కువ బాధపడేది నేనే. ప్రాజెక్టు నిర్మించే అవకాశం నాకు దక్కింది. దీనిని వినియోగించుకుని పూర్తి చేయాలన్నదే నా అభిలాష. నేనే పూర్తి చేయాలని ఆశిస్తున్నా..

జగన్ హయాంలో జరిగిన తప్పు చరిత్ర క్షమించరాని నేరం. అహంభావం, తెలియనితనం, రాజకీయ కక్షతో ప్రాజెక్టుకు నష్టం కలిగించారు. జాతీయ ప్రాజెక్టును, ప్రజల ఆస్తిని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు.

- సీఎం చంద్రబాబు



పోలవరం పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి నిమ్మల రామానాయుడు

ఏలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన ఈ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేయకముందే నిర్వాసితులందరికీ పునరావాసం పూర్తిచేస్తామని.. ఆ తర్వాతే ప్రాజెక్టును ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. గురువారం ఆయన క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. తొలుత పనులను ఏరియల్ వ్యూ ద్వారా, తర్వాత ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టు సంస్థలతో సమీక్ష జరిపారు. నిర్వాసితులతో ముఖాముఖి సమావేశమయ్యారు. విలేకరులతోనూ మాట్లాడారు. గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు జరగనున్నాయి. ఆ ఏడాది డిసెంబరునాటికి పోలవరాన్ని పూర్తిచేయాలని ప్రభుత్వం తొలుత లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పుష్కరాలు వచ్చేలోపే పూర్తిచేస్తామని సీఎం తాజాగా ప్రకటించారు. ప్రాజెక్టు మొదటి దశలో ఆర్ అండ్ ఆర్, భూసేకరణ కింద వచ్చే ఏడాది డిసెంబరు నాటికి 6,000 కోట్లకుపైగా

మిగతా 11వ పేజీలో...

నమ్మకం వమ్ము కాలేదు



వైసీపీ హయాంలో ఐదేళ్లు జగన్ పరిహారం ఇస్తారని ఆశపడి భంగపడ్డాం. చంద్రబాబు వస్తే ఇబ్బందులు తీరుతాయని ఎంతో నమ్మకం పెట్టుకున్నాం. మా నమ్మకం వమ్ము కాలేదు. మాకు రూ.6.30 లక్షలు పరిహారంగా అందింది. విభజన సమయంలో తెలంగాణ నుంచి ఏపీలో కలవడానికి కూడా చంద్రబాబుపై నమ్మకంతోనే అంగీకరించాం. దానికి తగిన ప్రతిఫలం లభించింది. మిగిలిన ముంపు ప్రాంతాలకు కూడా న్యాయం చేయాలి.

- గోపాలకృష్ణ, కివ్వాక, కుక్కునూరు మండలం

వక్ఫ్ ఆస్తులకు రక్షణ



- ముస్లింలకు ఉన్నత స్థితి కల్పిస్తాం
- బడ్జెట్‌లో 5,300 కోట్లు కేటాయింపు
- గతేడాది కంటే 1,300 కోట్లు ఎక్కువ
- సద్గుణాలకు రంజాన్ ప్రతీక
- ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు

ఉగాది రోజున బంగారు కుటుంబం 11

పీ4 కార్యక్రమంలో నిర్వహణ



10

పుతిన్ త్వరలోనే చనిపోతాడు

- అప్పుడే యుద్ధం ఆగిపోతుంది
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వివాదాస్పద వ్యాఖ్యలు

త్వరలో భారత్‌కు పుతిన్

రష్యా విదేశాంగ మంత్రి ధ్రువీకరణ

యాప్ డౌన్‌లోడ్ చేస్తే ఫోన్ పనిచేయదు

12

- బెట్టింగ్ యాప్‌లపై యుద్ధానికి 'ఐటీ' సిద్ధం
- త్వరలో హోం శాఖకు శక్తివంతమైన సాఫ్ట్‌వేర్
- రాష్ట్రంలో ఇప్పటికే నిషేధం... మరిన్ని కోరలు
- ఉత్తర్వు జారీ చేయనున్న ప్రభుత్వం

సీపీఎస్ ఉద్యోగులకు సర్కార్ బొనాంజా

12

- రూ.2,300 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఏకమొత్తంగా విడుదలపై ఉద్యోగుల హర్షం

వంశీకి బెయిల్ ఇవ్వలేం: కోర్టు

11

సజ్జలకు ముందస్తు బెయిల్

అవినీతే అసలు రోగం

న్యాయ వ్యవస్థలో అవినీతిని అరికట్టాలి

- 'నోట్ల కట్టల'పై క్రిమినల్ కేసు పెట్టకపోవడం పెద్ద పొరపాటు
- కొలీజియంతో సమావేశంలో ఆరు హైకోర్టుల బార్ ప్రతినిధులు
- జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ పంపినా పని అప్పగించరు
- అయినా బదిలీపై పునరాలోచిస్తా... సీజేఐ హామీ

న్యూఢిల్లీ, మార్చి 27: వివాదాస్పద ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసే విషయమై పునరాలోచిస్తానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా హామీ ఇచ్చినట్లు గురువారం సుప్రీంకోర్టు కొలీజియంతో సమావేశమైన న్యాయవాదులు చెప్పారు. అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ సహా ఆరు హైకోర్టుల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాన న్యాయమూర్తి

మిగతా 10వ పేజీలో...

రాష్ట్రాల్లోకి నేరుగా సీబీఐ

- జాతీయభద్రతతో ముడిపడిన కేసుల్లో అనుమతి తీసుకోకుండానే దర్యాప్తు
- అలాంటి ప్రత్యేక చట్టం తీసుకురండి
- సీబీఐలో సిబ్బంది కొరత ఆందోళనకరం
- కీలక పోస్టులకు నేరుగా నియామకం
- ఎస్ఎస్‌సీ, యూపీఎస్‌సీ లేదా సీబీఐ ప్రత్యేక పరీక్షతో ఎంపిక చేయాలి
- పార్లమెంటు స్థాయీ సంఘం నివేదిక

10

ఒక్క సందేశం.. ప్రాణం పోసింది!

గుంటూరులో మహిళ బ్రెయిన్ డెడ్

- అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబం
- మంత్రి లోకేశ్‌కు మెసేజ్ చేసిన వైద్యులు
- సొంత ఖర్చుతో ప్రత్యేక విమానం ఏర్పాటు
- గ్రీన్‌చానల్‌లో గుంటూరు నుంచి తిరుపతికి
- తెనాలి వాసికి గుండె మార్పిడి శస్త్రచికిత్స

12



గుంటూరులోని రమేశ్ హాస్పిటల్స్ ఆపరేషన్ థియేటర్ నుంచి గుండెను తరలిస్తున్న వైద్యులు

సిద్ధమవుతున్న సీఎఫ్ఎస్ఎల్

- అమరావతిలో ప్రతిష్ఠాత్మక ల్యాబ్ ఏర్పాటు
- రూ.400 కోట్లతో అధునాతన ప్రయోగశాల
- ఐదెకరాల్లో ఐదు బ్లాకులు.. అందులో రెండు రెడీ
- వచ్చే ఏడాది జూన్‌కల్లా పూర్తిస్థాయిలో అందుబాటులోకి
- దేశంలో ఇలాంటివి 7 కేంద్రాలు.. ఇప్పుడు ఎనిమిదోది
- సీఎం చంద్రబాబు కృషితో ఏపీకి అధునాతన ల్యాబ్

7



తుళ్లూరు సమీపంలో మెరుగులు దిద్దుకుంటున్న సీఎఫ్ఎస్ఎల్ భవన సముదాయంలోని ఫిజిక్స్ బ్లాకు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎర్డొగాన్ దుష్టచేష్టలు

తుర్కియేలో నానాటికీ పెరుగుతున్న ఆందోళనలు, నిరసనలను గమనించినప్పుడు, అవి కేవలం ఒక రాజకీయపార్టీ ప్రోద్బలంతో జరుగుతున్నవి కావన్నది సుస్పష్టం. రెండుదశాబ్దాలకు పైగా ప్రధానిగానో, అధ్యక్షుడుగానో దేశాన్ని ఏలుతున్న ఎర్డొగాన్ పదవీవ్యామోహం తుర్కియేను రాజకీయంగా, ఆర్థికంగా కుదిపేస్తోంది. ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ (సీహెచ్‌పి)లో ప్రముఖ నాయకుడు, ఇస్తాంబుల్ నగర మేయర్ అయిన ఇక్రెమ్ ఇమమోలును ఈనెల19న అవినీతి, ఉగ్రవాదులకు సహాయం ఇత్యాది ఆరోపణలమీద అరెస్టుచేసి జైల్లోకి తోయడంపై దేశం భగ్గుమన్నది. ఎర్డొగాన్ పదవికి ఇప్పటికిప్పుడు వచ్చిపడిన ప్రమాదమేమీలేదు. కానీ, మరో మూడేళ్ళలో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో మళ్ళీ నిలిచి గెలిచేందుకు ఆయన ఇప్పటినుంచే పరిస్థితులను చక్కదిద్దుకుంటున్నాడు. మంచి ఆదర్శాలు, చక్కని నడవడిక, ప్రజాస్వామిక విలువలు ఉన్న ఇమమోలును కేవలం ఒక రాజకీయ నాయకుడిగా చూడలేమని, మతాచార్యుడి కుమారుడు అని అర్థాన్నిచ్చే ఆ పేరులోనే తుర్కియే సాంస్కృతిక మూలాలున్నాయని మీడియా విశ్లేషిస్తున్నది. ప్రభుత్వం ఎన్ని ఆరోపణలు చేసినప్పటికీ, బలమైన రాజకీయ శత్రువును పక్కకు తప్పించే క్రమంలోనే ఈ అరెస్టు జరిగిందని ప్రజలు నమ్ముతున్నారు. విపక్ష పార్టీ నుంచి అధ్యక్షపదవి అభ్యర్థిగా ఇమమోలు అధికారికంగా రేపోమాపో నామినేట్ కాబోతున్న తరుణంలో ఈ అరెస్టు జరిగింది.

ఇమమోలు మీద కేసులు పెట్టడం, న్యాయస్థానం అరెస్టుకు ఆదేశాలు జారీచేయడం, పోలీసులు అరెస్టుచేసి జైల్లోకి నెట్టడం వేగంగా జరిగిపోయాయి. ఇస్తాంబుల్ మేయర్ పదవిని కూడా ప్రభుత్వం తొలగించింది. ఈ విధంగా విపక్షపార్టీకి చెందిన ఐదుగురు ఇటీవలికాలంలో మేయర్ పదవులు కోల్పోయారట. అధ్యక్ష అభ్యర్థిగా పార్టీ నామినేషన్‌ను నిలువరించడమే లక్ష్యంగా ఈ అరెస్టు జరిగింది కనుక సీహెచ్‌పీ ఈ ప్రాథమికదశ ఎన్నికను పార్టీ సభ్యులకు పరిమితం చేయకుండా, ప్రజాభాగస్వామ్యాన్ని కూడా కోరింది. దీనితో ఏకంగా కోటిన్నరమంది ఈ ప్రక్రియలో పాల్గొని ఇమమోలును తమ అధ్యక్ష అభ్యర్థిగా నామినేట్ చేశారని ఆ పార్టీ ఉత్సాహంగా చెబుతోంది. ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావడం, నిరసనలు పలు రూపాల్లో సుదీర్ఘకాలం కొనసాగడం చూసినప్పుడు ఇదంతా ఇమమోలు మీద ప్రేమకంటే, ఎర్డొగాన్‌మీద ద్వేషంగా కనిపిస్తున్నది. నిరసనల్లో ముందు వరుసలో ఉన్నది యువకులు, విద్యార్థులు కావడం విశేషం. వారు పుట్టిబుద్ధెరిగినప్పటినుంచీ అధికారంలో ఎర్డొగాన్‌నే చూస్తున్నారు. 2003లో ప్రధాని అయినప్పటినుంచి ఇప్పటివరకూ ఆయన తన పాలనలో ప్రజాస్వామిక విలువలకు కట్టుబడింది లేదు. అసమ్మతిని, ప్రశ్నను సహించకపోవడం, ప్రతిపక్షాన్ని బతకనివ్వకపోవడం ఒక విధానంగా అమలు చేశాడాయన. ఇమమోలు అరెస్టు ద్వారా ఇప్పుడు ఎర్డొగాన్ సంపూర్ణ నియంతగా ప్రజలకు అర్థమవుతున్నాడు. ఆయన తన ఏకేపీ పార్టీలో ఎవరూ పైకి ఎదగకుండా ముందే జాగ్రత్తపడ్డాడు. కానీ, తిరిగి అధ్యక్షుడుగా నిలబడేందుకు ప్రస్తుతం ఉన్న చట్టాలు ఒప్పుకోవు కనుక, వాటిని మార్చేందుకు సిద్ధపడుతున్నాడు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు జరపకుండా, వాటిని ముందే నిర్వహించేందుకు ప్రాతిపదికలు సిద్ధం చేసుకుంటున్నాడు. దేశంలో కల్లోల పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎటువంటి నిర్ణయాలైనా తీసుకొనే అవకాశం, అధికారం ఆయనకు ఉంటాయి. రాజ్యాంగసవరణ ద్వారా తిరిగి నిలబడేందుకు మార్గం సుగమం చేసుకోవచ్చు లేదా ముందస్తు ఎన్నికలకు పోవచ్చు. ఆయన ఎన్ని ఎత్తులు వేసినప్పటికీ, అధికశాతం ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని ఇప్పటికే రుజువైంది. గత ఏడాది జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విపక్ష సీహెచ్‌పి తన దేశవ్యాప్త బలాన్ని రుజువుచేసుకుంది. ఐదేళ్లక్రితం ఇస్తాంబుల్ మేయర్‌గా గెలిచిన ఇమమోలు కారణంగానే గత ఐదుదశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా సీహెచ్‌పీ బలపడింది. బలమైన రాజకీయ ప్రత్యర్థి ఇమమోలు మీద అక్రమ కేసులు బనాయించడం, ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా మార్చడం కోసం యూనివర్సిటీ పట్టాను రద్దుచేయించడం వంటి ఎర్డొగాన్ దుష్టచేష్టలను ప్రజలు గమనిస్తున్నారు. తిమ్మిని బమ్మిని చేయగల శక్తి ఆయనకు ఉండివుండవచ్చు. కానీ, ఇంతటి ప్రజావ్యతిరేకతను గమనించిన తరువాతైనా ఆయన కాలువెనక్కుతీసుకోవడం అవసరం. కశ్మీరీల హక్కుల గురించి అంతర్జాతీయ వేదికలమీద గుండెలుబాదుకొనే ఈ నాయకుడు ముందు తన ప్రజల మనోభిప్రాయాలకు గౌరవించడం నేర్చుకోవాలి.

అమెరికాలో మకార్తీ భూతం మళ్ళీనా?

గతం గుర్తుకు రాని మనిషీ ఉండడు, సమాజమూ ఉండదు. వర్తమానంలోని బాధలను గతంలోని కష్టాలతో పోల్చి చూసుకోవటం నిరంతరం సాగుతూనే ఉంటుంది. మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనే భయం రెండో ప్రపంచ యుద్ధంనాటి బీభత్సాన్నీ విధ్వంసాన్నీ ఎంతో కొంత తెలుసుకునేలా ప్రేరేపిస్తుంది. ప్రభుత్వాలు భావప్రకటనా స్వేచ్ఛనూ, అసమ్మతినీ అణచివేస్తున్న ప్రతి సందర్భంలోనూ బాధితులు గతంలో తమ లాంటి వారినీ అప్పటి ప్రభుత్వాల దాష్టీకాలనూ గుర్తుకు తెచ్చుకోకమానరు. అందుకోసం చరిత్రను తవ్వకుండా ఉండనూ లేరు. అసమ్మతిని సహించలేని ధోరణి హద్దులు దాటినప్పుడు బాధితులతో పాటు ఆలోచనాపరులు కూడా గతంలోని దారుణాలపై దృష్టి సారించకుండా ఉండలేరు.

అమెరికాలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు అలాంటి అవసరాన్ని కలిగిస్తున్నాయనే చెప్పుకోవాలి. విద్యా సంస్థలను రాడికల్ వామపక్షవాదుల ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత చాలా కటువుగా, మొరటుగా చెప్పారు. 'మార్క్సిస్ట్, మేనియాక్స్, లూనటిక్స్'లు విద్యా సంస్థలను శాసిస్తున్నారనీ విమర్శించారు. దీన్ని చూస్తూ ఊరుకుంటున్న ఉన్నతాధికారులను ఉద్యోగాల నుంచి తొలగిస్తాననీ ప్రకటించారు. చెప్పినట్లుగానే ఫెడరల్ విద్యాశాఖను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులనూ జారీచేశారు. విద్యాసంస్థలకే పరిమితం కాకుండా ఇతర అంశాలపై తాను వరుసగా జారీచేస్తున్న ఉత్తర్వులను నిలిపివేస్తున్న న్యాయమూర్తులను కూడా 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్'గానే విమర్శిస్తున్నారు. తన ఉత్తర్వులను కోర్టుల్లో సవాల్ చేస్తున్న న్యాయవాదులనూ, న్యాయవాద సంస్థలనూ కట్టడి చేయటానికి చర్యలు తీసుకోవాలనీ అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలకు ఫెడరల్ నిధులు వెళ్లకుండా నొక్కిపట్టి వాటిని దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. 400 మిలియన్ డాలర్ల నిధులను ఫెడరల్ ప్రభుత్వం నుంచి పొందటానికి ట్రంప్ ప్రభుత్వానికి నచ్చే విధంగా విధానాలను మార్చుకునేందుకు కొలంబియా విశ్వవిద్యాలయం అంగీకరించింది. ఎంతో చరిత్ర ఉండి, మహామహులను అందించిన విశ్వవిద్యాలయానికే ఈ పరిస్థితి వచ్చిందంటే మిగతా వాటి పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ ఆందోళనలు చేయటం, ప్రదర్శనలు నిర్వహించటం గడిచిన రెండేళ్లుగా అమెరికా విశ్వవిద్యాలయాల్లో బాగా జరిగింది. దీన్ని హమాస్ సంస్థకు మద్దతు పలకటంగా భావించి ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల వీసాలను రద్దు చేసి స్వదేశాలకు పంపటమూ మొదలైంది. కొలంబియా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి రంజనీ శ్రీనివాసన్ అలాగే భారత్‌కు రావాల్సి వచ్చింది. జార్జిటౌన్ యూనివర్సిటీకి చెందిన పోస్ట్ డాక్టరల్ విద్యార్థి బాదర్ ఖాన్ సూరిని కూడా అలాంటి ఆరోపణలతోనే దేశం నుంచి పంపించి వేయటానికి రంగం సిద్ధమైంది. ఇక అనేక ప్రముఖ విద్యాలయాల్లో విద్యార్థులపై నిఘాలు పెరుగుతున్నాయి. విద్యార్థుల సామాజిక ఖాతాలను తనిఖీ చేయటమూ మొదలైంది. అలా తనిఖీ చేసేందుకు కొత్త నిబంధనలు తీసుకురావటానికి ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలూ వస్తున్నాయి.

సామాజిక సమస్యలపై స్పందించే వారందరూ ఏదో విధమైన సిద్ధాంతాలను విశ్వసించేవారే అయివుంటారు. వారందరినీ లెఫ్ట్ లూనటిక్స్‌గా భావిస్తే విశ్వవిద్యాలయాల్లో అల్లకల్లోలం తలెత్తుతుంది. భావ వైవిధ్యాన్ని ప్రదర్శించలేని స్థాయికి విశ్వవిద్యాలయాలు దిగజారిపోతే సామాజిక జ్ఞానమే స్తంభించిపోతుంది. అమెరికా విశ్వవిద్యాలయాలకు ఉన్న బలమే భావ వైవిధ్యత. అందుకే అక్కడ జరిగే



కమ్యూనిజం ఇప్పుడు కదం తొక్కటంలేదు. ఆ సిద్ధాంతం ఆధారంగా నడిచే పార్టీల బలం అంతంత మాత్రంగానే ఉంది. అయినా అమెరికాలో 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్' అంటూ ఆ సిద్ధాంత ఛాయలు స్పష్టంగా లేని వారిని సైతం లక్ష్యంగా చేసుకోవటం విచిత్రంగానే అనిపిస్తుంది. ట్రంప్‌కూ ఎలాన్ మస్క్‌కూ లెఫ్టిజంలో ప్రమాదం కనపడుతున్నదంటే రాజకీయ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ ఫుకుయామా 1992లో ఘనంగా ప్రకటించినట్లుగా చరిత్ర అంతం కాలేదని భావించాలి!

పరిశోధనలకు అంత గుర్తింపు ఉంటుంది. భారతీయ భాషలు, కులాలు, మతాలు, నగరాలు, ప్రాంతీయ సంస్కృతులు, స్థానిక రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులపై అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఎన్నో లోతైన పరిశోధనలు జరిగాయి. వాటిపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ వాటిని పక్కనపెడితే ఏర్పడే జ్ఞానశూన్యత చాలా అసాధారణంగా ఉంటుంది. అందుకే అక్కడ భావప్రకటనలపై కట్టడులు పెడితే జరిగే నష్టం భారత్‌తో పాటు చాలా దేశాలపై ఉంటుంది.

రిపబ్లికన్ పార్టీకి ఆధునిక భావాలు అంతగా పట్టవు. మతభావాలపై మక్కువ ఎక్కువ. క్రైస్తవ వాదుల ప్రభావం అధికం. అబార్షన్లను వ్యతిరేకిస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు సమానత్వాన్ని నిరాకరిస్తుంది. పర్యావరణ విధ్వంసం నిజం కాదంటుంది. సమానత్వ భావనను చులకన చేస్తుంది. ఇంత చరిత్ర ఉండబట్టే వామపక్ష భావాల పొడ ఏ మాత్రం గిట్టదు. వాటి పట్ల శత్రుత్వధోరణితో వ్యవహరించటం కొత్తకాదు. ఆ ధోరణి అమెరికన్ చరిత్రలో భయానక పరిణామాలకు కారణమైంది. 1940, 50ల్లో ఆ పార్టీకి చెందిన సెనేటర్ జోసెఫ్ రేమండ్ మకార్తీ.. వేలమంది ప్రజలను కమ్యూనిస్టులనే ముద్రవేసి వేధించారు. ప్రభుత్వ వ్యవహారాల సెనెట్ కమిటీకి, దర్యాప్తు ఉపసంఘానికీ అధ్యక్షత వహించి విచారణల పేరుతో భయాన్ని, బీభత్సాన్ని సృష్టించారు. హాలివుడ్ దర్శకులు, నటుల నుంచి మొదలుకుని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కార్మికులు, సైనిక అధికారులు, ఉన్నతోద్యోగులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, సాహిత్యవేత్తలు మకార్తీ ఆరోపణలనూ, విచారణలనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. మకార్తీ చర్యలను విశ్లేషిస్తూ ఎన్నో రచనలు వచ్చాయి. అమెరికా చరిత్రను వాస్తవిక దృక్పథంతో రాసే వారెవరూ మకార్తీయిజాన్ని విస్మరించలేకపోయారు.



■ రాహుల్ కుమార్

మకార్తీ రెండుసార్లే (1946, 1952) సెనెట్‌కు ఎన్నికయ్యారు. విదేశీ వ్యవహారాల శాఖలోకి 57 మంది కమ్యూనిస్టులు చొరబడ్డారని 1950లో ప్రకటించి సంచలనం సృష్టించారు. 'మన ప్రభుత్వంలో కమ్యూనిస్టుల గురించి చర్చించుకునేటప్పుడు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనదగ్గరున్న కొత్త ఆయుధానికి సంబంధించిన బ్లూప్రింట్‌ను దొంగిలించటానికి డబ్బుని తీసుకునే గూఢచారులతో మాత్రమే మనం వ్యవహరించటం లేదు. మన విధానాన్ని తీర్చిదిద్దటానికీ మార్గదర్శనం చేయటానికీ ఉద్దేశించిన దుర్మార్గపు కార్యకలాపాలతో మనం వ్యవహరిస్తున్నాం' అని ప్రకటించారు. ప్రభుత్వంలో చొరబడిన కమ్యూనిస్టులు అమెరికా విధానాలను ప్రభావితం చేసే స్థాయికి చేరారన్నదే ఆ ప్రకటన అంతరార్థం. అంతటితో ఆగలేదు. అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏలో కూడా కమ్యూనిస్టులు ఉన్నారని ఆరోపించారు. ఇతర విభాగాల్లోనూ కమ్యూనిస్టులు తిష్టవేశారని విమర్శించారు. రెండోసారి సెనెటర్‌గా ఎన్నికైన తర్వాత ఆరోపణలను మరింత ఉధృతం చేశారు. ప్రభుత్వ కార్యకలాపాల సెనెట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికకావటంతో విపరీత అధికారాలు వచ్చిపడ్డాయి. దానికితోడు శాశ్వతంగా ఉండే సెనెట్ దర్యాప్తు కమిటీ నేతృత్వమూ దక్కింది. ఏళ్లపాటు మకార్తీ మాటకీ చేతకీ అడ్డూఅదుపూ లేకుండా పోయింది. వామపక్షవాదులుగా ముద్రలువేసిన వారిపై 36 రోజులపాటు జరిపిన విచారణ టెలివిజన్‌లో ప్రసారం చేయటం అప్పట్లో సృష్టించిన సంచలనం అంతాఇంతా కాదు. న్యూజెర్సీలోని 'ఆర్మీ సిగ్నల్ కార్ప్స్ ఇంజనీరింగ్ లేబరటరీస్' గూఢచర్యం ఆరోపణలపై జరిపిన విచారణ కూడా టెలివిజన్‌లో ప్రసారమైంది. ఉద్యోగుల విధేయతను పరిశీలించటానికి అప్పట్లో 'లాయల్టీ సెక్యూరిటీ స్క్రీనింగ్ బోర్డు' అనేది ఒకటి ఉండేది. ఆ బోర్డు వేసిన ప్రశ్నలకు జవాబుచెప్పటానికి నిరాకరించిన ఒక డెంటిస్ట్‌ను సైనిక విభాగం నియమించిదంటూ మకార్తీ ఆరోపణ చేశారు. దీంతో ఆగకుండా ఆర్మీ న్యాయవాదిగా వ్యవహరించే జోసెఫ్ వెల్చ్ కమ్యూనిస్టు ప్రజాసంఘం సభ్యుడైన వ్యక్తిని ఉద్యోగంలో పెట్టుకున్నారని ఆరోపించారు. అప్పటికే ఎన్నో ఆరోపణలను చేసి ఒకటిరెండు తప్ప వేటినీ నిరూపించలేని పరిస్థితి ఏర్పడింది. టెలివిజన్ ప్రసారాలతో క్రమేపీ ప్రచార ఆర్భాటమూ, ఆరోపణల డొల్లతనం కనపడడమూ మొదలైంది. 'మీకు సభ్యత అంటూ లేదా సర్? దాన్ని పూర్తిగా వదిలేశారా?' అంటూ వెల్చ్ ఎదురుదాడి చేయటంతో ప్రజలకు కూడా మకార్తీపై విముఖత మొదలైంది. జర్నలిస్టు ఎడ్వర్డ్ ఆర్.మరో తన 'సీ ఇట్ నౌ' కార్యక్రమంలో మకార్తీ వైపరీత్యాన్ని చీల్చి చెండాడారు. దారుణాలన్నీ జరిగిపోయిన తర్వాత, జీవితాలన్నీ నాశనమయ్యాక సెనెట్ కూడా మకార్తీని తప్పుపట్టి అభిశంసించింది.

'మెనీ ఆర్ ద క్రైమ్' పేరుతో ఎలన్ ష్రెకర్ ప్రచురించిన పుస్తకంలో మకార్తీయిజం గురించి చాలా విషయాలను ప్రస్తావించారు. మకార్తీయిజం చెలరేగిన కాలంలో రాజకీయ అణచివేత అమెరికన్ చరిత్రలోనే అసాధారణమైందనీ అంతకాలం పాటు అలాంటి దారుణాలు ఎప్పుడూ జరగలేదనీ పేర్కొన్నారు. మకార్తీయిజాన్ని ఒక వ్యక్తికి సంబంధించింది కాకుండా చర్యల ప్రాతిపదికగా చూస్తే 1940, 50ల కాలమంతా ఆ ఇజం రాజ్యమేలిందని చెప్పుకోవచ్చనీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను నడిపే పెద్దమనుషులు తెలివిడితోనే రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారనీ కమ్యూనిస్టు ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడే పేరుతో దాన్నొక తప్పుగానూ

మకార్తీయిజం చెలరేగిన కాలంలో రాజకీయ అణచివేత అమెరికన్ చరిత్రలోనే అసాధారణమైందనీ అంతకాలంపాటు అలాంటి దారుణాలు ఎప్పుడూ జరగలేదనీ ఎలన్ ష్రెకర్ తన 'మెనీ ఆర్ ద క్రైమ్' పుస్తకంలో పేర్కొన్నారు. మకార్తీయిజాన్ని ఒక వ్యక్తికి సంబంధించింది కాకుండా చర్యల ప్రాతిపదికగా చూస్తే 1940, 50ల కాలమంతా ఆ ఇజం రాజ్యమేలిందని చెప్పుకోవచ్చనీ ఆయన వ్యాఖ్యానించారు.

భావించలేదనీ చెప్పారు. విచారణను ఎదుర్కొన్న వారందరూ రాజకీయ అభిప్రాయాలు లేనివారుగానో వామపక్షంతో పూర్తిగా సంబంధంలేనివారుగానో చెప్పలేమనీ ఎలన్ ష్రెకర్ అన్నారు. అయినా దారుణాలను తక్కువ చేయలేమనీ చెప్పారు. మకార్తీయిజం విజృంభణ కాలంలో జులియస్ రోజన్‌బర్గ్, ఎథల్ రోజన్‌బర్గ్ దంపతులకు మరణ శిక్షను విధించారు. వందల మందిని జైల్లో పెట్టారు. దేశ బహిష్కారమూ చేశారు. 10 నుంచి 12 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. రష్యా, జర్మనీల్లో జరిగిన దారుణాలతో పోల్చితే ఈ దురాగతాలు తక్కువైనప్పటికీ అవి సృష్టించిన భయానక వాతావరణంతో అమెరికాలో పదేళ్లపాటు అసమ్మతి ఆవిరైపోయిందనీ ఎలన్ ష్రెకర్ వ్యాఖ్యానించారు.

1940, 50ల్లో లాగా కమ్యూనిజం ఇప్పుడు కదం తొక్కటంలేదు. ఆ సిద్ధాంతం ఆధారంగా నడిచే పార్టీల బలం అంతంత మాత్రంగానే ఉంది. అయినా అమెరికాలో 'రాడికల్ లెఫ్ట్ లూనటిక్స్' అంటూ ఆ సిద్ధాంత ఛాయలు స్పష్టంగా లేని వారిని సైతం లక్ష్యంగా చేసుకోవటం విచిత్రంగానే అనిపిస్తుంది. ట్రంప్‌కూ ఎలాన్ మస్క్‌కూ లెఫ్టిజంలో ప్రమాదం కనపడుతున్నదంటే రాజకీయ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ ఫుకుయామా 1992లో ఘనంగా ప్రకటించినట్లుగా చరిత్ర అంతం కాలేదని భావించాలి! ప్రత్యామ్నాయ వ్యవస్థలుగా సోషలిస్టు రాజ్యాలు కుప్పకూలిపోవటాన్నీ వామపక్ష భావాల ప్రభావం క్షీణించటాన్నీ చరిత్ర అంతంగా ఫుకుయామా వ్యాఖ్యానించారు. అమెరికా పరిణామాలను చూస్తుంటే ఇంకా అది చల్లారని చరిత్రలాగే ఉంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు మహర్దశ

'రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడానికి, మౌలిక సదుపాయాలు, పరిశోధన అభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.2,000 కోట్లు కేటాయించింది. మరికొన్ని ప్రత్యేక కార్యక్రమాలకు కేంద్ర నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటుంది. ఆచార్యుల ఖాళీలను భర్తీ చేస్తా'మని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడంతో ఏపీ విశ్వవిద్యాలయాల్లో నూతనోత్సాహం చోటుచేసుకుంది. ఎన్నో ఏళ్లుగా నిరాదరణకు గురైన ఉన్నత విద్యారంగానికి మంచిరోజులు రానున్నాయని వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి. విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన మరోసారి నొక్కి చెప్పారు.

రాష్ట్రంలో సగానికి పైగా విశ్వవిద్యాలయాలకు ఇప్పటికే ఉపకులపతుల్ని నియమించారు. విశ్వవిద్యాలయాల్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చనున్నారు. ఈ ఆలోచనను విద్యావేత్తలు పూర్తిగా సమర్థిస్తున్నారు. అందుకు తగిన విధంగా కోర్సులను రూపకల్పన చేయనున్నారు. వాటికి తగిన పాఠ్యాంశాలను ప్రవేశపెట్టనున్నారు. పరిశోధనలను, ఆవిష్కరణలను పెంపొందించే దిశగా అడుగులు వేస్తున్నారు. అదనంగా ఉన్నత విద్యావ్యవస్థను మెరుగుపరచడానికి నాణ్యత హామీ, ఫ్యాకల్టీ, అభివృద్ధి కార్యక్రమాలు, అంతర్జాతీయ ఆకర్షణలు కలిగించే చర్యలు అమలు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

తెలుగుదేశం ప్రభుత్వం గతంలోనే రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఖాళీలను గుర్తించి 2017–18 విద్యాసంవత్సరంలో రెండు ప్రకటనలు విడుదల చేసింది. ఏపీపీఎస్సీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించింది. ఈ స్క్రీనింగ్ పరీక్షే యూజీసీ నిబంధనలకు విరుద్ధమని అభ్యర్థుల నుంచి విద్యావేత్తల వరకు తప్పుపట్టారు. జరిగిన స్క్రీనింగ్ పరీక్ష ప్రశ్నాపత్రాల్లో దొర్లిన తప్పులు మీద పెద్దయెత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వీటితో పాటు రిజర్వేషన్ విధానంలో, రోస్టర్ పాయింట్లలో తప్పులున్నాయని హైకోర్టు పరీక్ష రద్దు చేసింది. తర్వాత జరిగిన పరిణామాల్లో అర్హత సాధించిన అభ్యర్థులు సర్వోన్నత న్యాయస్థానానికి అప్పీల్ చేసుకున్నారు. తరువాత ఈ కేసు విషయంలో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చొరవ తీసుకోకుండా నీరుగార్చింది. ఆదరాబాదరాగా, తప్పుల తడకగా ప్రకటనలు ఇచ్చి ఖాళీలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల్ని మోసగించింది. ఈ ప్రకటనల మీద కూడా ఉన్నత న్యాయస్థానంలో 10కి పైగా కేసులు నమోదయ్యాయి. ఈ ప్రకటనల్లో కూడా చాలా తప్పులున్నాయని ప్రభుత్వమే అంగీకరించి, సవరణలతో కూడిన ప్రకటన, లేదా కొత్త ప్రకటన విడుదల చేస్తామని న్యాయస్థానానికి తెలియజేసింది. ఈ లోగా జరిగిన 2024 సాధారణ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఘోరపరాజయం పొంది కూటమి ఘనవిజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తదనంతర విధాన నిర్ణయాల్లో భాగంగా మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేష్ విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేస్తామని ప్రకటన చేశారు. ఏకసభ్య కమిషన్ నియమించి నివేదిక రాగానే ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. దీంతో వర్సిటీలకు మహర్దశ రానుందని విద్యావంతులు భావిస్తున్నారు.



రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యావ్యవస్థను మెరుగుపరచడానికి నాణ్యత హామీ, ఫ్యాకల్టీ, అభివృద్ధి కార్యక్రమాలు, అంతర్జాతీయ ఆకర్షణలు కలిగించే చర్యలు అమలు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నది. పరిశోధన, ఆవిష్కరణలపై దృష్టి కేంద్రీకరించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ప్రపంచీకరణ పోటీలో రెండు దశాబ్దాలుగా ఉపాధి అవకాశాలు సన్నగిల్లిన కొన్ని అంశాలను ఇప్పటికే ప్రభుత్వం గుర్తించింది. ఆర్ట్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్ కోర్సులకు ఉపాధి అవకాశాలు లేక నిరాదరణకు గురవుతున్న విషయం మీద ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. కొంతమంది ఐఐటి, ఎన్ఐటి, ఇంకా ఇతర జాతీయ సంస్థలకు చెందిన అకడమీషియన్లతో చర్చించి పరిష్కారాలను కనుగొనే పనిలో నిమగ్నమయింది. ఈ కోర్సులను పారిశ్రామిక రంగంతో అనుసంధానించడంతో అధికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరచవచ్చని భావించింది. ఇంటర్న్‌షిప్, నైపుణ్య ఆధారిత అభ్యాసాన్ని ఖచ్చితంగా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం బలంగా యోచిస్తోంది.

పరిశోధన, ఆవిష్కరణలపై దృష్టి కేంద్రీకరించడం ముఖ్య లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శరవేగంగా ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించనున్నారు. అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించేందుకు తగిన విధంగా స్టార్టప్ ఇంక్యుబేషన్‌తో అంతర్జాతీయ సామర్థ్యాలను సాధించి స్టడీ ఇన్ ఆంధ్రప్రదేశ్ వంటి కార్యాచరణ చేపట్టనుంది. ఏపీ విశ్వవిద్యాలయాలను జాతీయ ర్యాంకింగ్‌ల్లో నిలబెట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్‌లను తగిన పాఠ్యప్రణాళికలతో పారిశ్రామిక అభివృద్ధిలో భాగం చేయనున్నారు. ఈ నిర్ణయాలన్నీ రాష్ట్ర విశ్వవిద్యాలయాలను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా ఉన్నాయి. అయితే వీటిని ప్రణాళికగాబద్ధంగా ఆచరణలోకి తీసుకొస్తే వర్సిటీలకు మహర్దశ కలుగుతుంది. అప్పుడే మన విశ్వవిద్యాలయాలు జాతీయ, అంతర్జాతీయంగా ఆశించిన ర్యాంకుల్లో నిలుస్తాయి.

– డాక్టర్ జీకేడీ ప్రసాదరావు
ఫ్యాకల్టీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం

రియా : నైతిక పతనంలో న్యూస్ ఛానల్స్



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

రియా చక్రవర్తి దురవస్థ నొక్కిచెప్పినదేమిటి? స్పర్థాత్మక మీడియా జగత్తులో ఒకటి రెండు మినహాయింపులతో న్యూస్ నెట్‌వర్క్స్ అన్నీ తమ నైతిక దిక్సూచిని కోల్పోయాయనే కదూ! అర్థవంతంగా జరగవలసిన వార్తా నివేదన అనవసర సంచలనాత్మకత సంతరించుకోవడం సాధారణమైపోయింది. అసలు ఘటనలపై కాకుండా ఏవో గందరగోళాలపైకి దృష్టి మళ్లేలా చేయడంలో న్యూస్ టీవీ ఆరితేరిపోయింది.

ఇతరుల జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే జర్నలిస్టులు తమ వృత్తిధర్మ నిర్వహణ విషయమై చిత్తశుద్ధితో ఆత్మ పరిశీలన చేసుకోవడం అరుదు అని పలువురు తరచు విమర్శిస్తుంటారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి గృహంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు లభించడంపై న్యూస్ టీవీ ఛానెల్స్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశాయి. అది సహేతుకమే. న్యాయమూర్తుల ప్రవర్తనలోని మంచి చెడులను నిర్ణయించేదెవరు? అని న్యూస్ యాంకర్లు తీక్షణంగా ప్రశ్నించారు. ఇది జరిగిన 24 గంటల అనంతరం సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్యకేసులో తమ దర్యాప్తును ముగించినట్టు సీబీఐ ఒక నివేదికను కోర్టుకు నివేదించింది. సుశాంత్ మరణానికి ఆత్మహత్యే కారణమని, ఆ ఘటనకు ఇతర అసహజ కారణాలు ఏవీ లేవని సీబీఐ స్పష్టం చేసింది. ఈ దర్యాప్తు నివేదికపై మీడియాలో ఎటువంటి గగ్గోలు లేదు. చర్చలేవీ జరగలేదు సుశాంత్ మరణానికి దారితీసిన కారణాలు నిజంగా ఏమిటనేవి తెలుసుకోవాలని ప్రజలు అభిలషిస్తున్నారు. సుశాంత్ స్నేహితురాలు రియా చక్రవర్తి శీల హననానికి పాల్పడినవారు 'నేను తప్పు చేశాను' అని ఒప్పుకున్నారా లేదా అనే విషయాన్ని కూడా ప్రజలు తెలుసుకోవలసి ఉన్నది. అయితే ఇవేమీ జరగలేదు.

ప్రతిభావంతుడు అయిన బాలీవుడ్ నటుడు జూన్ 2020లో ముంబైలోని తన గృహంలో మరణించినట్టు పోలీసులు కనుగొన్నారు. ఈ యువ నటుడి మరణంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. సుశాంత్ మరణంలో యువ నటి రియా చక్రవర్తి ప్రమేయముండ వచ్చని ఆరోపణలు వచ్చాయి. సుశాంత్ మరణంపై తలెత్తిన వివాదానికి ఆమే కేంద్రమయింది. ఇది ఆమెకు ఊహించని పరిణామం. వారాలు, నెలల తరబడి రియాను, ఆమె కుటుంబాన్ని మీడియా వెంటాడింది. పోలీసు దర్యాప్తును ఎదుర్కొన్నారు. సుశాంత్ మరణంలో రియా, ఆమె కుటుంబం ప్రమేయం ఉండి ఉంటుందని న్యూస్ టీవీ ఘోషించింది. తొలుత ప్రైమ్ టైమ్ టీవీ కథనాలు సుశాంత్ ఆత్మహత్య చేసుకునేలా అతడిని రియా, ఆమె కుటుంబమే ప్రేరేపించి ఉంటుందని సూచించాయి. ఆ తరువాత సుశాంత్ ఆత్మహత్య చేసుకోలేదని, హత్యకు గురయ్యాడని, అందుకు జరిగిన కుట్రలో రియా భాగస్వామి అని అభియోగాలు మోపాయి. సుశాంత్ ఆస్తులను కైవశం చేసుకునేందుకు రియా కుట్ర పూరితంగా ప్రయత్నించిందని ఆరోపించిన న్యూస్ టీవీ ఒక అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ముఠాలో భాగస్వామిగా ఉందని కూడా ఆమెను చిత్రించాయి. ఇలా ఆ యువ నటి పట్ల ద్వేషపూరితంగా ఎడతెగని దుష్ప్రచారం చేశాయి. అంతేనా? సుశాంత్‌కు చేతబడి చేసిందని కూడా విమర్శించాయి. రియాను 'మంత్రగత్తె' అని పేర్కొంటూ ఆమెను తీవ్రంగా దూషించాయి. సామాజిక మాధ్యమాల వైఖరి మరింత ఘోరంగా, భయానకంగా ఉన్నది. 'సుశాంత్‌కు న్యాయం జరగాలి' అనే ఉద్యమాన్ని ఆరంభించాయి. సుశాంత్ విషాద మరణానికి రియానే కారకురాలు అని గొంతుచించుకున్నాయి. ఈ ఆరోపణలు ఏవీ అప్పుడూ ఇప్పుడూ రుజువు కానేలేదు. అవి పూర్తిగా నిరాధారమైనవి. అయినప్పటికీ ఆమె ఒక నెలరోజుల పాటు జైలు వాసం చేయవలసివచ్చింది. న్యూస్ టీవీ తీరుతెన్నుల ఫలితంగానే ఈ శోచనీయమైన పరిణామాలు సంభవించాయి.



రియాపై విమర్శలు, ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఇప్పుడు రుజువయింది. మరి ఐదు సంవత్సరాల క్రితం అప్పుడే ప్రారంభమైన వృత్తి జీవితం దాదాపుగా అంతమై పోయింది. ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లదలుచుకున్న ఆమె సోదరుడి స్వప్నాలను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో దర్యాప్తు ఛిద్రం చేసింది. రియా తండ్రి సైనిక వైద్యుడు. పాతికేళ్లకు పైగా మన భౌగోళిక సరిహద్దుల రక్షకులకు ఆయన వైద్య సేవలు అందించారు. అయినా మీడియాలోని తోడేళ్ల గుంపు ఆయన్నీ వదలలేదు. తమ ఛానెల్‌కు టీఆర్‌పీ రేట్లను పెంచడమే లక్ష్యంగా పనిచేసే న్యూస్ యాంకర్ల మూలంగా ఒక మధ్యతరగతి వృత్తి నిపుణుల కుటుంబం సర్వనాశనమయింది. ఇదంతా కోవిడ్ విలయంలో చోటుచేసుకున్న మరో విషాదం. దేశమంతా లాక్‌డౌన్‌లో మగ్గిపోయిన కాలమది. సామాజిక దూరం నిబంధనలు పాటించేందుకు ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయిన రోజులవి. అటువంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితిలో తీసుకోవలిసిన జాగ్రత్తలపై ప్రజలకు మార్గదర్శకత్వం వహించాల్సిన మీడియా 'ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం' పేరిట పూర్తిగా అవాంఛనీయమైన వార్తలతో ప్రజలను తప్పుడు రీతుల్లో ఉద్దీపింపచేయడం జరిగింది.

రియా చక్రవర్తి దురవస్థ నొక్కి చెప్పుతున్నదేమిటి? స్పర్థాత్మక మీడియా జగత్తులో ఒకటి రెండు మినహాయింపులతో న్యూస్ నెట్‌వర్క్స్ అన్నీ తమ నైతిక దిక్సూచిని కోల్పోయాయనే కదూ! 1990ల నడిమి సంవత్సరాలలో ఎంతో ఆశాజనకంగా ఆరంభమైన ప్రైవేట్ న్యూస్ టీవీ విప్లవాన్ని, టెలివిజన్ రేటింగ్ పాయింట్స్‌లో ప్రథమ స్థానంలో ఉండి తీరాలనే ఆరాటంతో అనైతిక మార్గంలో ముందుకు సాగిన మీడియా సంస్థలు పూర్తిగా వ్యర్థపరిచాయి. ఆ విప్లవం నిరర్థకమైపోయింది. అర్థవంతంగా జరగవలసిన వార్తా నివేదన అనవసర సంచలనాత్మకత సంతరించుకోవడం సాధారణమైపోయింది. అసలు ఘటనలపై కాకుండా ఏవో ఘోషలు, గందరగోళాలపైకి దృష్టి మళ్లేలా చేయడంలో న్యూస్ టీవీ ఆరితేరిపోయింది. దుష్ట స్వభావాలు, స్త్రీ ద్వేషం వలలో రియా చిక్కుకుపోయింది. ఒక స్వతంత్ర మహిళ, తన సొంత పేరు ప్రతిష్ఠలకు బాధితురాలు అయింది. లోకులను హీరోలు, విలన్లుగా విభజించిన మీడియా జగత్తు రియాను ఒక వగలాడి, లేదా దుష్టురాలుగా పరిగణించింది. 'సుశాంత్ ప్రభవిస్తున్న నటుడు. ఉజ్వల భవిష్యత్తు ఉన్నవాడు. రియాకు సహచరుడు. అమాయకుడు అయిన ఆ యువ నటుడిని ఆ 'స్వార్థ స్వభావి' తన సుఖ సౌఖ్యాలు, వృత్తిగత ఎదుగుదలకు తెలివిగా ఉపయోగించుకుంది'. వార్తల ముసుగులో ప్రసారితమవుతున్న టీవీ సీరియల్స్‌కు ఇంతకంటే మంచి ఇతివృత్తం మరొకటి ఉంటుందా?

ఇక ఇప్పుడు అసలు ప్రశ్నకు వస్తాను: రియాను దూషించిన, ఆమె గౌరవాన్ని మంటగలిపిన వారిని తమ దుర్మార్గానికి జవాబుదారీలుగా చేయడం ఎప్పటికైనా జరుగుతుందా? రియా ఉదంతం కేవలం ఒక వ్యక్తి పరువుకు నష్టం కలిగించిన వ్యవహారం మాత్రమే కాదు. జర్నలిస్టులు అందరూ వార్తారచన ప్రక్రియలో పొరపాట్లు చేసే అవకాశమున్నది. తప్పుడు సమాచారమందించినందుకు పాత్రికేయులు తరచు లేదా అప్పుడప్పుడు క్షమాపణలు చెప్పుతుండడం కద్దు. అయితే రియా కేసు భిన్నమైది. అది అధర్మ పాత్రికేయానికి ఒక తిరుగులేని నిదర్శనం. సుశాంత్ ఆత్మహత్య విషయంలో తాను చెప్పవలసిన విషయాలను వెల్లడించేందుకు అవకాశం లభించని ఒక నిస్సహాయ యువతి జీవితాన్ని గౌరవాన్ని మంటగలిపేందుకు బుద్ధిపూర్వకంగా చేసిన ప్రయత్నమది. ఆ క్లిష్ట కాలంలో ఆమె గోడు ఎవరు విన్నారు? ఆగస్టు 2020లో కన్నీటి పర్యంతమవుతూనే విరాగినిలా నిర్లిప్తంగా ఉండిపోయిన రియాను నేను ఇంటర్వ్యూ చేశాను. ఆమెతో మాట్లాడడానికి, ఆమె చెప్పేదాన్ని స్థిమితంగా, సానుభూతితో వినడానికి ప్రప్రథమంగా జరిగిన ప్రయత్నమది. ఆమెతో సంభాషించడం ద్వారా ఒక పాత్రికేయుడుగా నా విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాను. అయితే రియాను ఇంటర్వ్యూ చేసినందుకు సామాజిక మాధ్యమాలలో నాపై నిరసన వెల్లువెత్తింది. నన్ను పదే పదే విమర్శించారు. దూషించారు. రియాను కాపాడేందుకు నేను ప్రయత్నిస్తున్నట్టు దుయ్యబట్టారు.

ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. రియా విషయంలో నా వైఖరి పూర్తిగా కాకపోయినప్పటికీ సరైనదేనని రుజువయింది. రియా తీవ్ర వ్యాకులత నెదుర్కొన్నది. అయితే ధైర్యంగా నిలబడింది. ఆమె నిజాయితీ నిరూపితమయింది. ఆమె జీవితంలో ఆశాజ్యోతి కొడిగట్టలేదు.. అయితే రియా ఎదుర్కొన్న భయానక పరిస్థితులు ముగింపునకు వచ్చేది ఆమెను ఆ కష్టాల పాలుచేసినవారు తమ దుర్మార్గానికి భారీ మూల్యం చెల్లించేలా చేసినప్పుడే అని నిక్కచ్చిగా చెప్పుతున్నాను. న్యూస్ టీవీ విశ్వసనీయతను, మీడియాపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించాలంటే రియాకు ఎదురైన అనుభవాలు పునరావృతం కాకూడదు. రియా తన జీవితంలో ఐదేళ్ల విలువైన కాలాన్ని కోల్పోయింది. కోల్పోయిన గౌరవాన్ని పొందేందుకు ఆమె పరిపూర్ణంగా అర్హురాలు. రియాకు బేషరతు క్షమాపణలు ఆమె గౌరవ పునరుద్ధరణకు శుభారంభం కాగలదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)



● ఇఫ్తార్ విందులో సీఎం



నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో గురువారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఆయనకు ముస్లిం మతపెద్దలు స్వాగతం పలికారు. పవిత్ర గ్రంథం ఖురాన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి చంద్రబాబు ఇఫ్తార్ విందు అందుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.









● కాలుతున్నాయ్..!

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు మండుటెండలో ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌రోడ్డుపై భక్తుల రాకపోకలకు చలువ పందిరి వేసినప్పటికీ.. కొన్ని ప్రాంతాల్లో భక్తులు ఎండలో నడవలేకపోతున్నారు. కాళ్లకు చెప్పులు కూడా లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఓం టర్నింగ్ నుంచి ఆలయం వరకు వైట్ పెయింట్ వేయించినా ఫలితం లేకపోవడంతో కాలు కాలకుండా పట్టాలు ఏర్పాటుచేసి వాటిపై నీరు చల్లాలని భక్తులు కోరుతున్నారు.

అన్నదాన విభాగంలో అవినీతి భోజనం



కూరగాయలు తరుగుతున్న సేవాబృందం సభ్యులు

దుర్గగుడి అన్నదాన విభాగంలో ఉద్యోగుల చేతివాటం

మూడు నెలల సిబ్బంది బిల్లులు రూ.20 లక్షలట..!

- ఆలయ సిబ్బందితో పాటు ఉచిత సేవా సభ్యుల పేర్లు కూడా..
- కమీషన్లు, మామూళ్ల డబ్బుతో సిబ్బందికి వేతనాలు
- బిల్లులు వచ్చాక పంపకాలకు ఉద్యోగుల ప్రయత్నాలు
- ఈవో తనిఖీల్లో బయటపడిన నిజాలు

ఇంద్రకీలాద్రి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు పెద్ద ఎత్తున బిల్లులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విభాగంలో పనిచేసే సిబ్బందికి మూడు నెలల్లో సుమారు రూ.20 లక్షల బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. ఈ పెండింగ్ బిల్లులపై దేవస్థాన ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ప్రత్యేక దృష్టిసారించి తనిఖీ చేయగా, అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

అవినీతి బయటపడిందిలా..

అన్నదాన విభాగ సిబ్బంది కాంట్రాక్ట్ గడువు గత ఏడాది నవంబరు 15న ముగిసింది. ఆ కాంట్రాక్టర్ 30 మంది సిబ్బందిని మిగతా 4లో..

బిల్లులు వచ్చాక పంపకాలు

అన్నదాన విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి ఆ విభాగంలో పనిచేసే పలువురు ఉద్యోగులు తమకు వచ్చే కమీషన్లు, మామూళ్ల డబ్బుతో జీతాలు చెల్లించినట్లు దేవస్థానం అధికారులే చెబుతున్నారు. బకాయి బిల్లులు వచ్చాక ఆ డబ్బును ఆ విభాగంలో ఉన్న ఉద్యోగులు పంచుకోవటానికి స్కెచ్ వేసినట్లు తెలిసింది. దేవస్థానం ఉన్నతాధికారులు అన్నదానం విభాగంలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా, రోజూ సేవాబృందం సభ్యులు, దేవస్థానం తరఫున ఎంతమంది పనిచేస్తున్నారన్న విషయాలు బయటపడే అవకాశం ఉంది. ఆడిట్ అధికారులు కూడా ప్రత్యేక దృష్టిసారించి అమ్మవారి సొమ్ము పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దుర్గమ్మను దర్శించుకున్న భక్తులకు అందించే అన్నప్రసాదంలో కూడా పలువురు ఉద్యోగులు తమ చేతివాటం ప్రదర్శిస్తుండటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, దుర్గమ్మకు సేవ చేయాలని పలు సేవాబృందాల సభ్యులు ఎంతో ఆనందంగా దేవస్థానానికి వస్తుంటారు. అలాంటివారిని అవకాశంగా తీసుకుని దేవస్థానంలో కొందరు ఉద్యోగులు తమ జేబులు నింపుకొంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

● ఏఎంసీ మాజీ చైర్మన్‌పై చర్యలు తీసుకోండి

లేదంటే రాజీనామా

టీడీపీ అధిష్ఠానానికి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి అల్టిమేటం

లైంగిక ఆరోపణలున్న వ్యక్తిపై చర్యలెందుకు తీసుకోరని ప్రశ్న



- 48 గంటల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని వెల్లడి
- ఎంపీ ఆఫీసులో మూల్పూరి కిషోర్‌కు ట్రాక్టర్ ఇచ్చాడని ఆరోపణ
- రమేశ్‌రెడ్డి కనిపిస్తే చెప్పు తెగే వరకు కొడతానని ఆగ్రహం
- నిరసన వ్యక్తం చేసిన మహిళలతో కలిసి కొలికపూడి వ్యాఖ్యలు

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరోమారు వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కారు. ఇప్పటికే అనేక ఆరోపణలతో వివాదాస్పదమైన ఆయన.. గురువారం అధిష్ఠానానికే అల్టిమేటం ఇచ్చారు. లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అలవాల రమేశ్‌రెడ్డిపై 48 గంటల్లోపు చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాననడంతో తిరువూరు రాజకీయం మరోసారి రచ్చకెక్కింది.

తిరువూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అలవాల రమేశ్‌రెడ్డిపై 48 గంటల్లోపు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అల్టిమేటం జారీ చేశారు. రమేశ్‌రెడ్డి నిర్వాకాలను ఇప్పటికే పార్టీ దృష్టికి తీసుకెళ్లానని, 48 గంటల్లోగా చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని గట్టిగా చెప్పారు. తిరువూరులోని ఎమ్మెల్యే కొలికపూడి నివాసానికి గురువారం ఏకొండూరు మండలంలోని పలు గిరిజన తండాలకు చెందిన మహిళలు వచ్చి నిరసన తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, పనుల కోసం వెళ్లేవారిని కామవాంఛ తీర్చమంటున్నాడని వారంతా వాపోయారు. రుణం కావాలని అడిగిన మహిళను లొంగదీసుకునేందుకు తీవ్ర ఒత్తిడి తెచ్చాడని తెలిపారు. మహిళలతో నీచంగా ప్రవర్తిస్తున్న రమేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే కొలికపూడి స్పందించారు. రమేశ్‌రెడ్డి మిగతా 4లో..

తిరువూరులో ఓపెన్ డిబేట్‌కు రండి

నియోజకవర్గంలో తానేమీ చేయకపోయినా నేరాలు, ఘోరాలు జరుగుతున్నాయని చాలామంది చెబుతున్నారని, నాపై మీడియాలో, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారు తిరువూరు జనాలను తన గురించి అడగాలన్నారు. ఎక్కడో హైదరాబాద్, విజయవాడలో కూర్చుని యూట్యూబ్‌లో వీడియోలు పెట్టే వారికి సమాధానం చెప్పడానికి ఒక్క నిమిషం చాలన్నారు. నాపై మూడుసార్లు ఆరోపణలు చేశారని, ఒక్క దానికైనా సాక్ష్యం ఉందా అని ప్రశ్నించారు. తనపై ఆరోపణలు చేసే వారెవరైనా తిరువూరులో ఓపెన్ డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు.

రుణాలిస్తామని తీసుకొచ్చారు

- ఎమ్మెల్యే మమ్మల్ని బలి పశువుల్ని చేశారు
- రమేశ్‌రెడ్డిపై ఆరోపణలు మాకు తెలియవు
- స్పష్టంచేసిన గిరిజన మహిళలు

4లో



అంకితభావంతో పనిచేస్తే కొడతారా?

- ఎమ్మెల్యే నన్ను రూ.2 కోట్లు అడిగారు
- ఇవ్వలేదని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు
- ఏఎంసీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

4లో

ఉప సర్పంచేల ఎన్నికల్లో కూటమి జోష్

ఉమ్మడి కృష్ణాలో 21 గ్రామ పంచాయతీలకు ఎన్నిక

- కూటమి 12 స్థానాలు, వైసీపీ 9 స్థానాలు కైవసం
- కొన్నిచోట్ల ఏకగ్రీవం.. మరికొన్నింట పరస్పర ఒప్పందం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీకి చెందినవారు మెజారిటీ స్థానాలు సాధించారు. పార్టీ రహితమే అయినా రాజకీయ మూలాలు కలిగి ఉండటంతో ఈ ఎన్నికలు కూడా ఉత్కంఠభరితంగానే జరిగాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 21 గ్రామ పంచాయతీలకు గానూ కూటమికి చెందిన అభ్యర్థులు 12 ఉపసర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. వైసీపీకి చెందినవారు 9 పొందారు. ఎన్టీఆర్ జిల్లాలో నాలుగు గ్రామ పంచాయతీలకు ఉపసర్పంచ్ ఎన్నికలు జరగ్గా, రెండు కూటమి, మరో రెండు వైసీపీకి చెందినవారు కైవసం చేసుకున్నారు.

ఎన్నికలు ఇలా..

- కృష్ణాజిల్లాలో మొత్తం 17 ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అన్నీ ఏకగ్రీవమయ్యాయి. పదింట్లో కూటమికి చెందినవారు, ఏడింట్లో వైసీపీకి చెందినవారు ఎన్నికయ్యారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, టీడీపీకి చెందిన ఎవరినీ వార్డు మెంబర్లుగా పోటీ చేయనివ్వకుండా చేసింది. అప్పట్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీ అత్యల్ప స్థానాలనే కైవసం చేసుకున్నప్పటికీ ప్రస్తుతం జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికల్లో కూటమికి చెందినవారే మెజారిటీ స్థానాలు పొందడం విశేషం. సాధారణ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘన విజయ ప్రభావం స్థానిక పంచాయతీలపైనా కొనసాగిందనే చెప్పవచ్చు.
- ఎన్టీఆర్ జిల్లాలో రామవరప్పాడు, కృష్ణాజిల్లాలో వణుకూరు పంచాయతీల్లో గతంలో ఓ ఒప్పందం ఉంది. ఉప సర్పంచ్ స్థానాలను టీడీపీ, వైసీపీ చెరి రెండున్నరేళ్లు పరిపాలించాలని నిర్ణయించుకున్నాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగించాయి. దీంతో మిగతా 4లో..

పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను పెంచాం



హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడి

- జగ్గయ్యపేట సర్కిల్‌లో 509 సీసీ కెమెరాలు వర్చువల్‌గా ప్రారంభం

4లో

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత. చిత్రంలో సీపీ రాజశేఖరబాబు, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య తదితరులు

కుప్పకూలిన కోల్డ్ స్టోరేజీ

పూర్తిగా అదుపులోకి వచ్చిన మంటలు

- పూర్తిగా కూలిపోయిన స్టోరేజీ భవనం
- ముగిసిన ఫైర్ అధికారుల ఆపరేషన్

4లో



నాడు



నేడు

ముచ్చటగా మూడోసారి

పాల రైతులకు విజయ డెయిరీ మూడో విడత రూ.18 కోట్ల బోనస్

- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,200 కోట్ల టర్నోవర్
- వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1,350 కోట్లు లక్ష్యం
- పాలకవర్గ సమావేశంలో చైర్మన్ చలసాని ఆంజనేయులు



మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు, వేదికపై పాలకవర్గ సభ్యులు

చిట్టినగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) పాల రైతులకు మూడో విడత రూ.18 కోట్ల బోనస్ ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పాల రైతులకు బోనస్‌ను ప్రకటించడం ఇది మూడోసారి. ఆగస్టులో రూ.18 కోట్లు, డిసెంబరులో రూ.14 కోట్ల బోనస్‌ను ప్రకటించారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులో రూ.1,200 కోట్ల మేర టర్నోవర్‌ను సాధించారు. ఈ క్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1,350 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. గురువారం మిగతా 4లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-19 (శుక్రవారం సాయంత్రం)

సహర్ : 04-52 (శనివారం ఉదయం)



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

మెట్రో భూ సేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మెట్రో భూ సేకరణ ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని, ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎంఆర్‌సీఎల్) అందించిన ప్రతిపాదనల ప్రకారం ఉమ్మడి తనిఖీలకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం జరిగిన మెట్రో రైలు కార్పొరేషన్ బోర్డు సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. సమావేశంలో మెట్రో రైలు ప్రాజెక్టు భూ సేకరణ అంశాల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వరకు చూస్తే విజయవాడ సెంట్రల్, విజయవాడ ఉత్తర, విజయవాడ తూర్పు, విజయవాడ గ్రామీణ మండలాల పరిధిలో దాదాపు 10 ఎకరాల సేకరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నిత్యావసరాల ధరలపై పటిష్ఠ పర్యవేక్షణ

వినియోగదారుల ప్రయోజనాలకు భరోసా కల్పించేలా కూరగాయలు, ఇతర నిత్యావసరాల ధరలపై పటిష్ఠ పర్యవేక్షణ అవసరమని, బ్లాక్ మార్కెట్ వంటి చర్యలకు పాల్పడకుండా నిఘాతో పాటు అప్రమత్తత అవసరమని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లాస్థాయి ధరల పర్యవేక్షణ, నియంత్రణ, మార్కెట్ జోక్యం కమిటీ సమావేశం జరిగింది. పౌరసరఫరాలు, మార్కెటింగ్, వ్యవసాయం, ఉద్యాన తదితర శాఖల అధికారులతో పాటు వ్యాపార, వాణిజ్య సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ కృష్ణచైతన్య, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, రైసు మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠను పెంపొందించాం

● హోంమంత్రి వంగలపూడి అనిత

జగ్గయ్యపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠ ఇనుమడించిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం పట్టణంలోని బీ కన్వెన్షన్ హాల్‌లో జగ్గయ్యపేట సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 509 సీసీ కెమెరాలను ఆమె వర్చువల్‌గా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్య, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, విజయవాడ సీపీ రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థ అప్రతిష్ఠపాలైందని, కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు పోలీసుల పనితీరులో మార్పు తీసుకువచ్చారన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, టెక్నాలజీ సాయంతో ఎన్టీఆర్ జిల్లా పటిష్ఠంగా మారిందని, సంపూర్ణ సీసీ కెమెరాలున్న నియోజకవర్గంగా జగ్గయ్యపేట రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల నేరాలను నియంత్రించవచ్చన్నారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతు ప్రజా భాగస్వామ్యంతో ఉత్తమ పోలిసింగ్ సాధ్యమైతుందన్నారు. మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నందిగామ ఏసీపీ తిలక్, ట్రైనీ ఐపీఎస్ మనీషారెడ్డి, జగ్గయ్య పేట సీఐ పీ.వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట సర్కిల్ ఎస్సైలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



శక్తియాప్ బ్రోచర్లను విడుదల చేస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, ఎమ్మెల్యేలు తాతయ్య, సౌమ్య, సీపీ రాజశేఖర్ తదితరులు

కోల్డ్ స్టోరేజ బాధిత రైతులను ఆదుకుంటాం

తొర్రగుంటపాలెంలో సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజి అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. గురువారం జగ్గయ్యపేటలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమెను భీమవరం గ్రామానికి చెందిన బాధిత రైతులు కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ కష్టార్జితమంతా కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల బూడిదైపోయిందని, కనీసం కూలీలకు కూలీ ఇవ్వాల్సిన డబ్బులు కూడా లేవని, సర్వస్వం కోల్పోయామని వాపోయారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని, కోల్డ్ స్టోరేజిలో జరిగిన ప్రమాదం ఉద్దేశపూర్వకంగా చేసిందా లేదా ప్రమాదవశాత్తు జరిగిందా అని పోలీసులు విచారిస్తారన్నారు. ప్రమాదం జరిగి మూడు రోజులైందని, రైతుల్లో ఆందోళన, బాధ ఉండటం సమంజసమేనన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ రైతులకు న్యాయం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



బాధితులతో మాట్లాడుతున్న హోంమంత్రి

కుప్పకూలిన కోల్డ్ స్టోరేజి

» ముగిసిన ఫైర్ అధికారుల ఆపరేషన్

జగ్గయ్యపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మూడురోజుల క్రితం పట్టణంలోని తొర్రగుంటపాలెంలో అగ్ని ప్రమాదానికి గురైన సాయి తిరుమలగిరి కోల్డ్ స్టోరేజీ భవనం గురువారం పూర్తిగా కుప్పకూలిపోయింది. బుధవారం మధ్యాహ్నం మిర్చి, అపరాలు నిల్వఉంచిన బ్లాక్ వరకు కూలిపోగా, గురువారం మిగిలిన భాగం కుప్పకూలింది. మూడురోజులుగా జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏడు ఫైరింజన్లు, రెండు జేసీబీలు, 30మందికి పైగా సిబ్బంది శ్రమించి స్టోరేజి భవనాన్ని కూల్చివేశారు. మిర్చి కోరు, వేడి గాలులు, ఎండ వేడిమికి తట్టుకోలేక సిబ్బంది కోల్డ్ స్టోరేజిలోకి వెళ్లే మార్గం లేకపోవటంతో నీటిని, ఫోమ్‌ను పిచికారీ చేశారు. జగ్గయ్యపేట, నందిగామ, విస్సన్నపేట, గుడివాడ, విజయవాడల నుంచి ఫైరింజన్లతో పాటు రామ్‌కో, కేసీపీ సంస్థల ఫైరింజన్లను వినియోగించారు. డీఎఫ్‌ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. కోల్డ్ స్టోరేజిల్లో ఈ స్థాయి ప్రమాదం జిల్లాలో జరగలేదని, సిబ్బంది కృషితో మంటలను ఆర్పి, కోల్డ్ స్టోరేజిని కూల్చగలిగామని చెప్పారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



కుప్పకూలిన కోల్డ్ స్టోరేజి, దగ్ధమైన మిర్చిలో నుంచి వస్తున్న పొగలు

రాష్ట్రానికి రూ.555 కోట్ల విలువైన

612 కి.మీ రహదారి పనులు మంజూరు

● పార్లమెంట్‌లో ఎంపీ శివనాథ్ ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

వన్‌టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్ నుంచి పీఎం జన్మన్ పథకం కింద ఇప్పటి వరకు 206 రహదారులకు ప్రతిపాదనలు వచ్చాయని, ఇంకా 9.77 కి.మీ పొడవు రహదారి, 27 పొడవాటి స్పాన్ బ్రిడ్జిలు గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నమోదు చేసిందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కింద అమలవుతున్న ఈ కార్యక్రమంలో 2023, 2034లో కీలకమైన గిరిజన ప్రాంతాలుండే ప్రదేశాల్లో 315.538 కిలో మీటర్ల పొడవు రహదారికి గాను 130 రహదారి పనులకు మంజూరు లభించిందని, ఇందుకుగాను రూ.280.53 కోట్లు, 2024-2025లో 297.180 కిలో మీటర్ల పొడవు రహదారికిగాను 76 రహదారి పనులకు మంజూరు లభించిందని, ఇందుకుగాను రూ.275.7 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తంగా ఏపీలో 612.718 కిలో మీటర్ల పొడవు రహదారికిగాను 200 రహదారి పనులు మంజూరయ్యాయని, ఇందుకు 555.60 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. అయితే మంజూరైన రహదారి పనుల పనితీరును పరిశీలించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి ప్రత్యేక అధ్యయనం చేపట్టలేదన్నారు.

బాలికను గర్భవతిని చేసిన నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయవాడ లీగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసి గర్భవతిని చేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానీ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో నివసించే ఫిర్యాదికి వివాహమై భర్త, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె (13) 8వ తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన ప్రసాద్ (19) అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి శారీరకంగా అనుభవించాడు. ఫలితంగా బాలిక గర్భవతి అయింది. దీంతో జూటూరి దుర్గాప్రసాద్‌పై బాలిక తల్లి కొత్తపేట పోలీసు స్టేషన్‌లో 2022 జూలై 12న ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో, తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ వి.కృష్ణవేణి 14మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ జరిమానాలో నుంచి బాలికకు రూ.15 వేలు చెల్లించడంతో పాటు రూ.4 లక్షల నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ సర్వీస్ అథారిటీ వారిని ఆదేశించారు.

రవాణా ఉద్యోగుల సంఘం జోనల్

అధ్యక్షుడిగా మూడోసారి రాజుబాబు

● ఎన్జీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్ అభినందన

కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమాలు విజయవంతం చేయడంలోనూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను జిల్లా నుంచి రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడంలో ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రాజుబాబు కృషి చేశారని, రవాణా శాఖ ఉద్యోగుల సంఘానికి మూడోసారి జోనల్ అధ్యక్షుడిగా ఎన్నికల కావడం అభినందనీయమని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ అన్నారు. రవాణా శాఖ ఉద్యోగుల సంఘానికి జోనల్ అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన సందర్భంగా ఎం.రాజుబాబు గురువారం సాయంత్రం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో ఎన్జీవో రాష్ట్ర నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణా శాఖ ఉద్యోగుల సంఘం నేతలు కేవీవీ నాగమురళి, కె.రామచంద్రరాజు, రంగారావు, రంజిత్ కుమార్ నాయుడు, భారతి ప్రసాద్, శాంతిశ్రీ పాల్గొన్నారు.

ఆస్తి, అభివృద్ధికి ఊతమిచ్చే చరిత్రాత్మక సంస్కరణ

● క్రెడాయ్ ఏపీ అధ్యక్షుడు బాయన శ్రీనివాస్

కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాన్-అగ్రికల్చరల్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ (నాలా) చట్టాన్ని రద్దు చేయడాన్ని హర్షిస్తోందని క్రెడాయ్ ఏపీ అధ్యక్షుడు బాయన శ్రీనివాస్ తెలిపారు. గురువారం క్రెడాయ్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చరిత్రాత్మక సంస్కరణ రియల్ ఎస్టేట్ రంగానికి ఆర్థిక, పరిపాలనా భారాన్ని తగ్గించేందుకు తోడ్పడుతుందన్నారు. క్రెడాయ్ చైర్మన్ బుద్దిగా శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు రాష్ట్ర ప్రభుత్వానికి క్రెడాయ్ కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు.

మాజీమంత్రి కొడాలి నానికి గుండె సమస్య: దుక్కిపాటి

గుడివాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొడాలి నాని గుండె సమస్యలతో బాధపడుతున్నట్టు ఆయన ముఖ్య అనుచరుడు, వైసీపీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నానికి హృద్రోగ సమస్యలున్నాయని వైద్యులు నిర్ధారించారన్నారు. మూడు వాల్వ్ బ్లాక్ అయినట్టు గుర్తించారని, త్వరలోనే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపినట్టు పేర్కొన్నారు. గుడివాడలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు గురవుతారనే ఉద్దేశంతో నాని ఈ విషయాన్ని తెలపలేదన్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వైద్యులతో మాట్లాడి నానికి ఉన్న అనారోగ్యంపై వాకబు చేశారన్నారు. త్వరలోనే నాని కోలుకుని ప్రజాక్షేత్రంలోకి వస్తారని దుక్కిపాటి తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి

● ఆర్టీసీ పెన్షనర్స్ నిరసన

బస్టేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం (రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో గురువారం పండిట్ నెహ్రూ బస్టేషన్ ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరు, చిత్తూరు, గుంటూరు, కృష్ణా, ఒంగోలు, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సిటీ బస్టాండ్ అరైవల్ బ్లాక్ వరకు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ వెళ్లారు. సంస్థ ఎండీ అందుబాటులో లేనందున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు, అధ్యక్షుడు గద్దే రవీంద్రరావు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఉప ప్రధాన కార్యదర్శి వీపీ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు కె.కోటేశ్వరరావు, బి.డి.ఆర్. రెడ్డి, కోశాధికారి కె.రాజారావు, మహిళా ప్రతినిధి పిన్నమనేని సత్యవతి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు బహిష్కరణ నిర్ణయం దారుణం

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షుబ్లీ

మొగల్రాజపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ఇఫ్తార్ విందును బహిష్కరించాలని కొన్ని సంఘాలు పిలుపునివ్వడం దారుణమని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ షుబ్లీ స్పష్టం చేశారు. మొగల్రాజపురంలో రాష్ట్ర కార్యాలయంలో ఆయన గురువారం పలు ప్రజాసంఘాల ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకున్నప్పటికీ చంద్రబాబు పరిపాలన దక్షత మొదటి నుంచి ముస్లింల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారన్నారు.

నిబంధనలకు అనుగుణంగా

నాణ్యత ఉంటేనే మద్దతు ధర

● ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్

కంచికచర్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, వ్యాపారులు దోపిడీ చేయకుండా శనగ రైతులకు రక్షణ కవచాలుగా ఉన్నాయని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26న 'మార్కెట్ కళకళ, మార్క్‌ఫెడ్ వెలవెల' అంటూ శనగ రైతుల పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఎండీ వివరణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్ఏక్యూ) కల్గిన వ్యవసాయ ఉత్పత్తులకు మాత్రమే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభిస్తుందన్నారు. యంత్రాలతో పంటను కోయించటంతో శనగల్లో మట్టిపెళ్లలు, రాళ్లు వచ్చాయన్నారు. ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం ఒక శాతం వరకు ఇతర పదార్థాలు ఉండవచ్చని, 100 గ్రాముల శనగల శాంపిల్స్‌లో 3 నుంచి 4 గ్రాముల వరకు ఇతర పదార్థాలున్నాయని, వీటిని నాఫెడ్ అంగీకరించదన్నారు. 8 మంది రైతులు ఇప్పటికే సీఎం యాప్‌లో నమోదు చేసుకున్నారని, వారి శాంపిల్స్ పరిశీలించగా, ప్రమాణాలకు అనుగుణంగా లేవన్నారు. ఎంఎస్‌పీ క్వింటా రూ.5650 ఉండగా, బయటి మార్కెట్లో రూ.5600కు లభిస్తోందన్నారు. ధర పెద్దగా తేడా లేనందున రైతులు బయటి మార్కెట్లో అమ్ముతున్నారని, అయితే ముున్ముందు ధర పెరుగుతుందన్న ఆశతో పలువురు రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారన్నారు. రైతులకు అండగా ఉండేదుకు ఎంఎస్‌పీకి కొనేందుకు ఏపీ మార్క్‌ఫెడ్ కట్టుబడి ఉందని, అయితే కేంద్రం క్వాలిటీ నార్మ్స్ ప్రకారం శనగలు ఉండాలన్నారు.

అన్నదాన విభాగంలో అవినీతి భోజనం

(3వ పేజీ తరువాయి)

నియమించుకుని విధులు నిర్వహించేవారు. ప్రతినెలా సుమారు రూ.5 లక్షలను దేవస్థానం సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించేది. కాంట్రాక్టర్ కాల పరిమితి ముగిశాక దేవస్థానమే సిబ్బందిని నియమించుకుని పనిచేయిస్తోంది. కాగా, ఓ సేవాబృందం నిర్వాహకుడు తమ సభ్యులను 30 మందిని రోజూ భక్తులకు సేవ చేయించేందుకు పంపిస్తున్నారు. ఆ బృందం సభ్యులు ఉదయం 7 గంటలకు అర్జున వీధిలో ఉన్న శృంగేరి మఠంలోని అన్నదాన విభాగంలోకి వెళ్లి, కూరగాయలు తరిగి, ఇతర పనులు చేసి ఆ తరువాత మహామండపం రెండో అంతస్థులో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తుంటారు. శుక్ర, శని, ఆదివారాల్లో సుమారు 50 మంది వరకు వస్తుంటారు. దీనినే అదునుగా చేసుకుని అన్నదాన విభాగంలోని ఆ ఇద్దరు అధికారులు.. సేవాబృందంలోని సుమారు 20 మంది కూడా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దేవస్థానం తరఫున పనిచేసే సిబ్బందితో కలిపి బిల్లులు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా మూడు నెలల బిల్లుల మొత్తం సుమారు రూ.20 లక్షలు పెండింగ్‌లో చూపినట్టు తెలుస్తోంది. ఈ బిల్లుల గురించి సంబంధిత ఉద్యోగులు పలుసార్లు ఈవో దృష్టికి కూడా తీసుకెళ్లారు. వీటిపై అనుమానం వ్యక్తం చేసిన ఈవో ఇటీవల అన్నదాన విభాగంలో తనిఖీలు నిర్వహించి పనిచేస్తున్న సిబ్బంది, సేవాబృంద సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది సేవాబృందం సభ్యులు విధుల్లో ఉండటాన్ని గమనించిన ఈవో వారి పేరుతో కూడా బిల్లులు పెట్టినట్లు గుర్తించి సంబంధిత ఉద్యోగులను నిలదీశారు. ఉచితంగా పనిచేసే వారి పేరుతో బిల్లులు ఎలా పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌పై చర్యలు తీసుకోండి.. లేదంటే రాజీనామా

(3వ పేజీ తరువాయి)

లైంగిక వేధింపుల విషయం ఇప్పటికే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లానని, 48 గంటల్లో చర్యలు తీసుకోకపోతే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు. 'ఎమ్మెల్యే అంటే నాకు భయమా, నాపై ఎంపీ ఈగవాలనివ్వడు. ఎంపీ ఆఫీసులో మూల్పూరు కిషోర్‌కు తనను కాపాడమని 4 ట్రాక్టర్లు, రూ.50 లక్షలు డబ్బు ఇచ్చాను.' అని రమేశ్‌రెడ్డి చెబుతున్నాడని, దీనిపై తాను విచారణ జరపగా, ఒక్క ట్రాక్టర్ ఇచ్చాడని తేలిందన్నారు. డబ్బు ఇచ్చిన విషయం మాత్రం తెలియదన్నారు. రమేశ్‌రెడ్డి తన దగ్గరకొచ్చినా, పార్టీ కార్యక్రమాల్లో కనిపించినా చెప్పు తెగేదాకా కొడతానని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను 10 రోజుల నుంచి ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు, పరిశీలకుడికి చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రమేశ్‌రెడ్డి ఆడియో విన్న తర్వాత నిలువునా పాతర వేయాలని అనిపించిందన్నారు. ఒక పెద్ద నాయకుడిని చెప్పాక.. రెండు మూడు రోజుల్లో చర్యలు ఉంటాయని భావించానని, కానీ అది జరగలేదన్నారు.

బ్యాలెన్స్‌గా, బాధ్యతాయుతంగా ఉంటున్నా..

శాసనసభ్యుడిగా ఉన్నందున చాలా బ్యాలెన్స్‌గా, బాధ్యతాయుతంగా, పార్టీకి ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో 12, 13 రోజుల నుంచి కంట్రోల్ చేసుకుని ఉంటున్నానని ఎమ్మెల్యే కొలికపూడి అన్నారు. ఒక గిరిజన మహిళ రుణం అడిగితే.. అసభ్యకరంగా మాట్లాడిన ఓ నాయకుడిపై ఇప్పటివరకు వరకు స్పందించలేదంటే ఎలా..? అని ప్రశ్నించారు. అదే ఇతర కులాల నాయకులైతే ఇలాగే స్పందిస్తారా? కులాలకు ఓ న్యాయమా? నాయకుడికి మరో న్యాయమా? అని పార్టీ పెద్దలను అడుగుతున్నానన్నారు. తండాల మహిళలు తమ సమస్యలను చెప్పుకొనేందుకు తిరువూరు వస్తుంటే, వైసీపీకి చెందిన నాయకులు వైకుంఠరావు, చిన్నయ్య దొరలు.. వారిని బెదిరింపు ధోరణితో అడ్డుకుంటున్నారని, తప్పుచేసిన టీడీపీ నాయకుడ్ని కాపాడేందుకు వైసీపీ నాయకులు ఎందుకు తాపత్రయపడుతున్నారని కొలికపూడి ప్రశ్నించారు. చివరకు ఒక పాస్టర్ సైతం ఫోన్ చేశారని ఆయన ఆరోపించారు. ఎ.కొండూరు గిరిజన తండాల్లో 320 మరుగుదొడ్ల నిర్మాణం పేరుతో రమేశ్‌రెడ్డి నిధులు కైంకర్యం చేస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి బలయ్యాడని ఎమ్మెల్యే ఆరోపించారు. నియోజకవర్గంలో వంద టిప్పర్లు మట్టి తోలకాలు చేస్తుంటే, మూడు టిప్పర్లపై కేసు నమోదు చేశారని, 97 టిప్పర్లను పట్టించుకోలేదని, మట్టి తోలకాల వెనుక ఎవరున్నారో నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే కోరారు. కేసులు నమోదు చేసిన టిప్పర్లు ఎవరివని, కేసులు నమోదు చేయని టిప్పర్లు ఎవరివని ప్రశ్నించారు.

రుణాలు ఇస్తామని తీసుకొచ్చారు..


- తూర్పుమాధవరం తండా మహిళలు



ఎ.కొండూరు : కూలిపనులు చేసుకుంటున్న తమకు లోన్లు ఇప్పిస్తామని, తండాకు చెందిన నాయకుడు ఒకరు మభ్యపెట్టి తిరువూరు తీసుకువెళ్లాడు. ఎమ్మెల్యే రాజకీయానికి మమ్మల్ని బలిపశువులుగా చేస్తున్నారు. రమేష్‌రెడ్డిపై ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలు ఏమాత్రం తెలియవు.. ఎమ్మెల్యే వ్యాఖ్యలకు కంగుతిని బయటకు వెళ్లిపోయాం. మమ్మల్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం తగదు.

పార్టీ కోసం పనిచేస్తే కొడతారా..

- ఆలవాల రమేష్‌రెడ్డి



ఎ.కొండూరు : ఎన్నికల్లో పార్టీ విజయానికి శ్రమించినందుకు, కొడతారా.. ఎమ్మెల్యే గారు.. ఎన్నికల అనంతరం తనను ఎమ్మెల్యే రూ.2 కోట్లు అడిగారు.. మండలంలో సిమెంట్ రోడ్లు కాంట్రాక్టు ఇస్తానని, 10 శాతం కమీషన్ ఇవ్వాలని కోరగా.. తాను ఒప్పుకోకపోవడంతో, తప్పుడు ఫోన్ సంభాషణలు రికార్డు చేయించి, తనపై తప్పుడు ప్రచారంచేసే నీచస్థాయికి ఎమ్మెల్యే దిగజారాడు. మూడు దశాబ్దాలుగా పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్నా. తండా ప్రాంతంలోనే నివాసం ఉంటున్నాం. ఏ ఒక్క గిరిజన కుటుంబమైనా నా వల్ల ఇబ్బంది పడినట్టు ఫిర్యాదు చేశారా.. ఎమ్మెల్యేగా తండాల అభివృద్ధి చేయకపోయినా తండా వాసుల్ని కుట్ర రాజకీయాలకు బలిచేసే యోచన ఎమ్మెల్యే విరమించుకోవాలి.

ముచ్చటగా మూడోసారి

(3వ పేజీ తరువాయి)

చిట్టినగర్‌లోని కృష్ణామిల్క్ యూనియన్‌లో పాలకవర్గ సమావేశం జరిగింది. చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ బోనస్ చెల్లింపుతో పాటు అధిక ధర చెల్లించడంలో కృష్ణా మిల్క్ యూనియన్ దేశంలోనే ముందువరసలో ఉందన్నారు. పాడి రైతులు, వినియోగదారులు రెండు కళ్లుగా పని చేస్తోందని, 72 రకాల పరీక్షలు చేసిన తర్వాత వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పాల పదార్థాలు అందిస్తోందని చెప్పారు. మూడో విడత బోనస్ ఏప్రిల్‌లో రూ.18 కోట్లు పంపిణీ చేస్తామన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్ల బోనస్‌ను మూడు విడతలుగా పాడి రైతులకు పంపిణీ చేశామని చెప్పారు. పాల సేకరణ ధర, బోనస్‌తో కలిపి సమితి పాడి రైతులకు కేజీ ఫ్యాట్‌కు రూ.902 చెల్లిస్తోందని, ఇది దేశంలోనే అత్యధిక ధర అన్నారు. నాణ్యమైన పశువైద్యం, సబ్సిడీపై పశుదాణా, పాల ఉత్పత్తిని మరింత పెంచేందుకు మేలు జాతి వీర్యాన్ని రూ.3 కోట్లు ఖర్చుచేసి పాడి రైతులకు సబ్సిడీపై ఈ ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేశామన్నారు. పాడి పశువుల షెడ్ల ఏర్పాటుకు, పశుగ్రాస అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక తోడ్పాటు ఎంతో ఆనందకరమంటూ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వరదల్లోనూ 'కామధేను' కార్యకలాపాలు

బుడమేరు వరద ముంపు సమయంలో 42 రోజులు విజయవాడ ఫ్యాక్టరీ మూతపడి రూ.24 కోట్ల నష్టం వాటిల్లినప్పటికీ ముందుచూపుతో నిర్మించిన కామధేను ఫ్యాక్టరీ కారణంగా, పాడి రైతులు, సమితి సిబ్బంది, వినియోగదారుల సహకారంతో రోజువారీ నిర్వహణలో ఎటువంటి ఆటంకం లేకుండా కార్యకలాపాలు సాగించామన్నారు. డాక్టర్ వర్గీస్ కురియన్ మార్గనిర్దేశాలకు అనుగుణంగా వినియోగదారుడి నుంచి ఆర్జించిన ప్రతి రూపాయిలో 85 శాతం పాడి రైతులకు అందజేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో విజయ డెయిరీ నూతన ఉత్పత్తులను ఆవిష్కరించి, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని చలసాని తెలిపారు. ఈ సమావేశంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, వుయ్యూరు అంజిరెడ్డి, అర్జా వెంకట నగేశ్, చలసాని చక్రపాణి, వీటీకేవీ సుబ్బారావు, వేమూరి సాయి వెంకటరమణ, పల్లగాని కొండలరావు, బొట్టు రామచంద్రరావు, పాలడుగు వెంకట రామ వరప్రసాద్, నెలకుదిటి నాగేశ్వరరావు, చెరుకూరి లవయ్య, నెక్కలపు వాణిశ్రీ, శనగల వెంకట శివజ్యోతి, మద్దుకూరి వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ల ఎన్నికల్లో కూటమి జోష్

(3వ పేజీ తరువాయి)

రామవరప్పాడు పంచాయతీలో వైసీపీకి చెందిన పాలకవర్గమే మెజారిటీగా ఉన్నప్పటికీ ఉప సర్పంచ్ స్థానాన్ని మాత్రం టీడీపీకి చెందిన వార్డు మెంబర్‌కు కేటాయించారు. నాటి ఒప్పందం ప్రకారం వైసీపీ ఉప సర్పంచ్ రాజీనామా చేశారు. కృష్ణాజిల్లాలోని కేసరపల్లి పంచాయతీలో పార్టీలకతీతంగా అభ్యర్థిని ఎంపిక చేసుకున్నారు. ఇలా కొన్ని పంచాయతీల్లో అందరికీ తెలిసేలా, మరికొన్నింటిలో ఎవరికీ తెలియకుండా పరస్పర ఒప్పందాల మేరకు ఏకగ్రీవం చేసుకున్నారు.

- నందిగామ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నందిగామ మండల పరిషత్‌లో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వైసీపీకి చెందినవారు 13 మంది, టీడీపీకి ఒక ఎంపీటీసీ స్థానం ఉంది. వైసీపీ ఎంపీటీసీ ఒకరు టీడీపీలోకి రావటంతో వైసీపీ 12, టీడీపీ 2 ఉన్నాయి. దీంతో ఎంపీపీగా కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ పెసరమెల్లి రమాదేవి పేరును ఆ పార్టీ ప్రతిపాదించగా, ఎన్నిక ఏకగ్రీవమైంది.

కృష్ణా జిల్లాలో గెలిచిన ఉపసర్పంచ్ స్థానాల వివరాలు ఇవీ :

మండలం	గ్రామం	పేరు	పార్టీ
పెడన	కాకర్లంపూడి	రావి విజయలక్ష్మి	జనసేన
పెడన	అచ్చయ్యవారిపాలెం	పామర్తి రాముడు	టీడీపీ
ఘంటసాల	శ్రీకాకుళం	శీలం శ్రీనివాసరావు	టీడీపీ
గుడ్లవల్లేరు	శేరికల్వపూడి	గోగులమూడి వెంకటేశ్వరమ్మ	టీడీపీ
గన్నవరం	కేసరపల్లి	జాస్తి శ్రీధర్‌బాబు	టీడీపీ
గన్నవరం	అల్లాపురం	గుండాల అచ్చయ్య	వైసీపీ
పమిడిముక్కల	తాడంకి	కొల్లి లక్ష్మి	వైసీపీ
పమిడిముక్కల	మంటాడ	కలాపురెడ్డి రమాదేవి	టీడీపీ
పమిడిముక్కల	అమీనాపురం	నందేటి దుర్గా ప్రవీణ్‌కుమార్	టీడీపీ
పమిడిముక్కల	ఫతేలంక	షేక్ లాల్ అహ్మద్	వైసీపీ
ఉంగుటూరు	పెదవుటపల్లి	మరీదు ఉషారాణి	టీడీపీ
తోట్లవల్లూరు	పెనమకూరు	పేరుబోయిన జేజమ్మ	వైసీపీ
తోట్లవల్లూరు	యాకమూరు	బూరి సాంబమూర్తి	వైసీపీ
గూడూరు	అకులమన్నాడు	బీ హరీష్	జనసేన
మోపిదేవి	నాగతిప్ప	పెనుమత్స లక్ష్మీ వెంకట రమణ	వైసీపీ
మచిలీపట్నం	భోగిరెడ్డిపల్లి	కొక్కిలగడ్డ రవి	జనసేన
పెనమలూరు	వణుకూరు	ఆరేపల్లి నాగరాజు	వైసీపీ

ఎన్టీఆర్ జిల్లా లో ఉపసర్పంచ్ స్థానాలు గెలిచిన వివరాలు ఇవీ :

మండలం	గ్రామం	పేరు	పార్టీ
జీ కొండూరు	కట్టుబడిపాలెం	బాణావత్తు వెంకటేశ్వరరావు	వైసీపీ
ఇబ్రహీంపట్నం	తుమ్మలపాలెం	నండూరి బేబి	టీడీపీ
వత్సవాయి	మంగొల్లు	మెట్టెల పద్మ	వైసీపీ
విజయవాడ రూరల్	రామవరప్పాడు	అద్దేపల్లి సాంబశివనాగరాజు	టీడీపీ



నందీశ్వరుడికి అభిషేకం



విజయవాడ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ మహానందీశ్వర స్వామికి గురువారం అభిషేకం, అర్చన జరిగింది. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్, అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఆలయ అభివృద్ధి దాత సంగా నర్సింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు అందజేశారు.

పేదలకు కూటమి నేతల అండ

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని సమాన స్థాయికి రావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధి నాల్గో డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గురువారం పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తన సొంత నిధుల నుంచి స్వయం ఉపాధి నిమిత్తం నిరుపేదలకు ఇస్త్రీబండి, టిఫిన్ బండి, రెండు తోపుడు బండ్లు, ఇద్దరికి ఆటో కొనుగోలుకు డౌన్ పేమెంట్ చెరో రూ. 30 వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరం ఉన్న ప్రతి చోట పేదలకు కూటమి నేతలు అండగా నిలబడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, దేవానంద్, టీడీపీ నేతలు చలసాని అజయ్ కుమార్, గుళ్ళపల్లి నాగేశ్వరారవు, జనసేన నాయకులు అమ్ములు, ఏపీఐఐసీ కాలనీ పెద్దలు, పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తదితరులు

ఆర్టీవో కార్యాలయం ప్రహరీ నిర్మాణానికి చర్యలు

లబ్బీపేట: నగరంలోని ఆర్టీవో కార్యాలయం ప్రహరీ నిర్మాణాన్ని త్వరలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురవారం ఆయన ఈ సమస్యపై రాష్ట్ర సెక్రటేరియట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీవో కార్యాలయం ప్రహరీని అధికారులతో కలిసి పరిశీలించి, కొత్తగా గోడ నిర్మించడానికి అంచనాలు తయారుచేయాలని ఆదేశించగా ఆర్‌అండ్‌బీ శాఖ రూ.15లక్షలు అవసరం అవుతుందని అంచనాలు రూపొందించారని తెలిపారు. దీనిపై సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేను కలిసి పరిస్థితిని వివరించి, వీలైనంత త్వరలో నిర్మాణం చేపట్టాలని కోరినట్లు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ప్రహరీ నిర్మాణం చేపడతారని ఆయన తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌కు అప్పులు చేసి యువకుడు ఆత్మహత్య

ఆటోనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ కోసం చేసిన అప్పులు తీర్చలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం పటమట పోలీస్‌స్టేషన్ పరిధి అయ్యప్పనగర్ నెహ్రూ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ఇల్లా లోకేష్(30) ఎలక్ట్రికల్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. గత కొంత కాలంగా అప్పులు చేసి క్రికెట్ బెట్టింగ్‌లు ఆడేవాడని తెలిపారు. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోవడంతో అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో ఉదయం తల్లిని సేమ్యా ఉప్మా తినాలని చెప్పాడు. తల్లి సేమ్యా తీసుకురావడానికి కిరాణా దుకాణానికి వెళ్లింది. ఆ సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని తాపీమేస్త్రి మృతి

ఆటోనగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని తాపీమేస్త్రి మృతి చెందిన ఘటన గురువారం పటమట పోలీస్‌స్టేషన్ యనమలకుదురు లాకుల రోడ్డు సూర్య బార్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం యనమలకుదురు జెండాచెట్టు సెంటర్‌కు చెందిన షేక్ మీరావలి(33) తాపీ పనిచేస్తు జీవనం సాగించేవాడు. మృతుడికి భార్య, 5 నెలల కుమారుడు ఉన్నారు. బుధవారం రాత్రి 10 గంటలకు తాపీ పని కోసం వెళ్లాడని తెలిపారు. ఈ క్రమంలో ఉదయం 7.30 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు స్థానికులు మీరావలి ఫోన్ నుంచి తల్లి షేక్ ఫాతిమున్నీసాకు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వి. పవన్ కిషోర్ తెలిపారు.

రామవరప్పాడు ఉప సర్పంచ్‌గా అద్దేపల్లి సాంబశివనాగరాజు

గుణదల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు ఉప సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు 6వ వార్డు సభ్యుడు అద్దేపల్లి సాంబశివనాగరాజు(సాంబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఈవోఆర్డీ ఎండీ ప్రసాద్ ప్రకటించారు. ఉప సర్పంచ్ పదవి టీడీపీ ఖాతాలో పడిపోవడం పంచాయతీలో మెజారిటీ సభ్యులంతా టీడీపీకి అనుకూలంగా వ్యవహరించడంతో చేసేది లేక వైసీపీ మద్దతుదారు సర్పంచ్ వరి శ్రీదేవి కూడా టీడీపీ అభ్యర్థికే మద్దతిచ్చారు. రామవరప్పాడు పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులు వైసీపీ ఖాతాలో ఉండేవి. నెల క్రితం ఉప సర్పంచ్ వంగూరి పుణ్యవతి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామాకు కారణాలు ఏమీ లేవని కొద్దికాలం రాజకీయాలకు దూరంగా ఉండాలన్న ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో ఉప సర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఉప సర్పంచ్‌ను చేజార్చుకోకూడదని వారం కితం వైసీపీ సభ్యులు ఎన్నికపై నిర్ణయం తీసుకునేందుకు సమావేశానికి హాజరు కావాలని సూచిస్తే 17 మంది సభ్యులకు 9మందే హాజరయ్యారు. ఉప ఎన్నికకు 24 గంటల ముందు వరకు వైసీపీ సభ్యులు ఓ సభ్యుడిని నిలబెట్టాలని ప్రయత్నించినా అతను ముందుగానే జారుకున్నారు. ఎన్నికకు హాజరుకావాలని వార్డు సభ్యులు 20మందికి అధికారులు ఆహ్వానాలు పంపితే 17మందే హాజరయ్యారు. అందులో ఇద్దరే వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. 18వ వార్డు సభ్యులు చిన్నా సుధను ఉపసర్పంచ్‌గా పోటీకి నిలబెడుతున్నట్లు 7వ వార్డు సభ్యురాలు లోకసాని లక్ష్మి ప్రతిపాదించినా సభ్యులు సానుకూలత వ్యక్తం చేయలేదు. ఉప సర్పంచ్‌గా రాజీనామా చేసిన వంగూరు పుణ్యవతి అద్దేపల్లి సాంబశివనాగరాజును ప్రతిపాదించారు. సభ్యులంతా మద్దతు ప్రకటించారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రసాదంపాడు మాజీ సర్పంచ్ బొప్పన హరికృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు గుజ్జర్లపూడి బాబూరావు తదితరులు అభినందనలు తెలిపారు. పంచాయతీ కార్యాలయానికి భారీ సంఖ్యలో చేరుకున్న టీడీపీ అభిమానులు అద్దేపల్లికి అభినందనలు తెలిపారు.



అద్దేపల్లి సాంబశివనాగరాజుకు అభినందనలు తెలియజేస్తున్న రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, టీడీపీ సీనియర్ నాయకులు ఆనంద్, హరికృష్ణ, బాబూరావు తదితరులు

పురస్కారాలు ప్రతిభకు దర్పణాలు

గోళ్ల నారాయణరావు



కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న గోళ్ల నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు తదితరులు

విజయవాడ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కళలనే ఆరాధిస్తూ శ్వాసిస్తూ ఉపాసించి నమ్ముకొని కుటుంబాన్ని పోషించుకునే కళాకారులకు అందించే పురస్కారాలు వారి ప్రతిభకు దర్పణాలని గోళ్ల నారాయణరావు అన్నారు. తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా గురువారం ప్రిన్స్ మీడియా సమావేశ మందిరంలో కళాకారులకు సత్కారం జరిగింది. నటీనటులు మండల లక్ష్మి, ఎస్.అనిత, పేరం వెంకటేశ్వరరెడ్డి, బి.మల్లీశ్వర పట్నాయక్, హార్మోనిస్ట్ కె.పరబ్రహ్మాచారి, గాయకులు శ్యాంప్రసాద్, చంద్రశేఖర్, డేవిడ్‌రాజు, అమ్ముల ఎస్ ప్రసాద్‌లకు దుశ్శాలువాలను కప్పి గౌరవించారు. అనంతరం గోళ్ల మాట్లాడుతూ కళాకారులకు ఇటువంటి చిరు సత్కారం కొంత తృప్తినిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాకారులను సత్కరించుకోవడం మన సంస్కృతిని మనం గౌరవించుకొన్నట్లేనన్నారు. చింతకాయల చిట్టిబాబు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్స్ సయ్యద్ అలీ, కారుమంచి రాజు పాల్గొన్నారు.

హనుమంతరాయ గ్రంథాలయంలో..

దృశ్యవేదిక సాంస్కృతిక సేవా సంస్థ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెలవారీ కార్యక్రమం గురువారం గాంధీనగరంలోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హర్ష క్రియేషన్స్, ఈపీఎస్ కళాసమితి, సాగర్ థియేటర్ ఆర్ట్స్, ఏపీ సెక్రటేరియట్ ఉమెన్ హెల్త్‌ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థలు ప్రహసనాలు చేసి అలరించాయి. తదుపరి ప్రదర్శించిన ఏకపాత్రాభినయనాలు కనువిందు చేశాయి. డాక్టర్ గుమ్మా సాంబశివరావు నాటక విశ్లేషణపై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడారు. కార్యక్రమాన్ని నటుడు, దర్శకుడు హెచ్‌వీఆర్‌ఎస్ ప్రసాద్ పర్యవేక్షించారు.



వివిధ గ్రామాల సర్పంచులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉండవల్లి శ్రీదేవి, బోడె, వర్ల తదితరులు

సైకిల్ దెబ్బకు సైకో పరార్

మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

- ముగ్గురు సర్పంచ్‌లు టీడీపీలో చేరిక

కంకిపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సైకిల్ దెబ్బకు సైకో బెంగుళూరు పరారయ్యాడని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. కంకిపాడు మండలంలోని ఉప్పులూరు గ్రామ సర్పంచ్ లాం సోనియా, తెన్నేరు సర్పంచ్ జుజ్జవరపు ఎలీషా, మారేడుమాక సర్పంచ్ చోడవరపు ఆదర్శకుమార్‌లకు ఎమ్మెల్యేలు బోడెప్రసాద్, వర్ల కుమార్ రాజాలతో కలిసి ఆమె టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దళితులను మాజీ సీఎం జగన్ అనేక అవమానాలకు గురి చేశారన్నారు. రాష్ట్ర ప్రజలతో మూడు ముక్కలాట ఆడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 9 నెలల్లో తొమ్మిది రోజులు కూడా ఖాళీగా కుర్చోలేదన్నారు. ఎమ్మెల్యే బోడె మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప్పులూరు గ్రామ అభివృద్ధికి రూ. కోటి మంజూరు చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ నాయకులు రాజా, రాధా కృష్ణమూర్తి,సుబ్రహ్మణ్యం, సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా

ఏడీఆర్‌ఎం పాల్ ఇమ్మానుయేల్

రైల్వేస్టేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్ల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పాల్ ఇమ్మానుయేల్ ఎడ్విన్ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ అనుబంధ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో వాసన్ ఐ కేర్, యాపిల్ డెంటల్ ఆసుపత్రుల సహకారంతో మెగా కంటి, దంత వైద్య శిబిరాలను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇమ్మానుయేల్ మాట్లాడుతూ పెన్షనర్ల సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వైద్యులు జాగర్లమూడి అనిల్ శేష్‌కుమార్, పెన్షనర్ల అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వర్లు, శివాజీ, సుబ్బరాజు, కర్నాలు సుకుమార్, అరుణ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు. 200 మంది దంత వైద్య పరీక్షలు చేయించుకుని వైద్య సలహాలు తీసుకున్నారు.

రైలు ఎక్కుతూ జారిపడి యువకుడి మృతి

రైల్వేస్టేషన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వేస్టేషన్ 4వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై బుధవారం రాత్రి కదులుతున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ప్రయత్నించి యువకుడు (35) జారి పడి మృతి చెందాడు. ఈ సంఘటనతో రైలును ఆపి మృతి చెందిన వ్యక్తిని గమనించారు. గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మరణించినట్లుగా స్టేషన్ సూపరింటెండెంట్ అఖిలేష్ కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతదేహంపై గాయాలను గుర్తించి, ప్రమాదవశాత్తు జరిగిన ఘటన అని పోలీసులు పేర్కొన్నారు.

30న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉగాది సంబరాలు

- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ఉంగుటూరు,మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ (విజయవాడచాప్టర్)లో ఈనెల 30న సాయంత్రం 3 గంటలకు శ్రీవిశ్వావసు నామసంవత్సర ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మణ్ణి దీపావెంకట్ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుతో ఉగాది ప్రాశస్త్యంపై ప్రవచనం ఉంటుందన్నారు. స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో నిర్వహించే ఉగాది వేడుకలకు సీఎం చంద్రబాబునాయుడు హాజరవుతున్న దృష్ట్యా ఏర్పాట్లను గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, డీఎస్పీ చలసాని శ్రీనివాసరావుతో కలిసి జాయింట్‌కలెక్టర్ గీతాంజలి శర్మ గురువారం పరిశీలించారు.

30న ఓపెన్ చెస్ టోర్నమెంట్

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఈ నెల 30న ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా అండర్- 7బాలబాలికల చాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ డైరెక్టర్ రేణుక తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో అండర్-7 చాంపియన్‌షిప్ లో బాలబాలికల విభాగాల్లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన వారిని ఏప్రిల్‌లో జరిగే అండర్-7 స్టేట్ చాంపియన్‌షిప్‌కి ఎంపిక చేస్తామని తెలిపారు. ఓపెన్ టోర్నమెంట్లో నగదు, ప్రత్యేక బహుమతులు, ప్రతి గ్రూప్‌లో మొదటి, రెండు స్థానాలకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు ఈ నెల 29 సాయంత్రం 6 లోగా తమ పేర్లను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, వివరాలకు 9700775220, 9247153387లో సంప్రదించాలని తెలిపారు.

సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్లు పయనం

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని లూధియానాలో గురువారం నుంచి ఈ నెల 31వరకు జరగనున్న 18వ సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్లు పయనమైనట్లు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ బాలుర, బాలికల జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులకు అసోసియేషన్ చైర్మన్ డి.నవీన్ కుమార్, అధ్యక్షులు వి.శ్రీనుబాబు, కోశాధికారి బి.నీరజ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



చాంపియన్‌షిప్‌కు ఎంపికైన జట్లు

సీఎంతో సెల్ఫీలకు ముస్లిం సోదరుల ఉత్సాహం



లబ్బీపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసేందుకు ముస్లిం సోదరులు పోటీ పడ్డారు. దారిపొడవునా, అడుగడుగునా ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. బందర్ రోడ్డులోని ఎ కన్వెన్షన్‌లో గురువారం సాయంత్రం జరిగిన ఇఫ్తారు విందులో భారీగా ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ విందులో పాల్గొన్న చంద్రబాబుకు ముస్లిం సోదరులు అపూర్వ స్వాగతం పలికారు. ఆయన్ను కలిసేందుకు, సెల్ఫీలు దిగేందుకు ప్రతి చోట అడ్డుతగిలారు. వారికి సెక్యూరిటీ సిబ్బంది అడ్డు చెప్పారు. సెక్యూరిటీని వారించి ముస్లిం సోదరులతో కలిసి సీఎం ఫొటోలు దిగారు. ఆడిటోరియం లోపల నుంచి బయట ప్రధాన ద్వారం వరకు నడుస్తూ కార్యకర్తలు ఫొటోలు తీసుకునే వరకు ఓపిగ్గా ఉన్న చంద్రబాబు వారిక అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం ఆయన ఉండవల్లిలోని నివాసాకి బయలుదేరి వెళ్లారు.















ఎల్1 కంపెనీలపై గప్‌చుప్!

- ఆరోగ్య శాఖలో రహస్యంగా టెండర్ల ఖరారు
- ప్రక్రియపై ఎమ్మెల్యేల ఫిర్యాదు.. విచారణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ నిర్వహణకు టెక్నికల్ కమిటీ టెండర్లను ఖరారు చేసింది. ఏయే కంపెనీలను ఎంపిక చేశారన్న విషయాన్ని మాత్రం అధికారులు బయటకు రానివ్వడం లేదు. ఎల్1 కంపెనీల పేర్లు బయట పెట్టకుండా రహస్యంగా ఉంచారు. గురువారం ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ నేతృత్వంలో కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న ఆసుపత్రులకు సంబంధించి మొత్తం 18 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు చేశారు. అన్ని జోన్‌లకు ఎల్1 కంపెనీలను ఎంపిక చేశారు. ఇప్పటికే ఈ టెండర్ ప్రక్రియపై అనేక అనుమానాలు, ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్1 కంపెనీల పేర్లు రహస్యంగా ఉంచడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. దీనికితోడు ఏపీఎంఎస్ఐడీసీ టెండర్ ప్రక్రియ మొత్తాన్ని గందరగోళం చేసింది. శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ టెండర్లు మొత్తం మెడికల్ టెర్మినాలజీ, కెమికల్స్ వ్యవహారాల్లో అనుభవం ఉన్న అధికారికి అప్పగించాలి. అయితే దాదాపు రూ.1400 కోట్ల విలువైన టెండర్ల విషయంలో సాధారణ ఇంజనీర్‌కు అప్పగించారు. సదరు అధికారి తనకు నచ్చినట్లు టెండర్ నిబంధనలతో కంపెనీలకు అర్హత కల్పించారన్న విమర్శలున్నాయి. టెండర్ల ప్రక్రియపై ఉత్తరాంధ్ర, రాయలసీమ ఎమ్మెల్యేలు అనేక మంది ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

నిబంధనలు మార్పు

శానిటేషన్, సెక్యూరిటీ టెండర్లల్లో నిబంధనలను అధికారులు ఇష్టారాజ్యంగా మార్చేశారు. అధికారులు టెండర్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన నిబంధనలకు వారే తిలోదకాలు ఇచ్చారు. తొలుత టెండర్ డాక్యుమెంట్‌లో జోన్‌ల వారీగా ఎంతమంది శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి? వారికి ఎంత జీతం ఇవ్వాలి? ఎంత మొత్తంలో కెమికల్స్ ఉపయోగించాలి? దానికి అయ్యే ఖర్చు ఎంత? అన్న వివరాలు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు పొందుపరిచారు. బిడ్ దాఖలు చేసే కంపెనీ కేవలం సర్వీస్ చార్జీ ఎంత అన్న విషయాన్ని మాత్రమే బిడ్‌లో పొందుపరచాలని స్పష్టంగా చెప్పారు. దాని ఆధారంగానే ఎల్1 కంపెనీ ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. అది కూడా సర్వీస్ చార్జీ 3.38 శాతం నుంచి 7.7 శాతం మించకూడదన్న నిబంధన పెట్టారు. చివరికి బిడ్ దాఖలు చేసే సమయంలో జోన్ల వారీగా ఎంతమంది సిబ్బందిని నియమిస్తారు? వారికి ఎంత మొత్తంలో జీతాలు చెల్లిస్తారు? ఎంత మొత్తంలో కెమికల్స్ ఉపయోగిస్తారు? అన్న వివరాలు కూడా పొందుపరచాలన్న నిబంధనలు పెట్టారు.

ఫిర్యాదులు పరిశీలిస్తాం

టెండర్ ప్రక్రియలో పాల్గొన్న ఒక కంపెనీపై కొంతమంది ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేశారు. వాటిని క్షుణ్నంగా పరిశీలించి, విచారణ చేస్తావి ు, ఆ తర్వాత టెండర్ ప్రక్రియపై ముందుకు వెళ్తామని ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు తెలిపారు.

16 రోజులు డిటెన్షన్ సెల్‌లో!

- రాత్రి నిద్రపోకుండా లైట్లు వేసి ఉంచారు... బల్లులు, పురుగులతో నిద్రలేమి
- పగటిపూట చెట్టు కింద పడుకున్నా... తెలంగాణ సీఎం రేవంత్ ఆవేదన



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే బీఆర్ఎస్ నాయకులు ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరుడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు. 16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. జైల్లో రాత్రంతా లైట్లు ఆన్‌లో పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా చేశారు. దీపాల వెలుగుకు బల్లులు, పురుగులు వచ్చి చేరడంతో బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర వచ్చేది కాదు. దాంతో పగలు చెట్టు కింద పడుకుని నిద్రపోయేవాడిని. వాళ్ల తప్పులను దేవుడే చూస్తాడని, అంతకు అంత అనుభవిస్తారని భావించి ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడు" అన్నారు. 2015లో చంచల్‌గూడ జైల్లో ఉన్నపుడు తన బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి బెయిలు కోసం ప్రయత్నిస్తుంటే ఢిల్లీ నుంచి న్యాయవాదులను పిలిపించి వాదనలు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. జైలు నుంచి నేరుగా వేదిక వద్దకు వెళ్లి, తిరిగి జైలుకు తీసుకొచ్చారన్నారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇంత జరిగినా కక్ష సాధింపులకు పాల్పడకుండా విజ్ఞత ప్రదర్శించామని చెప్పారు. కేటీఆర్ తన ఆఫీసులో కొంత మందికి డబ్బులిచ్చి తనను, కుటుంబ సభ్యులను బూతులు తిట్టించి, రికార్డు చేయించిన వారిని చెంప పగులగొట్టే శక్తి ఉన్నా ఓపికతో ఉన్నా. కక్ష సాధింపు చర్యలు ఎవరివో తెలంగాణ సమాజం గమనిస్తోందని అన్నారు.

ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా అసైన్డ్ కమిటీలు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసైన్డ్, మిగులు భూముల పంపిణీ వంటి అంశాలను సమీక్షించేందుకు ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు చైర్మన్లుగా ప్రభుత్వం కమిటీలను పునరుద్ధరించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా గురువారం ఉత్తర్వు(జీఓ.104) జారీ చేశారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే మంత్రులు, సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆర్డీఓ లేదా సబ్ కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయిలో భూ వ్యవహారాలను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ ఈ కమిటీ సభ్య కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, తాజాగా ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌కు అవకాశం ఇవ్వలేదు. జిల్లా స్థాయిలో ఖాళీగా ఉన్న భూములను రెవెన్యూ శాఖ సిఫారసుల మేరకు ఈ కమిటీ పరిశీలించి అర్హులైన పేద లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంది. మాజీ సైనికులకు ఇచ్చే భూములనూ ఈ కమిటీనే ఖరారు చేయనుంది.

ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌కు 88 కోట్లు

బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పరిసవారిపాలెంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటు కోసం రూ.88.08 కోట్ల మంజూరుకు ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్రం రూ.52.85 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.35.23 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌లో ఆమోదిత నిర్మాణాలను షరతులకు లోబడి పూర్తి చేయాలని మత్స్యశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

మాస్ లుక్‌లో...



రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గురువారం రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులను ఖుషీ చేశారు మేకర్స్. సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను ఖరారు చేసి, రామ్‌చరణ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. గుబురు గడ్డంతో చుట్ట వెలిగిస్తూ మాస్ లుక్‌లో కనిపించారు. ఈ లుక్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత రెట్టింపు చేసింది. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

సినీ ప్రముఖుల శుభాకాంక్షలు

రామ్‌చరణ్‌కు సినీ ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "పుట్టిన రోజు శుభాకాంక్షలు చరణ్. 'పెద్ది'లో నీ లుక్ అదిరిపోయింది. నీలోని నటుడిని ఈ సినిమా మరింత కొత్తగా చూపించనుందనే నమ్మకం ఉంది. సినీ ప్రియులకు కన్నుల పండుగగా ఉండే ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. అలాగే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మహేశ్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, సాయి దుర్గాతేజ్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ కాజల్ అగర్వాల్ తదితరులు రామ్‌చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ పోస్టులు పెట్టారు.

జూన్ 2న ఇళయరాజాకు సన్మానం



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను తమిళనాడు ప్రభుత్వం జూన్ రెండో తేదీన సన్మానించనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం శాసనసభలో ప్రకటించారు. ఇళయరాజా 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయన పుట్టిన రోజైన జూన్ రెండో తేదీన ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు సీఎం చెప్పారు. వీసీకే సభ్యుడు చింతనై సెల్వం మాట్లాడుతూ.. 'సంగీత దర్శకుడు ఇళయరాజా తన సింఫనీ అరంగేట్రం కార్యక్రమాన్ని లండన్ వేదికగా విజయవంతంగా పూర్తి చేశారని, ఆ సింఫనీని తమిళ ప్రజలు వినేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందా? అని ప్రశ్నించారు. దీనికి సీఎం స్టాలిన్ సమాధానమిస్తూ.. 'సింఫనీ అరంగేట్రాన్ని పూర్తి చేసుకుని వచ్చిన ఇళయరాజాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సాదర స్వాగతం పలికాం. సింఫనీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిర్వహించాలని కోరాం. తక్షణం 4 వేల మంది కళాకారులను రాష్ట్రానికి పిలిపించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శ్రమతో కూడుకున్నపని అని ఇళయరాజా అన్నారు' అని సీఎం తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి



సల్మాన్ ఖాన్

చెత్త సినిమాలు తీస్తే ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి అంటూ.. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'సికందర్' ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ 'సరైన చిత్రాలు తెరకెక్కించలేనప్పుడు అవి బాక్సాఫీసు వద్ద పరాజయాలే మూటగట్టుకుంటాయి. అందరూ కలసి కష్టపడితేనే మంచి సినిమా వస్తుంది. అయినప్పటికీ హీరో ఫొటోను మాత్రమే పోస్టర్‌లో వేస్తారు. ప్రేక్షకులు కూడా అది చూసే థియేటర్లకు వస్తుంటారు. ఒకవేళ సినిమా ఫ్లాప్ అయితే అందరూ ఆ హీరోనే తప్పుపడతారు' అని సల్మాన్ ఖాన్ వ్యాఖ్యానించారు.

చిత్రజ్యోతి

SINCE 1965



ఆ మాటలు నన్ను కదిలించాయి

జూనియర్ ఎన్టీఆర్

ఓ జపనీస్ అభిమాని చెప్పిన మాటలకు చలించిపోయారు జూనియర్ ఎన్టీఆర్. ఆయన కొరటాల శివ దర్శకత్వంలో నటించిన 'దేవర' చిత్రం నేడు జపాన్‌లో విడుదలవుతోంది. అక్కడ నిర్వహించిన సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఎన్టీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుధ పూజ పాటకు ఓ అభిమానితో కలసి స్టెప్పులేసిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. కాగా, తన జపాన్ పర్యటనపై ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు ఎన్టీఆర్. "ఆర్‌ఆర్‌ఆర్' సినిమా చూసిన తరవాత తెలుగు నేర్చుకున్నానని ఓ జపనీస్ అభిమాని చెప్పడం నన్ను కదిలించింది. విభిన్న సంస్కృతులతోపాటు భాష నేర్చుకునేందుకు సినిమా దోహదపడుతున్నందుకు సంతోషిస్తున్నా. ఇలాంటి వాటి కోసమే భారతీయ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం' అని పేర్కొన్నారు.

సినిమాగా డొక్కా సీతమ్మ కథ



అన్నపూర్ణగా, అన్నదాతగా చరిత్రలో నిలిచిపోయిన గొప్ప మహిళ డొక్కా సీతమ్మ. ఏ సమయంలోనైనా తన ఇంటికి ఎంతమంది వచ్చినా.. లేదు.. అనకుండా వారికి తనే స్వయంగా వండి వడ్డించిన ఆ మహాతల్లి జీవిత కథ ఇప్పుడు సినిమాగా వస్తోంది. అయితే చిత్ర నిర్మాణం ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్ విషయంలో వివాదం మొదలైంది. దాని గురించి రచయిత రామకృష్ణ మాట్లాడుతూ 'సీతమ్మ కథను 'అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో మొదట నాటకం రాశాను. 2016లోనే డొక్కా సీతమ్మ సినిమా స్క్రిప్ట్‌ను తెలుగు సినీ రచయితల సంఘంలో రిజిస్టర్ చేశాను. ఎంతో కాలంగా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చరిత్రను పరిశోధించి స్క్రిప్ట్ తయారు చేశాను' అని చెప్పారు. చరిత్ర సాకుతో తమ రచనను కాపీ కొడుతూ వేరొక సంస్థ కూడా సినిమా తీయడానికి ప్రయత్నించడంతో ఈ వివాదం కోర్టుకు చేరిందని నిర్మాత ప్రభాకర్ గౌడ్ చెప్పారు. కాపీ రైట్ యాక్ట్ కింద తమకు హక్కు ఉన్నప్పటికీ విషయం కోర్టులో ఉన్నందువల్ల తాము కోర్టు తీర్పును శిరోధార్యంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. అయితే వేరొక సంస్థ సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అదే నిజంగా జరిగితే కోర్టు ధిక్కారం అవుతుందని ఆయన హెచ్చరించారు. కోర్టు తేల్చే వరకూ యథాతథ పరిస్థితిని కొనసాగించాలని కోరారు.



జీనేశ్వర్ ఇన్‌ఫ్రా వెంచర్స్ తరఫున టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం చెక్ అందజేస్తున్న దాత

టీటీడీ ట్రస్టులకు రూ.2.45 కోట్ల విరాళం

తిరుమల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టీటీడీకి చెందిన వివిధ ట్రస్టులకు గురువారం రూ.2.45 కోట్లు విరాళంగా అందింది. చెన్నైకు చెందిన జీనేశ్వర్ ఇన్‌ఫ్రా వెంచర్స్ సంస్థ రూ.కోటి, శ్రీలంకకు చెందిన మరో దాత రూ.కోటి విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు వినియోగించాలని దాతలు కోరారు. అలాగే నోయిడాకు చెందిన పసిఫిక్ బీపీవో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.45 లక్షలు విరాళంగా అందించింది. దాతలు విరాళాలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

సిద్ధమవుతున్న సీఎఫ్ఎస్ఎల్

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు.. 400 కోట్లతో సిద్ధమవుతున్న అధునాతన ప్రయోగశాల

- ఐదెకరాల్లో ఐదు బ్లాకులు.. అందులో రెండు రెడీ
- వచ్చే ఏడాది జూన్‌కల్లా పూర్తిస్థాయిలో అందుబాటులోకి
- దేశంలో ఇలాంటివి 7 కేంద్రాలు.. ఇప్పుడు ఏనిమిదోది
- సీఎం చంద్రబాబు కృషితో ఏపీకి అధునాతన ల్యాబ్

(ఆంధ్రజ్యోతి - మంగళగిరి)

రాజధాని అమరావతితో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. హత్యలు, అత్యాచారాలు, దొంగతనాలతోపాటు నార్కొటిక్, సైబర్ వంటి నేర పరిశోధనల్లో ఆధారాలను గుర్తించడంలో కీలకమైన సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (సీఎఫ్ఎస్ఎల్) ఇక్కడ ఏర్పాటవుతోంది. తుళ్లూరు సమీపంలోని ఎన్-14 రోడ్డు వెంబడి ఐదెకరాల విస్తీర్ణంలో దీన్ని నిర్మిస్తున్నారు. వాస్తవానికి అమరావతిలో ఏపీసీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం తర్వాత అంత వేగంగా నిర్మితమవుతున్న రెండో భవన సముదాయం ఇదే.! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సుమారు రూ.400 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మిస్తున్నాయి. ఇలాంటి అధునాతన ల్యాబ్‌లు దేశవ్యాప్తంగా ఏడు మాత్రమే ఉన్నాయి. చండీగఢ్, ఢిల్లీ, భోపాల్, పుణె, కోల్‌కతా, గువాహటి, హైదరాబాద్ నగరాల్లోనే ఇవి ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ఇప్పుడు ఎనిమిదో ల్యాబ్ అమరావతిలో ఏర్పాటు కానుండడం విశేషం.

నేర పరిశోధనల్లో కీలకం

ఇటీవలికాలంలో నేరాల సంఖ్య బాగా పెరిగింది. నేరస్తులు కూడా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని చట్టం చేతికి చిక్కకుండా సులువుగా తప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో అసలైన నేరస్థులను పట్టుకుని వారికి శిక్ష పడేలా చేయడం పోలీస్ శాఖకు సవాలుగా మారింది. అయితే సాంకేతిక ఆధారాల సాయంతో ఇలాంటి నేరగాళ్ల భరతం పట్టడానికి దేశవ్యాప్తంగా పోలీసు వ్యవస్థను ఆధునీకరిస్తున్నారు. ఈ చర్యల్లో భాగంగానే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సీఎఫ్ఎస్ఎల్‌ను కేటాయించింది. నేర పరిశోధనలో ఈ తరహా సైన్స్ ల్యాబ్‌ల నివేదికలు చాలా కీలకంగా మారుతున్నాయి. అవి ఇచ్చే నివేదికల ఆధారంగానే పోలీసులు నిందితులను గుర్తించి కోర్టుల్లో నేరాన్ని నిరూపించగలుగుతున్నారు.

అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం

హైదరాబాద్‌లోని ఈ సీఎఫ్ఎస్ఎల్ రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లింది. ఏపీలో నేరాలకు సంబంధించిన కేసుల నిగ్గు తేల్చేందుకు ఆధారాల విశ్లేషణ నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు విధిగా పంపాల్సివస్తోంది. దీనివలన చాలా సమయం వృథా అవుతోంది. ల్యాబ్ రిపోర్టులు త్వరగా వస్తే కేసులు త్వరితగతిన పరిష్కరించే వీలుంటుంది. అందుకే రాష్ట్రానికి ఈ అధునాతన ల్యాబ్ చాలా అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించి 2017లోనే రాష్ట్రానికి దీన్ని సాధించారు. అప్పట్లో దీని నిర్మాణానికి రూ.253.40 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. 2017 డిసెంబరు 28న శంకుస్థాపన చేసి ఆ తర్వాత పనులు ప్రారంభించారు కూడా. కానీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కూడా అటకెక్కించింది. 2024లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టి ఆరు నెలల క్రితమే నిర్మాణ పనులు ఆరంభించింది. అయితే నిర్మాణ వ్యయం మాత్రం పెరిగి రూ.400 కోట్లకు చేరిందని అంటున్నారు.



తుళ్లూరు సమీపంలో మెరుగులు దిద్దుకుంటున్న సీఎఫ్ఎస్ఎల్ భవన సముదాయంలోని ఫిజిక్స్ బ్లాకు



ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన యంత్రాలు

ఐదెకరాల్లో.. ఐదు భవనాలు..

ఐదెకరాల విస్తీర్ణంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో ఫిజిక్స్ ల్యాబ్, కెమిస్ట్రీ ల్యాబ్, బయాలజీ ల్యాబ్, బాలిస్టిక్స్ ల్యాబ్, పరిపాలనా భవనం అని.. మొత్తం ఐదు భవనాలు ఉంటాయని అంటున్నారు. ప్రస్తుతానికి మూడు భవనాలను ప్రారంభించి.. వాటిలో రెండింటిని దాదాపు 95 శాతం పూర్తిచేశారు. ఈ 95 శాతం పనులన్నీ గత ఆరు నెలల్లోనే పూర్తవడం విశేషం. ఫిజిక్స్ బ్లాకు భవనం (జీ+5)తోపాటు బాలిస్టిక్స్ భవనా (జీ+3)లను పూర్తిచేశారు. ఫోరెన్సిక్ కెమిస్ట్రీ ల్యాబ్ ఉండే బ్లాకు నిర్మాణాన్ని ఇటీవలే ప్రారంభించారు. మిగతా రెండు బ్లాకుల నిర్మాణాలను కూడా త్వరలోనే ఆరంభించి వచ్చే ఏడాది జూన్ కల్లా సిద్ధం చేసేందుకు ప్రణాళికను రూపొందించారు. ఇప్పటికే పూర్తయిన ఫిజిక్స్ బాలిస్టిక్స్ బ్లాకుల్లో అవసరమైన మిషనరీని ఏర్పాటు చేసుకుని ల్యాబ్‌ను ప్రారంభించాలన్న ఆలోచనలు కూడా జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఈ భవన సముదాయం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తున్నారు.

ఈ ల్యాబ్‌లో డీఎన్ఏ పరీక్షలతోపాటు నార్కోటిక్స్ సైబర్, బయోమెట్రిక్స్, బాలిస్టిక్స్‌కు సంబంధించిన పరీక్షలతోపాటు ఫోరెన్సిక్ ఎకౌంటింగ్‌కు సంబంధించిన ఎక్సలెన్స్ విభాగాలు, ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ విభాగాలను ఏర్పాటుచేస్తారు. ఇంకొంచెం వివరంగా చెప్పాలంటే వివిధ కేసుల్లో పోలీసులు సేకరించిన రక్త నమూనాలు, వేలిముద్రలు, మాదకద్రవ్యాలు, తుపాకీలు లేదా ఇతర పేలుళ్ల సందర్భాలలో సేకరించిన పదార్థాలను ఈ ల్యాబ్‌లో పరీక్షించి విశ్లేషిస్తారు. అంతేకాకుండా ఈ ల్యాబ్ ప్రస్తుత నేర దృశ్యాల నుంచి లభ్యమైన ఆధారాలను గతంలో జరిగిన నేరాల తాలూకు నమూనాలతో సరిపోల్చగల డేటాబేస్‌ను కూడా యాక్సెస్ చేస్తుంది.

ఫోరెన్సిక్ వర్సిటీ ఏర్పాటు కోసం చంద్రబాబు కృషి

ఇదిలావుంటే కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో కొత్త ఫోరెన్సిక్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తుంది. దీనిని ఏపీ రాజధాని అమరావతిలోనే ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ వర్సిటీని రాష్ట్రానికి సాధించి తీసుకువచ్చే నిమిత్తమే ప్రస్తుతం అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఈ ల్యాబ్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించేందుకు ఆయన సంబంధిత అధికారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నట్టు తెలిసింది. అమరావతిలో ఈ ల్యాబ్ నిర్మాణ పనులు పూర్తయ్యాక ప్రస్తుతం ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో ఉన్న రాష్ట్రస్థాయి ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దీనిలోకి తరలిస్తారు. ఆ తర్వాత డీజీపీ కార్యాలయ ఆవరణలోని పాత ల్యాబ్ భవనాన్ని రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌గా వినియోగించుకుంటారు.

పోక్సో కేసులో వైసీపీ నేత అరెస్టు

అతనితోపాటు మరో ముగ్గురికి రిమాండు
పరారీలోనే అసలు నిందితుడు

కలికిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలో బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి తండ్రి వైసీపీ నేత జుబేర్ అహ్మద్‌తో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి గురువారం వాయల్పాడు కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులు నలుగురికీ వాయల్పాడు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేటు కోర్టు న్యాయాధికారి గురు అరవింద్ రిమాండు విధించారు. అయితే ఈ కేసులో అసలు నిందితుడు జునేద్ అహ్మద్ (26) ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. వివరాలు ఇలా.. చిత్తూరు జిల్లాకు చెందిన బాలిక కలికిరి మండలంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. మైనారిటీ గురుకుల పాఠశాలలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. ఈ ఏడాది జనవరి 25న అమ్మమ్మ వద్దకు వచ్చింది. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి బాలిక కనపడకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెంది కలికిరి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ లోగా ఒక కారులో బాలికను ఇంటి వద్ద వెళ్లిపోయినట్టు కుటుంబీకులు గుర్తించారు. స్థానిక వైసీపీ నేత జుబేర్ అహ్మద్ పెద్ద కొడుకు జునేద్ అహ్మద్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాలిక పోలీసులకు తెలిపింది. గతేడాది ఆగస్టు నుంచి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తూ వచ్చాడని చెప్పింది. దీనిపై రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు దర్యాప్తు ముమ్మరం చేశారు. సాక్ష్యాధారాలను తారుమారు చేస్తున్నారనే అభియోగాలతో నిందితుడి తండ్రి జుబేర్ అహ్మద్, సోదరుడు బిలాల్ అహ్మద్, స్నేహితులు నూరుల్లా, మునీర్‌ను కేసులో చేర్చారు.

త్వరలోనే నంబర్ వన్‌గా ఏపీ

- చంద్రబాబుపై నమ్మకంతోనే పెట్టుబడులు
- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనతో ఏపీ అతి త్వరలోనే దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా రెండో రోజైన గురువారం భువనేశ్వరి కుప్పం మండలంలో పర్యటించారు. అలీప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆరు రోజుల మహిళల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరోవైపు కుప్పంలో ఇండియన్ బ్యాంకు మైక్రో సెట్ బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో భువనేశ్వరి మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో కూడా టీడీపీ గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఉంటే దేశంలోనే ఏపీ నంబర్ వన్‌గా మారేదన్నారు. ఇప్పటికైనా మించిపోయింది లేదని, ప్రస్తుతం ఆయన ఆ పనిలోనే ఉన్నారని చెప్పారు. చంద్రబాబు మీద ఉన్న నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు భారీ పెట్టుబడులతో ఏపీకి తరలివస్తున్నారన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనే ముఖ్యమంత్రి లక్ష్యమని చెప్పారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏమీలేదని, వారికి అవకాశాలిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. అంతకుముందు ఇండియన్ బ్యాంకు మైక్రో సెట్ శాఖను ప్రారంభించిన భువనేశ్వరి ఆ బ్యాంకు ద్వారా మొత్తం రూ.630 కోట్ల రుణాలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్, అలీప్ చైర్‌పర్సన్ రమాదేవి, ఇండియన్ బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కుప్పంలో అలీప్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భువనేశ్వరి

పాపవినాశనం డ్యాంలో బోటింగ్‌పై సీఎంవోకు టీటీడీ ఫిర్యాదు!

తిరుమల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తిరుమల పాపవినాశనం డ్యాంలో అనధికార బోటింగ్‌పై అటవీశాఖ అధికారుల తీరుపై టీటీడీ సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా భక్తుల దాహార్తి తీర్చే డ్యాంలో మూడురోజుల క్రితం ఐదుగురు వ్యక్తులు కయాక్ బోట్లలో తిరగడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ క్రమంలోనే ఎందుకోసం సర్వే నిర్వహించారని ఫారెస్ట్ అధికారులను విచారించడంతో పాటు సీఎం కార్యాలయానికి కూడా టీటీడీ అధికారులు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ఐఎస్ఏ అధ్యక్షురాలిగా డాక్టర్ విజయ



గుంటూరు మెడికల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత, న్యూరో సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ పి.విజయ ప్రతిష్టాత్మక ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) నూతన అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి ఆమె ఐఎస్ఏ నేషనల్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారు.

ప్రాణం పోతోంది... సాయం చేయండి..!

- బ్లడ్ క్యాన్సర్‌తో ఇంటర్ విద్యార్థి పోరాటం
- రోజురోజుకూ మృత్యు ఒడికి చేరుతున్న వైనం
- సాయం కోరుతున్న నిరుపేద తల్లిదండ్రులు

నరసరావుపేట కల్చరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆడిపాడే వయసులో ఆ బాలికను క్యాన్సర్ మహమ్మారి కబళించేస్తోంది. రోజురోజుకూ మృత్యువుకు దగ్గరవుతున్న ఆ చిన్నారి 'అమ్మా.. నన్ను బతికించండి..' అంటూ దీనంగా అడుగుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని దీనంగా వేడుకుంటున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం నవోదయనగర్‌లోని కాశీరత్నం పాఠశాల వద్ద రాజు, నాగ సుధారాణి దంపతులు కిరాణా దుకాణంలో పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. కొడుకు ఇంజనీరింగ్ చదువుతుండగా, కూతురు నాగ భవ్య ఇంటర్ చదువుతోంది. గతేడాది ఫిబ్రవరిలో భవ్యకు బ్లడ్ క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. విజయవాడలోని హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఏడాదిగా చికిత్స చేయిస్తున్నారు. చికిత్స కోసం తల్లిదండ్రులు అప్పులు చేసి రూ.పది లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా నయం కాలేదు. ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చిన డబ్బు సరిపోలేదు. ఇమ్యూనోథెరపీ చేస్తే వ్యాధి నయమవుతుందని డాక్టర్లు చెప్తున్నారు. కానీ, ఇప్పటికే వారు తాహతుకు మించి ఖర్చుచేసి కట్టుబట్టలతో మిగిలారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, దాతలు ఆర్థిక సాయం చేస్తే తమ బిడ్డను కాపాడుకుంటామని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నారు. సాయం చేయదలచిన దాతలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా నంబరు 018210100160798 (ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్ 0801828), లేదా 8340018983, 81791692153 ఫోన్ నంబర్లలో సంప్రదించి గూగుల్ పే ద్వారా సాయం చేయాలని కోరుతున్నారు.



నాగ భవ్యతో తల్లి సుధారాణి

స్పోర్ట్స్

విజయవాడ ● శుక్రవారం 28 మార్చి 2025

ఐపీఎల్‌లో నేడు | వేదిక చెన్నై

చెన్నై x బెంగళూరు రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	1	1	0	0	2	2.137
లఖ్‌నవూ	2	1	1	0	2	0.963
పంజాబ్	1	1	0	0	2	0.550
చెన్నై	1	1	0	0	2	0.493
ఢిల్లీ	1	1	0	0	2	0.371
హైదరాబాద్	2	1	1	0	2	-0.128
కోల్‌కతా	2	1	1	0	2	-0.308
ముంబై	1	0	1	0	0	-0.493
గుజరాత్	1	0	1	0	0	-0.550
రాజస్థాన్	2	0	2	0	0	-1.882

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

రీతికకు రజతం

ముస్కాన్, మాన్సీలకు కాంస్యాలు

ఆసియా రెజ్లింగ్


రీతిక

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో..తొలి రోజు భారత్ అదరగొట్టింది. గురువారం జరిగిన పోటీలలో మనోళ్లు ఓ రజతం, రెండు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళల 76 కిలోల విభాగంలో రీతికా హుడా రజతం, 59 కేజీల కేటగిరీలో ముస్కాన్, 68 కిలోల విభాగంలో మాన్సీ లాథర్ కాంస్యాలు దక్కించుకున్నారు. హోరాహోరీగా సాగిన 76 కిలోల ఫైనల్లో రీతిక 6-7తో కిర్గిస్థాన్ రెజ్లర్ అపేరి కిజీ చేతిలో పరాజయం చవిచూసింది. 59 కిలోల కాంస్య పోరులో ముస్కాన్ 4-0తో మంగోలియాకు చెందిన టొగ్టోఖ్‌ను ఓడించి విజేతగా నిలిచింది. వరల్డ్ అండర్-17 చాంపియన్ మాన్సీ లాథర్ 68 కిలోల విభాగంలో.. 12-2తో కజూలినా (కజకిస్థాన్)ను చిత్తు చేసి కాంస్య పతకం అందుకుంది. మహిళల 55 కిలోల విభాగంలో మరో భారత రెజ్లర్ నిమ కాంస్య పతక పోరులో పరాజయం చవిచూసింది.

హిందీ కామెంట్రీ పేలవం!

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో హిందీ వ్యాఖ్యానంపై క్రికెట్ ఫ్యాన్స్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంజేశారు. మాజీ ఆటగాళ్లతో కూడిన హిందీ వ్యాఖ్యాతల ప్యానెల్ వారి స్థాయికి తగ్గట్టుగా మ్యాచ్‌లను విశ్లేషించలేకపోతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. అదే సమయంలో ఇంగ్లిష్ వ్యాఖ్యానం అద్భుతంగా ఉందని ప్రశంసిస్తున్నారు. హర్భజన్, సెహ్వాగ్, నవజోత్ సిద్ధూ, ధవన్, రైనా, ఊతప్ప, రాయుడు తదితరులతో కూడిన బృందం హిందీ వ్యాఖ్యానం చేస్తోంది. ప్రస్తుత హిందీ కామెంట్రీని 1990లలో దూరదర్శన్‌లో వచ్చే వ్యాఖ్యానంతో అభిమానులు పోల్చారు. కాగా..దీనిపై హర్భజన్ స్పందిస్తూ.. వ్యాఖ్యానాన్ని మెరుగుపరుచుకుంటామన్నాడు.

మమ్మల్ని గుర్తించండి

ఫిఫాకు అఫ్ఘాన్ మహిళల ఫుట్‌బాల్ జట్టు అభ్యర్థన



న్యూఢిల్లీ: అఫ్ఘానిస్థాన్ మహిళల ఫుట్‌బాల్ జట్టును అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) గుర్తించాలని ఆ దేశ క్రీడాకారిణులు కోరుతున్నారు. 2021లో అఫ్ఘాన్ పాలన తాలిబన్ల చేతిలోకి వెళ్లిన తర్వాత వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ పోటీల నుంచి ఆ దేశ జట్టును తప్పించారు. తమకు మళ్లీ గుర్తింపు ఇవ్వాలని అఫ్ఘాన్ మహిళా జట్టు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటంలో అందరూ తమకు మద్దతుగా నిలవాలని అభ్యర్థిస్తున్నారు. అఫ్ఘాన్ జట్టులోని చాలా మంది ప్లేయర్లు దేశం విడిచి విదేశాల్లో తలదాచుకొంటున్నారు.

గ్రూప్ 'బి'లో భారత్

ఏఎఫ్‌సీ ఆసియాకప్ డ్రా

న్యూఢిల్లీ: ఏఎఫ్‌సీ మహిళల ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్‌లో భారత జట్టు గ్రూప్ 'బి'లో చోటు దక్కించుకుంది. ఇందులో థాయ్‌లాండ్, మంగోలియా, టిమోర్ లెస్టే, ఇరాక్ ఇతర జట్లుగా ఉన్నాయి. జూన్ 23 నుంచి జూలై 5 వరకు జరిగే గ్రూప్ 'బి' మ్యాచ్‌లకు థాయ్‌లాండ్ వేదిక కానుంది. మొత్తంగా ఈ క్వాలిఫయర్స్‌లో 8 గ్రూపుల్లో 34 జట్లు పోటీపడుతున్నాయి. ప్రతీ గ్రూప్ విజేత ఆస్ట్రేలియాలో జరిగే ఫైనల్ టోర్నీకి అర్హత సాధిస్తుంది.

రైజర్స్‌కు ఝలక్

చెలరేగిన పూరన్ ● శార్దూల్‌కు నాలుగు వికెట్లు

లఖ్‌నవూ 'సూపర్' విజయం


నికోలస్ పూరన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 70)


హెడ్ (47) బౌల్డ్

ఐపీఎల్‌లో ఇంత వేగంగా (7.3 ఓవర్లలో) వంద పరుగులు చేయడం లఖ్‌నవూకు ఇదే తొలిసారి. **1**

20 బంతుల్లోపే ఎక్కువ (4) ఫిఫ్టీలు సాధించిన ఐపీఎల్ బ్యాటర్‌గా పూరన్.

ఐపీఎల్‌లోనే భీకర బ్యాటింగ్ లైనప్.. పైగా గతేడాది ఇదే లఖ్‌నవూ జట్టుపై 9.4 ఓవర్లలో 167 రన్స్ బాదిన సన్‌రైజర్స్ వామ్మో అనిపించింది. దీంతో ఇప్పుడు 300 స్కోరు ఖాయమేనా? అనే విశ్లేషణలు కూడా వినిపించాయి. కానీ ఈసారి ఉప్పల్‌లో సీన్ మారింది. టాస్ గెలిచిన పంత్ ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించడమే కాదు.. వారెంత కొట్టినా తాము ఛేదించగలమంటూ సవాల్ విసిరాడు. పేసర్ శార్దూల్ (4/34) ఆరంభంలోనే ఎస్‌ఆర్‌హెచ్ బ్యాటర్లకు ముకుతాడు వేయగా, వీర బాదుడు మీకే కాదు.. మాకూ వచ్చంటూ నికోలస్ పూరన్ 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో ఓటమిని కళ్లముందుంచాడు. ఓపెనర్ మార్ష్ కూడా సహకరించడంతో లఖ్‌నవూ గట్టిగానే ప్రతీకారం తీర్చుకుంది.

హైదరాబాద్: ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సొంత మైదానంలో షాక్ తగిలింది. రాజస్థాన్‌తో మ్యాచ్‌లో 286 రన్స్ చేసిన జోష్‌లో ఉన్న ఆ జట్టును లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నేలకు దించింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షో కనబర్చిన లఖ్‌నవూ 5 వికెట్ల తేడాతో గెలిచింది. పేసర్ శార్దూల్ ఠాకూర్ 4 వికెట్లతో అదరగొట్టగా, బ్యాటింగ్‌లో నికోలస్ పూరన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 70) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. హెడ్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 47), అనికేత్ (13 బంతుల్లో 5 సిక్సర్లతో 36), నితీశ్ (28 బంతుల్లో 2 ఫోర్లతో 32), క్లాసెన్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 26) రాణించారు. ఛేదనలో లఖ్‌నవూ 16.1 ఓవర్లలోనే 5 వికెట్లకు 193 పరుగులు చేసి గెలిచింది. మార్ష్ (31 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 52), సమద్ (8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 22 నాటౌట్) ఆకట్టుకున్నారు. కమిన్స్‌కు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా శార్దూల్ ఠాకూర్ నిలిచాడు.

పూరన్ పూనకం: ఛేదనలో రైజర్స్ బౌలర్లను పూరన్ ఆడేసుకున్నాడు. ఓపెనర్ మార్‌క్రమ్ (1) మరోసారి విఫలమైనా.. మరో ఓపెనర్ మార్ష్‌తో కలిసి పూరన్ స్కోరును రాకెట్ వేగంతో ముందుకు తీసుకెళ్లాడు. రెండో ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన పూరన్ ప్రతీ బంతిని బాదడమే లక్ష్యంగా చెలరేగాడు. మూడో ఓవర్‌లో 4,6,6తో 17 రన్స్ రాబట్టగా.. తర్వాతి ఓవర్‌లో మార్ష్ రెండు సిక్సర్లతో 18 రన్స్ అందించాడు. అభిషేక్ ఓవర్‌లో పూరన్ మరో రెండు సిక్సర్లతో లఖ్‌నవూ పవర్‌ప్లేలో 77/1 స్కోరుతో మెరుగైన స్థితిలో నిలిచింది. పూరన్ తన జోరును కొనసాగిస్తూ ఏడో ఓవర్‌లో 6,6,4తో 18 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. తాజా సీజన్‌లో ఇదే ఫాస్టెస్ట్. అయితే పూరన్ తుఫాన్ ఆటకు కమిన్స్ 9వ ఓవర్‌లో ఎల్బీతో బ్రేక్ వేశాడు. దీంతో రెండో వికెట్‌కు 43 బంతుల్లో 116 పరుగులు మెరుపు భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత మార్ష్ రెండు వరుస ఫోర్లతో 29 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేసి కమిన్స్‌కే చిక్కాడు. స్వల్ప వ్యవధిలో బదోని (6), పంత్ (15) అవుటైనా అప్పటికే జట్టు విజయం ఖాయమైంది. అబ్దుల్ సమద్ 15వ ఓవర్‌లో 4,6.. 16వ ఓవర్‌లో 6,4తో ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో మరో 23 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

కట్టడి చేశారు: టాస్ గెలిచిన లఖ్‌నవూ కెప్టెన్ పంత్.. రైజర్స్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించడంతో ఇక పరుగుల వరదే అనే భావనలో స్టేడియం హోరెత్తిపోయింది. అయితే పంత్ నమ్మకాన్ని బౌలర్లు వమ్ము చేయలేదు. ఆరంభంలో పేసర్లు శార్దూల్, మధ్య ఓవర్లలో ప్రిన్స్ యాదవ్ విశేషంగా రాణించి రైజర్స్‌ను కట్టడి చేశారు. ఇన్నింగ్స్ చివరి 15 బంతుల్లోనైతే లఖ్‌నవూ ఒక్క బౌండరీ కూడా ఇవ్వలేదు. హెడ్, అనికేత్ బాదుడు రైజర్స్ స్కోరులో కీలకంగా నిలిచింది. మూడో ఓవర్‌లో పేసర్ శార్దూల్ వరుస బంతుల్లో ఓపెనర్ అభిషేక్ (6), గత మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్‌ను గోల్డెన్ డకౌట్ చేసి రైజర్స్‌కు ఝులకిచ్చాడు. అయినా మరో ఓపెనర్ హెడ్ మాత్రం దూకుడు ఆపలేదు. తర్వాతి ఓవర్‌లోనే 6,6,4తో 18 రన్స్ రాబట్టాడు. ఆరో ఓవర్ తొలి బంతికి హెడ్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను పూరన్ వదిలేయగా.. ఐదో బంతికి క్లిష్టమైన రిటర్న్ క్యాచ్‌ను స్పిన్నర్ బిష్ణోయ్ అందుకోలేకపోయాడు. పవర్‌ప్లేలో రైజర్స్ 62/2తో నిలిచింది. ఇక హెడ్ మరింత ప్రమాదకరంగా మారకముందే 8వ ఓవర్‌లో ఫుల్లర్ లెంగ్త్ బాల్‌తో పేసర్ ప్రిన్స్ బౌల్డ్ చేశాడు. అప్పటికే మూడో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. అనంతరం పరుగులు కూడా నెమ్మదించగా, క్రీజులో ఉన్న నితీశ్ ఆచితూచి ఆడాడు. అలాగే 11వ ఓవర్‌లో అతను అంపైర్ కాల్‌తో ఎల్బీ నుంచి తప్పించుకున్నాడు. స్పిన్నర్ దిగ్వేష్ ఓవర్‌లో సిక్సర్ బాదిన క్లాసెన్ అనూహ్యంగా రనౌటయ్యాడు. 12వ ఓవర్‌లో నితీశ్ రిటర్న్ క్యాచ్‌ను అందుకునే క్రమంలో ప్రిన్స్ చేతికి తగిలిన బంతి నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో వికెట్లను గిరాటేయడంతో క్లాసెన్ పెవిలియన్‌కు చేరాల్సి వచ్చింది. అటు ఒత్తిడికి లోనైన నితీశ్ భారీ షాట్‌కు వెళ్లి బిష్ణోయ్ ఓవర్‌లో బౌల్డయ్యాడు. అయితే ఎవరి అంచనాలో లేని అనికేత్ మాత్రం 15, 16వ ఓవర్లలో రెండు వరుస సిక్సర్లతో స్కోరును పరిగెత్తించాడు. అదే జోరులో మరో షాట్‌కు వెళ్లి మిల్లర్‌కు చిక్కాడు. ఆ వెంటనే అభినవ్ (2)ను శార్దూల్ అవుట్ చేశాడు. ఇక కమిన్స్ (4 బంతుల్లో 3 సిక్సర్లతో 18) తానెదుర్కొన్న తొలి మూడు బంతులను సిక్సర్లుగా మలిచి అదుర్స్ అనిపించినా నాలుగో బంతికి వెనుదిరిగాడు. ఇక 19వ ఓవర్‌లో శార్దూల్ మూడు పరుగులే ఇచ్చి షమి (1)ని వెనక్కి పంపి 4 వికెట్లను పూర్తి చేసుకోగా, ఆఖరి ఓవర్‌లో అవేశ్ ఏడు పరుగులే ఇవ్వడంతో రైజర్స్ స్కోరు 200లోపు ముగిసింది.


శార్దూల్ (4-0-34-4)

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) ప్రిన్స్ 47, అభిషేక్ (సి) పూరన్ (బి) శార్దూల్ 6, ఇషాన్ (సి) పంత్ (బి) శార్దూల్ 0, నితీశ్‌కుమార్ (బి) బిష్ణోయ్ 32, క్లాసెన్ (రనౌట్) 26, అనికేత్ (సి) మిల్లర్ (బి) రాఠి 36, అభినవ్ (సి) సమద్ (బి) శార్దూల్ 2, కమిన్స్ (సి) రాఠి (బి) అవేశ్ 18, హర్షల్ (నాటౌట్) 12, షమి (సి) బదోని (బి) శార్దూల్ 1, సిమర్జీత్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 190/9; వికెట్ల పతనం:** 1-15, 2-15, 3-76, 4-110, 5-128, 6-156, 7-156, 8-176, 9-181; **బౌలింగ్:** శార్దూల్ 4-0-34-4, అవేశ్ 4-0-45-1, దిగ్వేష్ రాఠి 4-0-40-1, రవి బిష్ణోయ్ 4-0-42-1, ప్రిన్స్ 4-0-29-1.

లఖ్‌నవూ: మిచెల్ మార్ష్ (సి) నితీశ్ (బి) కమిన్స్ 52, మార్‌క్రమ్ (సి) కమిన్స్ (బి) షమి 1, నికోలస్ పూరన్ (ఎల్బీ) కమిన్స్ 70, రిషబ్ పంత్ (సి) షమి (బి) హర్షల్ 15, ఆయుష్ బదోని (సి) హర్షల్ (బి) జంపా 6, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 13, అబ్దుల్ సమద్ (నాటౌట్) 22, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 16.1 ఓవర్లలో 193/5; వికెట్ల పతనం:** 1-4, 2-120, 3-138, 4-154, 5-164; **బౌలింగ్:** అభిషేక్ 2-0-20-0, షమి 3-0-37-1, సిమర్జీత్ సింగ్ 2-0-28-0, కమిన్స్ 3-0-29-2, ఆడమ్ జంపా 4-0-46-1, హర్షల్ పటేల్ 2-0-28-1, ఇషాన్ కిషన్ 0.1-0-4-0.

బిజినెస్

వాహన విడిభాగాల తయారీదారులకు

ట్రంప్ టారిఫ్ షాక్!



భారత్ నుంచి అమెరికాకు ఏటా రూ.60,000 కోట్ల ఎగుమతులు

కంపెనీల మార్జిన్లపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ: వచ్చే నెల 3 నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే అన్ని వాహనాలు, వాటి విడిభాగాలపై 25 శాతం సుంకం వసూలు చేయనున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భారత్‌లోని వాహన విడిభాగాల తయారీదారులకు ఇది శరాఘాతంగా పరిణమించనుంది. ఎందుకంటే, భారత కంపెనీలు ఏటా దాదాపు 700 కోట్ల డాలర్ల (సుమారు రూ.60,000 కోట్లు) విలువైన వాహన విడిభాగాలను అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. అమెరికా సుంకాల దెబ్బకు తమ లాభాల మార్జిన్లు తగ్గవచ్చని ఇండస్ట్రీ భయపడుతోంది. ముఖ్యంగా సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్, భారత్ ఫోర్జ్, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌పై ట్రంప్ సుంకాల ప్రభావం అధికంగా ఉండనుంది. సోనా బీఎల్‌డబ్ల్యూకు 40 శాతం, భారత్ ఫోర్జ్‌కు 38 శాతం, సంవర్ధన మదర్సన్‌కు 18 శాతం ఆదాయం అమెరికా ఎగుమతుల నుంచే సమకూరుతోంది.

టాటాకు జేఎల్ఆర్ ఎఫెక్ట్

దేశీయ వాహన కంపెనీల్లో టాటా మోటార్స్ ఆదాయంపైన సుంకాలు ప్రభావం చూపనున్నాయి. కంపెనీకి చెందిన అంతర్జాతీయ బ్రాండ్ జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్ఆర్) ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో జేఎల్ఆర్ ప్రపంచవ్యాప్తంగా 4 లక్షలకు పైగా కార్లను విక్రయించగా.. అందులో అమెరికా మార్కెట్ వాటా 23 శాతంగా ఉంది. అవన్నీ యూకేలోని కంపెనీ ప్లాంట్ల నుంచి ఎగుమతైనవే. ట్రంప్ సుంకాలను పూర్తిగా భరించాల్సి వస్తే జేఎల్ఆర్ లాభాలకు భారీగా గండిపడే అవకాశం ఉంది.

అమెరికా దిగుమతులపై 15 శాతం సుంకం

ఇండస్ట్రీ అంచనాల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశీయ కంపెనీలు అమెరికాకు 679 కోట్ల డాలర్ల విలువైన వాహన విడిభాగాలను ఎగుమతి చేశాయి. కాగా, అమెరికా నుంచి భారత్‌కు 140 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులు జరిగాయి. ప్రస్తుతం అమెరికా తన దేశంలోకి దిగుమతయ్యే వాహన విడిభాగాలపై ఎలాంటి సుంకం విధించడం లేదు. భారత్ మాత్రం అమెరికా నుంచి దిగుమతయ్యే విడిభాగాలపై 15 శాతం సుంకం వసూలు చేస్తోంది.

ఎగుమతి ఆదాయంలో 27 శాతం అమెరికాదే

ఈ ఏడాది మే లేదా ఆ తర్వాత ఇంజన్లు, ట్రాన్స్‌మిషన్లు, పవర్‌ట్రెయిన్ పార్ట్స్, ఎలక్ట్రికల్ పార్ట్స్ వంటి కీలక విడిభాగాలపైనా 25 శాతం సుంకం విధించే యోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉంది. ఈ భారాన్ని పూర్తిగా భరించాల్సి వస్తే, భారత వాహన విడిభాగాల ఎగుమతిదారుల నిర్వహణ లాభాల మార్జిన్లు 1.25-1.50 శాతం మేర తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనూజ్ సేథీ అన్నారు. ప్రస్తుతం వీరి మార్జిన్లు 12-12.5 శాతంగా ఉన్నాయి. దేశీయ వాహన విడిభాగాల తయారీ రంగానికి దాదాపు 20 శాతం ఆదాయం ఎగుమతుల ద్వారానే సమకూరుతుండగా.. అందులో 27 శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తోంది. అమెరికాలో ప్లాంటు కలిగిన కంపెనీలు మాత్రం అక్కడ ఉత్పత్తి సామర్థ్యం పెంచుకోవడం ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంది.

మణిపాల్ సిగ్నాలో ఎల్ఐసీకి 49% వాటా!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ).. ఆరోగ్య బీమా రంగంలోకి అడుగుపెట్టే దిశగా చురుగ్గా పావులు కదుపుతోంది. ఈ ప్రయత్నాల్లో భాగంగా రంజన్ పాయ్ సారథ్యంలోని మణిపాల్ సిగ్నాలో 40-49 శాతం వాటాలు కొనుగోలు చేసేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారు చేస్తున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలంటున్నాయి. ఈ కొనుగోలు విలువ రూ.3,500-3,750 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఈ ప్రయత్నం కార్యరూపం దాల్చినట్టయితే సుమారుగా రూ.3 లక్షల కోట్ల విలువ గల సాధారణ బీమా వ్యాపారంలో 37 శాతం వాటా కలిగిన ఎల్ఐసీకి ఆరోగ్య బీమా రంగంలోకి అడుగు పెట్టే మార్గం సుగమం అవుతుంది. ఇది పాయ్ సారథ్యంలోని మణిపాల్ గ్రూప్, అమెరికాకు చెందిన సిగ్నా కార్పొరేషన్, ఎల్ఐసీ మధ్య త్రికోణ డీల్ కావచ్చని అంటున్నారు. ఎల్ఐసీకి గల బలమైన నెట్‌వర్క్‌తో మార్కెట్ గతిని ఈ డీల్ ప్రభావితం చేయవచ్చన్నది పరిశీలకుల అభిప్రాయం.

జాయ్ అలుక్కాస్‌కు గౌరవ డాక్టరేట్



చెన్నై (ఆంధ్రజ్యోతి): జువెలరీ రిటైల్ సంస్థ జోయాలుక్కాస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ అలుక్కాస్‌కు చిత్కార యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. భారత్ సహా అంతర్జాతీయంగా ఆభరణాల వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించటంతో పాటు దాతృత్వ కార్యకలాపాలకు జాయ్ అలుక్కాస్ అందించిన తోడ్పాటుకు గుర్తింపుగా చిత్కార విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (హానోరిస్ కాసా) అందజేసింది. చిత్కార యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ అశోక్ కే చిత్కార, ప్రో-చాన్స్‌లర్ డాక్టర్ మధు చిత్కార, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సందీప్ శర్మ.. అలుక్కాస్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పారిశ్రామిక రంగంతో పాటు భవిష్యత్ తరాల కోసం వినూత్నంగా ఆలోచించిన వ్యక్తి జాయ్ అలుక్కాస్ అని ఈ సందర్భంగా ప్రో-చాన్స్‌లర్ మధు చిత్కార అన్నారు.

మార్కెట్లో రికవరీ

సెన్సెక్స్ 318 పాయింట్లు అప్

ముంబై: ర్యాలీకి ఒక రోజు విరామం ఇచ్చిన అనంతరం ఈక్విటీ సూచీలు తిరిగి రికవరీ బాట పట్టాయి. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, నెలవారీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు, బ్లూ చిప్ షేర్ల కొనుగోలు నేపథ్యంలో గురువారం సెన్సెక్స్ 317.93 పాయింట్ల లాభంతో 77,606.43 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 458.96 పాయింట్లు లాభపడి 77,747.46 పాయింట్లను తాకింది. నిఫ్టీ 105.10 పాయింట్ల లాభంతో 23,591.95 వద్ద ముగిసింది.

ఆటో షేర్లకు ట్రంప్ పోటు: డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ దెబ్బకు బీఎస్ఈలో టాటా మోటార్స్ 5.56% నష్టపోయి రూ.668.60 వద్ద స్థిరపడింది. నష్టపోయిన ఇతర షేర్లలో అశోక్ లేలాండ్, ఐషర్ మోటార్స్, మహీంద్రా, అపోలో టైర్స్, సోనా బీఎల్‌డబ్ల్యూ ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	440
వరంగల్	417	గోదావరి	420
చిత్తూరు	480	విశాఖపట్నం	420
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,840 ▲	82,350 ▲	1,11,000 ▲
విజయవాడ	90,500 ▲	85,500 ▲	1,00,200 ▲
విశాఖపట్నం	88,770 ▲	81,370 ▲	1,00,740 ▼
రాజమండ్రి	89,840 ▲	82,350 ▲	1,01,900 ▲
ప్రొద్దుటూరు	90,250 ▲	83,570 ▲	1,00,500 ▲
ముంబై	88,417 ▲	80,990 ▲	99,775 ▲

ఫామ్‌గేట్ ధర | **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	106	విజయవాడ	112
వరంగల్	106	గుంటూరు	113
కరీంనగర్	106	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	106	చిత్తూరు	95
కర్నూలు	106	నెల్లూరు	100
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	112		

ఆస్తి తగ్గినా.. అంబానీదే అగ్రస్థానం

హురున్ భారత కుబేరుల జాబితాలో రిలయన్స్ అధిపతికే మళ్లీ అగ్రకిరీటం

అత్యధిక సంపద సృష్టించినా రెండో స్థానంలో గౌతమ్ అదానీ

- సంపన్న మహిళగా రోష్నీ నాడార్
- లిస్ట్‌లో మొత్తం 284 మందికి చోటు
- అందులో 21 మంది తెలుగువారు
- మన బిలియనీర్ల మొత్తం సంపద విలువ రూ.98 లక్షల కోట్లు
- భారత జీడీపీలో మూడో వంతు ఇది..
- సౌదీ అరేబియా జీడీపీ కంటే అధికం..





అధిక బిలియనీర్లున్న దేశాల్లో భారత్ నం.3

ముంబై: ఈ ఏడాది (2025)కి గాను హురున్ విడుదల చేసిన ప్రపంచ కుబేరుల జాబితాలో భారత్ నుంచి 284 మందికి చోటు లభించింది. గత ఏడాది లిస్ట్‌తో పోలిస్తే 13 మంది పెరిగారు. వీరి మొత్తం సంపద గత ఏడాదితో పోలిస్తే 10 శాతం వృద్ధితో రూ.98 లక్షల కోట్లకు పెరిగింది. అంటే, మన దేశ జీడీపీలో మూడో వంతుకు సమానం. సౌదీ అరేబియా జీడీపీ కంటే అధికమిది. ఈ జనవరి 15 నాటికి ఆస్తుల విలువ ఆధారంగా బిలియనీర్లకు ర్యాంకింగ్‌లు కేటాయించినట్లు హురున్ తెలిపింది. మరిన్ని వివరాలు..

- రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి భారత కుబేరుల్లో అగ్రస్థానంలో నిలిచారు. ఆసియా ఖండంలోనూ ఆయనే నం.1. అంబానీ ఆస్తి 10,000 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో రూ.8.6 లక్షల కోట్లు. గత ఏడాదితో పోలిస్తే ఆయన ఆస్తి రూ.లక్ష కోట్ల (13 శాతం) మేర తగ్గినప్పటికీ తన అగ్రస్థానాన్ని మాత్రం కాపాడుకోగలిగారు. అయితే, ఈ ఏడాది ప్రపంచ టాప్-10లో మాత్రం అంబానీకి చోటు దక్కలేదు. ఈసారి 17వ స్థానానికి పరిమితమయ్యారు.
- అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ రూ.8.4 లక్షల కోట్ల ఆస్తితో రెండో స్థానంలో ఉన్నారు. గడిచిన ఏడాది కాలంలో ఆయన సంపద దాదాపు రూ.లక్ష కోట్ల (13 శాతం) మేర పెరిగింది. భారత బిలియనీర్లలో విలువ పరంగా అత్యధిక సంపద వృద్ధి ఇదే. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆయనకు 18వ స్థానం లభించింది.
- హెచ్‌సీఎల్ టెక్ చైర్మన్ రోష్నీ నాడార్ రూ.3.5 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దేశంలోని అత్యంత సంపన్న మహిళ తనే. ప్రపంచంలోని టాప్-10 సంపన్న మహిళల్లోనూ రోష్నీ 5వ స్థానంలో నిలిచారు.
- సన్ ఫార్మా చైర్మన్ దిలీప్ సంఘ్వీ, విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీ వరుసగా 4,5 స్థానాల్లో ఉన్నారు. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా, సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా, బజాజ్ ఆటోకు చెందిన నీరజ్ బజాజ్, ఆర్‌జే కార్ప్ అధిపతి రవి జైపురియా, డీమార్ట్ సూపర్ మార్కెట్ వ్యవస్థాపకులు రాధాకిషన్ దమానీ వరుసగా టాప్-10లోని తర్వాత స్థానాలను దక్కించుకున్నారు.
- ఈసారి జాబితాలో 175 మంది భారత బిలియనీర్ల సంపద పెరగగా.. 109 మంది సంపద తగ్గింది లేదా గతేడాది స్థాయిలోనే నమోదైంది.
- అత్యధిక మంది బిలియనీర్లున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. 870 మంది బిలియనీర్లతో అమెరికా అగ్రస్థానంలో నిలవగా.. 823 మంది బిలియనీర్లతో చైనా రెండో స్థానం దక్కించుకుంది.


హురున్ కుబేరుల జాబితాలోని తెలుగువారు

ప్రపంచ ర్యాంక్	పేరు	సంపద (బి. డాలర్లు)	కంపెనీ
260	మురళి దివి	10	దివీస్ లేబొరేటరీస్
600	పీ పిచ్చి రెడ్డి	5.8	మేఘా ఇంజనీరింగ్
625	పీవీ కృష్ణా రెడ్డి	5.6	మేఘా ఇంజనీరింగ్
1122	ప్రతాప్ సీ రెడ్డి	3.3	అపోలో హాస్పిటల్స్
1122	పీవీ రాంప్రసాద్ రెడ్డి	3.3	అరబిందో ఫార్మా
1198	బీ పార్థసారథి రెడ్డి	3.1	హెటిరో గ్రూప్
1624	కే సతీశ్ రెడ్డి	2.3	డాక్టర్ రెడ్డీస్
1796	ఎస్ సుబ్రమణ్యం రెడ్డి	2.1	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్
1796	సీ వెంకటేశ్వర రెడ్డి	2.1	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్
1796	ఎం సత్యనారాయణ రెడ్డి	2.1	ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్
2188	జీఎం రావు	1.7	జీఎంఆర్ గ్రూప్
2188	జూపల్లి రామేశ్వర్ రావు	1.7	మై హోమ్ గ్రూప్
2295	జీవీ ప్రసాద్	1.6	డాక్టర్ రెడ్డీస్
2448	మహిమ దాట్ల	1.5	బయోలాజికల్ ఈ
2575	కృష్ణ చివుకుల	1.4	ఇండో ఎంఐఎం
2878	ఆళ్ల అయోధ్యరామి రెడ్డి	1.2	రాంకీ గ్రూప్
3057	ఎన్ విశ్వేశ్వర్ రెడ్డి	1.1	షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్
3057	వీసీ నన్నపనేని	1.1	నాట్కో ఫార్మా
3057	జగదీశ్ ప్రసాద్ అల్లూరి	1.1	హెచ్‌బీఎల్ పవర్
3057	జీఎస్ రాజు	1.1	దక్కన్ ఫైన్ కెమికల్స్
3206	వెంకటేశ్వర్లు జాస్తి	1	సువెన్ ఫార్మా

పర్వదినం

నవ చైతన్యానికి నాంది

ప్రభవ నుంచి అక్షయ వరకు గల అరవై సంవత్సరాలలో 39వదైన విశ్వావసు నామ సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నాం. చైత్రమాస ఆగమనంతో ప్రకృతి పులకిస్తుంది. అంతటా కొత్తదనం సంతరించుకుంటుంది. నవచైతన్యానికి నాంది అవుతుంది. అనంతమైన కాలంలో సంవత్సరం ఒక ప్రమాణం. మానవ జీవనానికి, కాలస్వరూపుడైన ఆ పరమాత్మకు మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని, ఆధ్యాత్మికతను పెంచుకోవాలి. తదనుగుణంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి.



చాంద్రమానం అనుసరించే తెలుగువారి సంవత్సరాది... ఉగాది. సంస్కృత పదమైన 'యుగాది' కాలక్రమంలో 'ఉగాది' అయింది. 'ఉ' అంటే నక్షత్రం, 'గ' అంటే గమనం. అలా ఉగాది చాంద్రమాన నక్షత్ర గమనంతో రూపుదిద్దుకున్నదనేది ఖగోళ, జ్యోతిష శాస్త్ర ప్రమాణం. ఇదే విషయాన్ని హేమాద్రి పండితుడు 'చతుర్వర్గ చింతామణి' గ్రంథంలో ప్రస్తావిస్తూ... బ్రహ్మ సృష్టిని ప్రారంభించిన రోజుగా దీన్ని పేర్కొన్నాడు. అఖండ దేవుడు తన 'స్మృతి కౌస్తుభం' గ్రంథంలో "చాంద్రమాన సంవత్సరంలోని తొలి మాసమైన చైత్రమాసంలో... తొలి తిథి అయిన పాడ్యమి- ఉగాది" అని తెలిపాడు. ఈ రోజునుంచి వసంత ఋతువు ఆరంభమవుతుంది.

విధి విధానాలు, ఉగాది పచ్చడి...

కొత్త సంవత్సరం మొదలైన సందర్భంలో... ఆచరించవలసిన విధి విధానాలను మన పూర్వ ఋషులు ఎన్నడో నిర్దేశించారు. దాని ప్రకారం... ప్రాతఃకాలంలో అభ్యంగన స్నానం చేయడం ఉగాదినాటి తొలి నియమం. దానికి ముందు ఇంటిలోని పెద్దవారితో తలకు నూనె పట్టించుకొని, వారి ఆశీస్సులు పొంది, స్నానం చేయడం వల్ల అలక్ష్మి తొలగిపోతుందనీ. లక్ష్మీదేవి అనుగ్రహిస్తుందని పూర్వులు చెప్పారు. అలాగే నూతన వస్త్రాలు ధరించడం, దైవారాధన చేయడం, ఉగాది పచ్చడిని దైవానికి నివేదించి పరగడుపున ఆరగించడం, పెద్దల ఆశీస్సులు పొందడం లాంటివి విధులుగా నిర్దేశించారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకం. అది అమృత సమానం. విశేషమైన రోగ నిరోధక శక్తి కలిగినది. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ఈశ్వర ప్రసాదంగా స్వీకరిస్తే, ఏడాదంతా సౌఖ్యదాయకంగా ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

30న విశ్వావసు నామ ఉగాది

పంచాంగ శ్రవణం

అలాగే ఉగాది నాడు తప్పనిసరిగా పంచాంగాన్ని పూజించాలి. పంచాంగ శ్రవణం చేయాలి. పంచాంగం అంటే తిథి, వారం, నక్షత్రం, కరణం, యోగం అనే అయిదు అంగాలను కలిగినది. ఏడాది కాలాన్ని ప్రమాణంగా చేసుకొని... ఆ కాలంలో గ్రహాల సంచారం, అవి కలిగించే ఫలితాలు, ఆయా నక్షత్ర జాతకులు పొందబోయే శుభాశుభ ఫలితాలు, రాజపూజ్య అవమానాలు, ఆదాయ వ్యయాలు, కందాయ ఫలాలు... ఇలా పలు విషయాలు పంచాంగంలో సవివరంగా ఉంటాయి. అలాగే గ్రహ సంచారాలు, నక్షత్ర గమనం, పండుగల నిర్ణయం, శుభ ముహూర్తాలు... ఇవన్నీ పంచాంగాన్ని అనుసరించే ఉంటాయి. ముఖ్యంగా కర్తరీ నిర్ణయం సూర్యుడి ఆధారంగా జరుగుతుంది. వాతావరణ మార్పులను సూచించే కర్తరీ నిర్ణయం కర్షకులకు ఎంతో ముఖ్యం. ఇవే కాకుండా, గ్రహణాలు, పుష్కరాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా పంచాంగం ద్వారా తెలుసుకోవచ్చు. గ్రహాలు పరమాత్ముని అధీనంలో ఉంటాయి. పంచాంగ శ్రవణం చేసి, పరమాత్ముని ప్రార్థించిన వారికి ఆయన కృప నిస్సంశయంగా కలుగుతుంది. మనం నిత్యం చేసే పూజా విధిలో ఈ అయిదు అంగాలను స్మరించుకోవడమే సంకల్పం. తిథి... శ్రేయస్సును ఇస్తుంది. వారం... ఆయుష్షను కలిగిస్తుంది. నక్షత్రం... పాపాలను తొలగిస్తుంది. యోగం... రోగాలను తొలగిస్తుంది. కరణం... కార్యాలకు విజయం చేకూరుస్తుంది. అందుకే పంచాంగాన్ని ఒక ఏడాదికి సంబంధించిన 'కాల విజ్ఞాన సర్వస్వం' అని చెప్పవచ్చు.

• ఆయపిళ్ల రాజపాప

సందేశం

పండుగ అంటే మన బంధుమిత్రులతో కలిసి మనం మాత్రమే వేడుక చేసుకోవడం కాదు. మన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్న నిరుపేదలను, ఆర్తులను కూడా ఆ సంబరాల్లో భాగస్వాములుగా చేయడం. మనకు ఉన్నదాన్ని వారితో పంచుకోవడం. అందరి సంతోషమే అల్లాహ్‌కు ప్రీతికరమని తెలుసుకోవడం. రంజాన్ పండుగ ఇచ్చే సందేశం అదే.

పంచుకుంటేనే పండుగ!

ఇస్లాం ధర్మంలో పండుగలు రెండు మాత్రమే. ఒకటి 'ఈద్-ఉల్-ఫితర్' (రంజాన్), రెండోది 'ఈద్-ఉల్-అజ్‌హా' (బక్రీద్). రంజాన్‌ను 'ఫిత్రాల పండుగ' అని కూడా అంటారు. అంటే పేదలకు ఫిత్రా దానాన్ని చెల్లించే పండుగ. ఒక ఫిత్రా దానం విలువ రెండున్నర కిలోల గోధుమల విలువకు సమానమై ఉంటుంది. దీన్ని సాధారణ వ్యక్తుల నుంచి సంపన్నుల వరకూ కచ్చితంగా చెల్లించాలనేది నియమం. రంజాన్ మాసంలో చేసిన ఉపవాసాల్లో దొర్లిన చిన్న చిన్న లోటుపాట్లను ఫిత్రా దానం భర్తీ చేస్తుందని దైవప్రవక్త మహమ్మద్ తన బోధనల ద్వారా తెలియజేశారు. మరో వైపు నిరుపేదలకు ఇది సంతోషాన్ని పంచుతుంది. పరస్పర దయ, సహకార గుణాలను పెంచుతుంది. హృదయాలను శుద్ధి చేస్తుంది. లోభత్వాన్ని అరికడుతుంది.



> "రంజాన్‌ను 'ఫిత్రాల పండుగ' అని కూడా అంటారు. అంటే పేదలకు ఫిత్రా దానాన్ని చెల్లించే పండుగ. ఒక ఫిత్రా దానం విలువ రెండున్నర కిలోల గోధుమల విలువకు సమానం."

ఇలా చేయాలి

రంజాన్ పర్వదినాన చేయవలసిన పనులను పవిత్ర గ్రంథాలు నిర్దేశించాయి. వాటి ప్రకారం: ఉదయాన్నే లేవాలి. కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఫజ్ర్ నమాజ్‌కు ముందు కానీ, తరువాత కానీ తలంటు స్నానం చేయాలి. ఉన్నవాటిలో మంచి దుస్తులు ధరించాలి. సుగంధ ద్రవ్యాలు పూసుకోవాలి. వ్యక్తిగత అలంకరణ చేసుకోవాలి. కళ్ళకు సుర్మా పెట్టుకోవాలి. ఈద్ నమాజ్‌కన్నా ముందే జకాత్, ఫిత్రా దానాలను చెల్లించాలి. తీపి పదార్థాన్ని, బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లను తినాలి. ఈద్గా మైదానానికి వెళ్ళేటప్పుడు ఒక దారిలో వెళ్ళాలి, వేరే దారిలో తిరిగి రావాలి. ఈద్ నమాజ్‌కు వెళ్తున్నప్పుడు 'తక్బీర్' (స్తుతి)ని మెల్లగా పలుకుతూ ముందుకు సాగాలి. కాలినడకన ఈద్గాకు వెళ్ళడం పుణ్యప్రదం. నమాజ్ తరువాత ఒకరికొకరు సలాం చెప్పుకోవాలి. ఈద్ నమాజ్‌ను బస్తీ లేదా గ్రామం బయట ఉండే బహిరంగ ప్రదేశంలో... అంటే ఈద్గాలో చేయడం సున్నత్ ప్రవక్త సంప్రదాయం. ఆ సౌకర్యం లేనప్పుడు మసీదులో కూడా చేయవచ్చు. నమాజ్ పూర్తయ్యాక... బంధు మిత్రులతో కలిసి విందుతో సంతోషంగా గడపాలి.

• మహమ్మద్ వహీదుద్దీన్

సహజయోగ

కొత్తదనాన్ని ఆహ్వానిద్దాం!

వసంత ఋతువు ఆగమనం, లేత మామిడి చిగుళ్ళు, మధురమైన కోయిల గానం... ఇవన్నీ ఉగాది పర్వదినానికి ప్రకృతి సహజమైన అలంకారాలు. ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, బంధు మిత్ర సమాగమం లాంటివన్నీ సన్మార్గంలో నడవడానికి ఏర్పరచుకున్న సంప్రదాయాలు. వీటన్నిటి సంగమమైన ఉగాది ఒక ఆహ్లాదకరమైన పర్వదినం. మంచి పనులను మొదలుపెట్టడానికి ఈ రోజు ఎంతో



శ్రేష్టమైనది. మన ఆధ్యాత్మిక ప్రయాణంలో ఉగాది పండుగ విశిష్టత గురించి శ్రీమాతాజీ నిర్మలాదేవి చేసిన ప్రవచనాలను గుర్తు చేసుకుందాం.

ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి... ఉగాది. చైత్ర నవరాత్రులు కూడా ఈ రోజు నుంచే ప్రారంభమవుతాయి. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన ఈ నవరాత్రులలో అమ్మవారిని తొమ్మిది రూపాలలో పూజిస్తే... ఆమె అనంతమైన కృపకు పాత్రులం కాగలం. ఎన్నో గొప్ప విషయాలకు ఇదే తొలి రోజు అని మన పూర్వీకులు పేర్కొన్నారు.. ఆదిశక్తి సృష్టి రచనను ఈ రోజే మొదలుపెట్టిందనీ, గణేశుణ్ణి ఆమె సృష్టించినది ఈ రోజేననీ, కాలం ఈ రోజే ప్రారంభమయిందనీ పలు గ్రంథాలు చెబుతున్నాయి. ఉగాది రోజును ధ్యానం, పూజ, ప్రార్థనలతో ప్రారంభించాలని సూచించారు. ఆధ్యాత్మిక జీవనంలో కొత్త అధ్యాయాలను, ప్రారంభించడానికి ఇది ఎంతో అనువైన రోజు. అలాగే మన జీవితం పట్ల గ్రహాల ప్రభావాన్ని అర్థం చేసుకొని, వాటిని అనుకూలపరచుకోవడం ద్వారా ఉన్నతి పొందడం ఎలాగనేది అర్థం చేసుకోవడం ప్రధానం.

"జ్యోతిష శాస్త్రం ప్రకారం... నవగ్రహాల వల్ల మన సూక్ష్మ శరీరంలో ఉండే వివిధ శక్తి కేంద్రాలు ప్రభావితమవుతాయి. మూలాధార చక్రాన్ని కుజుడు లేదా మంగళుడు, స్వాధిష్ఠాన చక్రాన్ని బుధుడు, మణిపూర చక్రాన్ని గురువు, అనాహత చక్రాన్ని శుక్రుడు, విశుద్ధ చక్రాన్ని శని, ఆజ్ఞా చక్రాన్ని సూర్యుడు, సహస్రార చక్రాన్ని చంద్రుడు, రాహు కేతువులు ప్రభావితం చేస్తారు. సహజ యోగ ధ్యానం ద్వారా ఆ చక్రాలను లేదా శక్తి కేంద్రాలను శుద్ధి చేసుకున్నప్పుడు... సంబంధిత గ్రహాల దుష్ప్రభావం మన జాతకంలో ఉంటే తొలగిపోతుంది. అలాగే శక్తి కేంద్రాల మీద జాతి రత్నాల ప్రభావం కూడా ఉంటుంది. మూలాధార చక్రంపై పగడం, స్వాధిష్ఠాన చక్రంపై కనక పుష్యరాగం, మణిపూర చక్రంపై పచ్చ, అనాహత చక్రంపై కెంపు, విశుద్ధ చక్రంపై నీలం, ఆజ్ఞా చక్రంపై వజ్రం, సహస్రార చక్రంపై ముత్యం ప్రభావాన్ని చూపుతాయి. ఆ రత్నాలను ఉపయోగించడం ద్వారా ఆయా చక్రాలను శుద్ధి చేసుకోవచ్చని, అవి శుద్ధి అయినప్పుడు... ఆ గ్రహాల శుభ దృష్టి మానవులకు లభిస్తుంది" అని నిర్మలాదేవి తెలిపారు.

ఆధ్యాత్మికంగా మానవుడి అత్యున్నత లక్ష్యం... తను సృష్టించిన పరమాత్మతో అనుసంధానం కావడమే. దీనికోసం మానవులలోని కుండలినీ శక్తి జాగృతమై, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, సర్వవ్యాపితమైన భగవంతుని శక్తితో ఐక్యం కావాలి. ఈ మార్గంలో ఉండే ఆరు చక్రాలను కుండలినీ శక్తి దాటాలంటే... సాధకుడు శుభ లక్షణాలను సంతరించుకోవాలి. దీనికి నవగ్రహాలు దోహదం చేస్తాయి. ఉదాహరణకు... శని గ్రహం మన విశుద్ధ చక్రం మీద ప్రభావం చూపిస్తుంది. ఈ చక్రాన్ని కుండలినీ శక్తి దాటాలంటే... మానవులకు వైరాగ్య భావం, ప్రతిదాన్నీ సాక్షిలా చూడగలిగే స్వభావం ఉండాలి. పరిపూర్ణ ఆత్మ స్వరూపుడై... పరమాత్మను తనలో ప్రతిబింబించే వ్యక్తి... కష్ట సుఖాలను సమానంగా చూస్తాడు. అలాంటి వ్యక్తులపై శని అశుభ దృష్టి పని చేయదు. ఇదే విధంగా సహజయోగ సాధన ద్వారా కుండలినీ శక్తిని జాగృతం చేసుకున్న వ్యక్తి మీద నవగ్రహాల అశుభ ప్రభావం ఉండదని నిర్మలాదేవి వివరించారు. దీనికోసం సాధన ప్రారంభించడానికి, సాధనలో ఉన్నవారు మరింత దీక్షగా కొనసాగించాలనే సంకల్పం చేసుకోవడానికి వసంత ఋతువు అనువైన సమయం. ఈ సాధనకు శ్రీకారం చుట్టడానికి ఉగాది శుభప్రదమైన రోజు. కాబట్టి కొత్తదారిలో నడవడానికి, కొత్తదనాన్ని ఆహ్వానించడానికి సిద్ధమవుదాం.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



ఆశలకు ప్రతిరూపం



తెలుగు వారి కొత్త సంవత్సరం 'విశ్వావసు' మన ముంగిటకు వచ్చేస్తోంది. కొత్త సంవత్సరం కొత్త ఆశలకు తెర తీస్తోంది. ఇలాంటి ఆశలకు ప్రతి రూపమే మన పురాణాలలో అభివర్ణించిన రెక్కల గుర్రం- ఉచ్చైశ్రవం. భౌతిక పరిమితులను అధిగమించి.. పురోగతిని , ఆధ్యాత్మిక శక్తిని పొందాలనుకొనేవారికి ఇది మార్గదర్శి. స్వేచ్ఛ కోసం, అసాధారణ శక్తి సంపన్నత కోసం, ఆధ్యాత్మిక ప్రగతి కోసం తపన పడిన 'మనీషి'గా మారిన మనుషి ఆలోచనల నుంచి ఉద్భవించిన లోతైన తాత్త్విక భావన ఇది. ప్రాచ్య, పాశ్చాత్య పురాణాలన్నింటిలోనూ ఈ ఉచ్చైశ్రవ ప్రస్తావన ఉంది.

క్షీరసాగర మథనం జరిగినప్పుడు ఏడు తలలతో తెల్లని కాంతులీనే దివ్యాశ్వం ఉద్భవించింది. దేవ లోకాన్ని, మానవ లోకాన్ని కలిపే అశ్వమిది. 'నరసింహ పురాణం' ప్రకారం దేవతలు, అసురులు అమృతాన్ని పొందేందుకు క్షీరసాగరాన్ని మథించడం ప్రారంభించారు. దఫదఫాలుగా వేల సంవత్సరాలు సాగిన ఈ మథనంలో అనేక దివ్య వస్తువులు, జీవులు ఉద్భవించాయి. ఇలా రెండో మథనంలో బయటకు వచ్చినవి- ఐరావతం, ఉచ్చైశ్రవం. ఐరావతం ఐశ్వర్యానికి ప్రతీక. ఉచ్చైశ్రవం స్వేచ్ఛకు, పరాక్రమానికి, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక. 'దేవీ భాగవతం- 6వ అధ్యాయం'లో దీనికి సంబంధించిన ఒక కథ ఉంది. ఒక రోజు సూర్యపుత్రుడు రేవంతుడు ఉచ్చైశ్రవాన్ని ఎక్కి వైకుంఠానికి వస్తాడు. ఆ అశ్వం అందానికి లక్ష్మీదేవి మంత్రముగ్ధురాలై తనని తాను మర్చిపోయి చూస్తూ ఉండిపోతోంది. విష్ణువు ఆమెను అనేక సార్లు పిలుస్తాడు. ఆమె పలకదు. దీనితో విష్ణువుకు కోపం వచ్చి - "అశ్వాన్ని చూసి మైమరచిపోయావు కాబట్టి నువ్వు భూలోకంలో అశ్వ రూపంలో జన్మించు" అని శపిస్తాడు. అప్పుడు శ్రీవిష్ణువును లక్ష్మీదేవి వేడుకుంటుంది. "భూలోకంలో నాతో సమానమైన కుమారుడిని పొందినప్పుడు మళ్ళీ నా సఖిగా చేరతావు..." అని లక్ష్మీదేవికి అనుగ్రహిస్తాడు. మనస్సు నిలకడగా లేకపోతే- అది ఎంత దివ్య సంబంధాన్నైనా దూరం చేస్తుందనేది ఈ కథ సారాంశం.

స్థల పురాణాలు కూడా...

సుప్రసిద్ధి చెందిన నాగేశ్వర తీర్థం ఏర్పడటానికి ఉచ్చైశ్రవం కారణమని అక్కడి స్థల పురాణాలు చెబుతాయి. వీటి ప్రకారం- కశ్యప మహర్షి భార్యలు- కద్రువ, వినతలకు ఉచ్చైశ్రవం రంగు విషయంలో వాదన జరుగుతుంది. కద్రువ ఆ అశ్వం నల్లదని, వినత అది తెల్లదని వాదించుకుంటారు. తన వాదనను నెగ్గించుకుందుకు కద్రువ- తన సర్ప కుమారులను వెళ్లి ఉచ్చైశ్రవాన్ని చుట్టుకొమ్మని ఆజ్ఞాపిస్తుంది. దీని ద్వారా అశ్వం నల్లదని వినతకు నిరూపించవచ్చునేది కద్రువ భావన. దానికి ఆమె కుమారులు అంగీకరించరు. దీనితో కద్రువకు కోపం వచ్చి తన కుమారులను శపిస్తుంది. ఈ శాపవిముక్తి కోసం వారందరూ నాగేశ్వర తీర్థం వద్దకు వచ్చి శివుణ్ణి ప్రార్థిస్తారు. వారికి శివుడు విముక్తి ప్రసాదిస్తాడు. ఇలాంటి మరో స్థల పురాణం వటవటేశ్వర తీర్థం ఎలా ఉద్భవించిందనే విషయాన్ని చెబుతుంది. దీని ప్రకారం ఉచ్చైశ్రవానికి అశ్వపర్ణ, సుపర్ణ, మధుపర్ణ, మరుధ్గతి అనే నలుగురు కుమారులు ఉంటారు. అశ్వపర్ణ- చంద్రుడి వాహనం. వటవటేశ్వర తీర్థంలో శంకరుడి కోసం చంద్రుడు తపస్సు చేయటం మొదలుపెడతాడు. ఆయనతో పాటు అశ్వపర్ణ కూడా తపస్సు ప్రారంభిస్తాడు. కానీ కొద్ది కాలానికి శక్తి క్షీణించి పడిపోతాడు. అప్పుడు శంకరుడు ప్రత్యక్షమై అశ్వపర్ణకు పరిపూర్ణమైన శరీరాన్ని ప్రసాదిస్తాడు. ఒక గుర్రం శివుడి దర్శనం పొందిన ఆ ప్రాంతాన్ని 'వటవటేశ్వర తీర్థం' అని పిలుస్తారు. ఈ ప్రాంతంలోనే ప్రవహించే నదికి 'అశ్వపర్ణి' అని పేరు.

- గ్రీకు పురాణాల ప్రకారం- మెడూసా అనే వీరుడి తలని పెర్సియస్ నరుకుతాడు. ఆ రక్తం నుంచి పెగాసస్ అనే రెక్కల గుర్రం జన్మించింది. బెల్లెరోఫోన్ అనే యోధుడు దీని సహాయంతో చిమేరా అనే భయంకర రాక్షసిని సంహరిస్తాడు. ఆ తర్వాత అతను అహంకారంతో దేవలోకానికి చేరాలనుకుంటాడు. అప్పుడు పెగాసెస్ అతణ్ణి పాతాళానికి తొక్కేస్తుంది. దురహంకారం మనిషిని అధఃపాతాళానికి చేరుస్తుందనటానికి ఉదాహరణగా ఈ కథను చెబుతారు.
- మహమ్మద్ ప్రవక్త 'బురాఖ్' అనే రెక్కల గుర్రాన్ని అధిరోహించిన ప్రస్తావన ఇస్లాంలో ఉంది. ఈ గుర్రం కాళ్ళు భూమిపై ఆనవు. అది వాయు-మనోవేగాలతో ప్రయాణిస్తుంది.
- మంగోలియన్ పురాణాల ప్రకారం తుల్పార్ అనే రెక్కల గుర్రం వీరులందరికీ సాయపడుతూ ఉంటుంది. మరణానంతరం వారికి ఉత్తమలోకాలకు తీసుకువెళ్తుంది.
- చైనీయులు లాంగ్మా అనే రెక్కల గుర్రం పుణ్యఫలాలను తీసుకువస్తుందని నమ్ముతారు. వాస్తవానికి ఇది డ్రాగన్ - అశ్వాల మిశ్రమం.

భగవద్గీతలో కూడా...

భగవాన్ శ్రీకృష్ణుడు గీతలో- "అశ్వాలలో ఉత్తమమైన ఉచ్చైశ్రవాన్ని నేనే. ఏనుగుల్లో రాజైన ఐరావతాన్ని నేనే! మనుషుల్లో సమ్రాట్టును నేనే" అని పేర్కొంటాడు. 'బ్రహ్మవైవర్తపురాణం'లోని 'బ్రహ్మఖండం'లో గోపుల రాజు ఉచ్చైశ్రవ వంశానికి చెందిన ఐదు లక్షల గుర్రాలను, వేల రథాలను, మూడు లక్షల ఎద్దుల బండ్లను దానం చేసినట్టు ఉంది. 'స్కాందపురాణం'లోని 'మాహేశ్వర ఖండం' (కేదార ఖడం)లో సూర్యుడి వాహనంగా ఉచ్చైశ్రవాన్ని పేర్కొన్నారు. మరికొన్ని పురాణాలు బలిచక్రవర్తి వాహనంగా దీన్ని ప్రస్తావించాయి.

• డాక్టర్ జి.వి.పూర్ణచంద్

సద్బోధ

ఇక నటించక్కర్లేదు

చైనాలో విలసిల్లిన సుప్రసిద్ధ మత ధర్మాలలో తావోయిజం ఒకటి. తావోయిజంలో మొదట పేర్కొనాల్సిన ప్రముఖుడు లావోట్సూ. ఆ తరువాత స్థానాల్లో లైట్సూ, అతని శిష్యుడు చువాంగ్ ట్సూ ఉంటటారు. లైట్సూను కలుసుకోవడానికి ముందు చైనా చక్రవర్తి కొలువులో చువాంగ్ ఉద్యోగిగా ఉండేవాడు. చక్కటి ప్రవర్తనతో, మంచి మాటలతో, వినయ విధేయతలతో అతను చక్రవర్తి మెప్పు పొందాడు. ఆ తరువాత లైట్సూతో చువాంగ్‌కు పరిచయం ఏర్పడింది. వారిద్దరూ ఎన్నో విషయాలు కలిసి చర్చించేవారు. లైట్సూతో సాన్నిహిత్యం చువాంగ్‌లో ఎంతో మార్పు తెచ్చింది. తను గడుపుతున్న జీవితం అతనికి సంతృప్తిగా అనిపించలేదు. తాను సాధించవలసింది ఇంకా ఎంతో ఉందని గ్రహించాడు. తన పరిస్థితిని చక్రవర్తికి విన్నవించి, కొంతకాలం సెలవు తీసుకున్నాడు.

ఆ తరువాత గురువు లైట్సూ పర్యవేక్షణలో తన సాధనను చువాంగ్ కొనసాగించాడు. జ్ఞానోదయం పొందాడు. అతని పేరు ప్రతిష్ఠలు క్రమక్రమంగా రాజ్యమంతటా విస్తరించాయి. చువాంగ్ గొప్పతనం గురించే అందరూ మాట్లాడుకొనేవారు. ఈ సంగతి చక్రవర్తి చెవిన పడింది. ఒకప్పుడు తన కొలువులో పనిచేసిన వ్యక్తి... జ్ఞాని అయ్యాడనీ, ప్రజలందరి గౌరవాన్ని పొందుతున్నాడనీ తెలిసి చాలా సంతోషించాడు. సెలవుపై వెళ్ళిన చువాంగ్ ఏదో ఒక రోజు తనను కలుసుకోవడానికి వస్తాడని చక్రవర్తి ఎంతగానో ఎదురుచూశాడు. కాలం గడుస్తోంది కానీ చువాంగ్ రాలేదు. చివరకు స్వయంగా చక్రవర్తే బయలుదేరాడు.

చక్రవర్తి కొలువులో ఉన్నప్పుడు చక్రవర్తి అన్ని పద్ధతులను సక్రమంగా పాటించేవాడు. ఇప్పుడు కూడా... తన రాక గురించి తెలిసిన వెంటనే మర్యాదపూర్వకంగా ఎదురు వచ్చి స్వాగతం పలుగుతాడని, గౌరవాన్ని కనబరుస్తాడని చక్రవర్తి ఆశించాడు. కానీ అలా జరగలేదు. ఆఖరికి చక్రవర్తి స్వయంగా చువాంగ్ ఎదుటకు వచ్చి నిలబడినా, కనీసం నిలబడలేదు. రెండు కాళ్ళను చాచుకొని, పిల్లన గ్రోవి ఊదుతూ చెట్టుకింద అలాగే కూర్చున్నాడు. చక్రవర్తిని చూసిన తరువాత కూడా కాళ్ళను ముడుచుకోలేదు, పిల్లన గ్రోవిని ఊదడం మానలేదు. ఇది చక్రవర్తికి ఆశ్చర్యం కలిగించింది.

"చువాంగ్! మర్యాదలన్నీ మరచిపోయావా? పద్ధతులన్నీ గాలికి వదిలేశావా? అహంకారం తలకెక్కిందా? చక్రవర్తి వస్తే తగిన గౌరవం చూపించవా? నీకేమయింది?" అని ప్రశ్నించాడు.

అప్పుడు చువాంగ్ నవ్వి "ఓ రాజా! మీ కొలువులో పని చేస్తున్నప్పుడు మీ మెప్పు పొందడం కోసం ఏవేవో మర్యాదలు కనబరిచాను. మిమ్మల్ని మెప్పించి స్వార్థపూరితమైన నా కోరికలు తీర్చుకున్నాను. అదంతా నటన. ఇప్పుడు నాకు స్వార్థం లేదు, కోరికలు అస్సలు లేవు. కాబట్టి వినయ విధేయతలను ఇక ఏమాత్రం నటించలేను. ఇప్పుడు నా హృదయంలో ఉన్నది



ప్రేమ మాత్రమే. నా దగ్గరకు రాజు వచ్చినా, దరిద్రంతో మునిగి ఉన్న వ్యక్తి వచ్చినా... ఏ బేధం పాటించకుండా ఆ ప్రేమను మాత్రమే చూపించగలను" అని చెప్పాడు.

ఆ మాటలు సత్యమని చక్రవర్తి గ్రహించాడు. అవి హృదయం నుంచి వచ్చిన మాటలేననీ, అహంకారం లోంచి పుట్టినవి కావని తెలుసుకున్నాడు. చువాంగ్‌కు నమస్కరించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

• రాచమడుగు శ్రీనివాసులు



ప్రవీణ్ అంతిమ యాత్రలో పాల్గొన్న క్రైస్తవ ప్రముఖులు, అభిమానులు

పాస్టర్ ప్రవీణ్‌కు అంతిమ వీడ్కోలు

» సికింద్రాబాద్‌లోని క్రైస్తవ శ్మశానవాటికలో ఖననం

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల అంతిమ కార్యక్రమాలు సికింద్రాబాద్‌లో జరిగాయి. ప్రవీణ్ పగడాల భౌతికకాయాన్ని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని క్రైస్తవ శ్మశాన వాటికలో గురువారం సాయంత్రం ఖననం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ప్రవీణ్ మృతదేహం గురువారం తెల్లవారుజామున సికింద్రాబాద్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చికి వచ్చింది. ప్రవీణ్‌కు తుది వీడ్కోలు పలికేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు, క్రైస్తవ బోధకులు తరలివచ్చారు. బ్రదర్ అనిల్, కేఏ పాల్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, మైనంపల్లి హనుమంతరావు తదితర ప్రముఖులు నివాళి అర్పించారు. ప్రవీణ్ మృతిని ప్రమాదంగా చిత్రీకరించేందుకు పోలీసులు యత్నిస్తున్నారని కేఏ పాల్ ఆరోపించారు.

ప్రవీణ్‌ది ముమ్మాటికి హత్యే: మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తన వ్యక్తిగత దర్యాప్తు ప్రకారం పాస్టర్ ప్రవీణ్‌ది ముమ్మాటికీ హత్యేనని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. దీనిపై పారదర్శకంగా విచారణ జరపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

హత్యని అందరూ నమ్ముతున్నారు: షర్మిల

పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందలేదని, ఆయన హత్యకు గురయ్యారని కుటుంబ సభ్యులతో సహా అందరూ నమ్ముతున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. ఆయన మరణంపై వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి, నిజాలను నిగ్గు తేల్చాలని కోరారు.

ఉత్కంఠగా 'స్థానిక' ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానిక సంస్థల పదవులకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ఉత్కంఠ భరిత వాతావరణంలో సాగాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపీపీ ఎన్నికలు కోరం లేక వాయిదా పడ్డాయి. అనంతపురం జిల్లా గాండ్లపెంటలో ఒకే ఎంపీటీసీ సభ్యుడు ఇద్దరు ఎంపీపీ అభ్యర్థులను ప్రపోజ్ చేయడంతో గందరగోళం ఏర్పడి, ఎన్నికను వాయిదా వేశారు. ఈ రెండు స్థానాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహిస్తారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలో 9మంది ఎంపీటీసీలు ఉండగా.. ఇటీవల ఎంపీపీ నాగమ్మ మృతిచెందారు. మిగిలిన 8మందిలో ఇద్దరే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీటీసీలు తనవద్దే ఉన్నారని, పెనుకొండ తహసీల్దారు వద్ద హాజరు పరుస్తున్నానని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎంపీటీసీలను తీసుకుని తహసీల్దారు కార్యాలయం నుంచి తోపుదుర్తి బయటకు రాగానే తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. టీడీపీ, వైసీపీ వర్గీయులు దుర్భాషలాడుకున్నారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. పోలీసులు ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్నారని తోపుదుర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ అంతు చూస్తా..' అంటూ పోలీసులను బెదిరించారు. కాగా, కృష్ణాజిల్లాలో 17 ఉప సర్పంచ్ స్థానాలకు గాను 10 గ్రామ పంచాయతీల్లో కూటమికి చెందినవారు, 7 స్థానాల్లో వైసీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఎంపీపీ పదవిని వైసీపీ కైవసం చేసుకుంది. ఉపసర్పంచ్ ఎన్నికల్లో 2 టీడీపీ, 2 వైసీపీ గెలుచుకున్నాయి. ఇదిలాఉండగా, పశ్చిమగోదావరి జిల్లా యలమంచలి, అత్తిలి స్థానాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహిస్తారు. 15మంది ఉపసర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా బీజేపీ అభ్యర్థి తొస్సిపూడి ఎంపీటీసీ తేతలి సుమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి గెలిచిన తొలి ఎంపీపీ సుమ కావడం గమనార్హం.

గేట్స్ ఫౌండేషన్ ఒప్పందం అమలుకు టాస్క్‌ఫోర్స్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సేవలను మెరుగ్గా అందించడానికి, ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి విప్లవాత్మక మార్పులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఆ క్రమంలోనే గేట్స్ ఫౌండేషన్‌తో ఈనెల 19న ఒక ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందాన్ని పకడ్బందీగా, వీలైనంత త్వరగా అమలులోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఒప్పందం అమలు చేయడానికి 'ఆంధ్రప్రదేశ్ - గేట్స్ ఫౌండేషన్ టాస్క్ ఫోర్స్'ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈమేరకు గురువారం ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వు జారీ చేశారు. మొత్తం 26 మంది సభ్యులు ఉన్న ఈ ఫోర్స్‌కు సమన్వయకర్తగా ఐటీఈ అండ్ సీ శాఖ ప్రత్యేక కార్యదర్శి వ్యవహరిస్తారు.

పుతిన్ త్వరలోనే చనిపోతాడు



» అప్పుడే యుద్ధం ఆగిపోతుంది: జెలెన్‌స్కీ

కీవ్, మాస్కో, సియోల్, మార్చి 27: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఉద్దేశించి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. పుతిన్ త్వరలోనే చనిపోతాడని, అప్పుడు తమ ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం ఆగుతుందని అన్నారు. ఈ యుద్ధం కొనసాగాలని రష్యా కోరుకుంటోందని, దీన్ని ఆపేలా ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పుతిన్ ఆరోగ్యంపై నిరంతరం వదంతులు వస్తున్న నేపథ్యంలో బుధవారం పారిస్‌లో యూరోపియన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. భారత్ రావాలన్న ప్రధాని మోదీ ఆహ్వానాన్ని తమ దేశాధినేత అంగీకరించారని రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్ గురువారం తెలిపారు. అయితే పర్యటన తేదీలను మాత్రం ప్రకటించలేదు.

బంగ్లాతో బంధాలు బలోపేతం: మోదీ

» స్వాతంత్ర్య శుభాకాంక్షలు తెలుపుతూ యూనస్‌కు లేఖ

న్యూఢిల్లీ, మార్చి 27: బంగ్లాదేశ్‌తో బలమైన ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. బుధవారం బంగ్లాదేశ్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆ దేశ ప్రజలకు, తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఉమ్మడి చరిత్ర, త్యాగాలకు ఈ రోజు నిదర్శనమని ఓ లేఖ రాశారు.

సరిహద్దు సమస్య పరిష్కారానికి సిద్ధం: చైనా

బీజింగ్, మార్చి 27: సరిహద్దు సమస్యకు న్యాయమైన పరిష్కారానికే కాకుండా సుస్థిర, దృఢమైన సైనిక సంబంధాల కోసం భారత సైన్యంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు గురువారం చైనా మిలిటరీ పేర్కొంది. తూర్పు లద్దాఖ్‌లో బలగాల ఉపసంహరణ, తదుపరి ప్రక్రియ గురించి మీడియా సమావేశంలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చైనా నేషనల్ డిఫెన్స్ అధికార ప్రతినిధి సీనియర్ కల్నల్ వూ కియాన్ ఈ మేరకు సమాధానమిచ్చారు.


సీఏ పరీక్షలు ఏడాదికి మూడుసార్లు: ఇకాయ్

న్యూఢిల్లీ, మార్చి27: చార్టెడ్ అకౌంటెంట్ ఫైనల్ పరీక్షలు ఈ ఏడాది నుంచి మూడుసార్లు నిర్వహిస్తామని ఇకాయ్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) తెలిపింది. ఇంటర్మీడియట్, ఫౌండేషన్ కోర్సులకు మూడుసార్లు పరీక్షలు నిర్వహించాలని ఇకాయ్ గత ఏడాది నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి అమలు చేయనుంది. ఇకపై ఫిబ్రవరి, జూన్, అక్టోబర్‌లలో పరీక్షలు రాసే అవకాశం కల్పించారు.

సర్కారీ సహకార్ ట్యాక్సీ

ఓలా, ఉబెర్ వంటి అగ్రిగేటర్లకు పోటీగా.. రానున్న కొన్ని నెలల్లో అందుబాటులోకి..: అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 27: ఓలా, ఊబెర్ వంటి అగ్రిగేటర్ల కమీషన్లు, చార్జీల బాదుడుతో విసిగిపోతున్న ప్రయాణికులకు, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కేంద్ర ఉపశమనం కలిగించేలా.. 'సహకార్ ట్యాక్సీ సర్వీస్‌'ను కేంద్రం త్వరలో అందుబాటులోకి తేనుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం లోక్‌సభలో దీని గురించి ప్రకటించారు. ఈ విధానంలో భాగంగా స్థానిక సహకార సంఘాలే అగ్రిగేటర్ల పాత్ర పోషిస్తాయి. బైకులు, ఆటోలు, క్యాబ్‌లు ఉన్నవారు సహకార సంఘాల వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రధాని మోదీ ఎప్పుడూ పేర్కొనే 'సహకార్ సే సమృద్ధి (సహకారంతోనే సౌభాగ్యం)' విధానంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్టు అమిత్ షా వెల్లడించారు. ఈ కాన్సెప్ట్‌ను అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర సహకార శాఖ గడిచిన మూడున్నరేళ్లుగా నిర్విరామంగా కృషిచేస్తోందని షా తెలిపారు. 'సహకార్ ట్యాక్సీ' అందుబాటులోకి వస్తే.. డ్రైవర్లు తమకొచ్చే లాభాలను పెద్ద పెద్ద అగ్రిగేటర్ సంస్థలతో పంచుకోవాల్సిన పనిలేదని.. అవి పూర్తిగా డ్రైవర్లకే చెందుతాయని, దీంతో వారికి మరింత ఆర్థిక భద్రత, స్వాతంత్ర్యం లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బైక్, ఆటో, ట్యాక్సీ సేవలందిస్తున్న ప్రముఖ అగ్రిగేటర్ కంపెనీలు.. ఓలా, ఉబెర్ వంటివి కమీషన్ మోడల్‌లో పనిచేస్తాయి. ఉదాహరణకు ఒక క్యాబ్ డ్రైవర్ ఓలా, ఉబెర్‌లో తన ట్యాక్సీని రిజిస్టర్ చేసుకుంటే, ఆ యాప్‌ల ద్వారా అతడికి వచ్చే ప్రతి రైడ్‌పై దాదాపు 20-30 శాతాన్ని కమీషన్ కింద ఆయా అగ్రిగేటర్ యాప్‌లు తీసేసుకుంటాయి. దీన్ని ఆటో, క్యాబ్ డ్రైవర్లు చాలాకాలంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఈ దోపిడీని భరించలేక.. బెంగళూరులో ఆటో యూనియన్ ఒకటి 'జస్పే' అనే సంస్థను కలిసి తమకు కావాల్సిన విధంగా ఒక యాప్‌ను తయారు చేయించుకుంది. అదే 'నమ్మ యాత్రి' యాప్. అందులో రిజిస్టర్ చేసుకునే డ్రైవర్లు ప్రతి రైడ్‌కూ కమిషన్ చెల్లించక్కర్లేదు. రోజుకు రూ.25 చెల్లిస్తే చాలు. అన్‌లిమిటెడ్ రైడ్స్ చేసుకోవచ్చు. తీరా రూ.25 చెల్లించాక ఆరోజు ఒక్క రైడ్ కూడా రాకపోతే.. ఆ రూ.25 తిరిగి చేస్తారు. అలా కాకుండా.. ఒక్కో రైడ్‌కూ రూ.3.5 చొప్పున రోజుకు 10 రైడ్స్‌కు రూ.35 చెల్లించవచ్చు. ఆరోజు 10 రైడ్స్ పూర్తయ్యాక వచ్చే మిగతా రైడ్స్‌కు ఏమీ చెల్లించక్కర్లేదు. అదే క్యాబ్ డ్రైవర్లయితే రోజుకు రూ.45, రైడ్‌కు రూ.9 చొప్పున 10 రైడ్స్‌కు రూ.90 దాకా చెల్లించాలి. అలాగే.. పశ్చిమబెంగాల్‌లో మమత సర్కార్ కూడా 'యాత్రీ సాథీ' పేరుతో ఒక యాప్‌ను అభివృద్ధి చేసింది. దాంట్లో నమోదు చేసుకునే డ్రైవర్లు ఎలాంటి కమీషన్లూ చెల్లించక్కర్లేదు. సాఫ్ట్‌వేర్ సేవలు అందించినందుకుగానీ.. రోజులో మొదటి పది రైడ్‌లకు ప్రతి రైడ్‌కూ రూ.10 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అంటే 10 రైడ్స్‌కు రూ.100. ఆ తర్వాత ఎన్ని బుకింగ్‌లు వచ్చినా ఒక్క రూపాయి కూడా చెల్లించక్కర్లేదు. రోజులో ఒక్క రైడ్ కూడా రాకపోతే ఏమీ చెల్లించక్కర్లేదు. సహకార్ ట్యాక్సీ కూడా వీటి తరహాలోనే పనిచేయనుంది.



లోక్‌సభలో మాట్లాడుతున్న అమిత్ షా

ప్రయాణికులకూ మేలు..

ప్రభుత్వమే నిర్వహించే సహకార్ ట్యాక్సీ అందుబాటులోకి వస్తే.. ప్రయాణికులకు కూడా మేలు జరుగుతుందని.. వానపడినా, ట్రాఫిక్ రద్దీ పెరిగినా, పీక్ అవర్స్ పేరిట.. ఇలా రకరకాలుగా బాదుతున్న క్యాబ్ అగ్రిగేటర్ కంపెనీల దూకుడుకు అడ్డుకట్ట పడుతుందని సామాన్యపౌరులు అభిప్రాయపడుతున్నారు. పైగా, పోటీ పెరిగి చార్జీలు తగ్గుతాయని పేర్కొంటున్నారు. ఉదాహరణకు.. 'నమ్మయాత్రి' యాప్ ప్రభావంతో ఇప్పటికే ప్రముఖ అగ్రిగేటర్ కంపెనీలు ఆటో డ్రైవర్లకు కమీషన్ విధానాన్ని తీసేసి సబ్‌స్క్రిప్షన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చాయి. అందులో భాగంగా ఆటో డ్రైవర్లు రోజుకు రూ.49 చెల్లిస్తే చాలు. ప్రతి రైడ్‌లో వచ్చే లాభాల్లో కమీషన్ కింద 20-30శాతాన్ని అగ్రిగేటర్లకు చెల్లించాల్సిన పని లేదు. ఇవే కాదు.. ఖరీదైన ఫోన్లు వాడేవారికి ఎక్కువ చార్జీలు.. ఫోన్‌లో బ్యాటరీ తక్కువగా ఉన్నా కూడా అధిక చార్జీలు చూపించేలా అగ్రిగేటర్లు చేస్తున్న గిమ్మిక్కులకు కూడా సహకార్ ట్యాక్సీ చెక్ పెడుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. సహకార్ ట్యాక్సీ సర్వీసుతోపాటు, త్వరలో సహకార రంగంలో ఉన్నవారికి ఆర్థిక రక్షణ కల్పించేలా సహకార్ బీమా కంపెనీని ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉన్నట్టు అమిత్ షా గురువారం సభలో వెల్లడించారు.

భారతదేశం ధర్మసత్రం కాదు

» దేశ భద్రతకు ముప్పు తలపెట్టే వారిని రానివ్వం: అమిత్ షా

» వలసలు, విదేశీయులు 2025 బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 27: భారతదేశం ధర్మసత్రం కాదని, దేశ భద్రతకు ముప్పు తలపెట్టే వారిని భారత్‌లో అడుగుపెట్టనివ్వమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. వ్యాపారం, విద్య, వైద్యం కోసం వచ్చే వారిని, పర్యాటకులను, పెట్టుబడులు పెట్టి దేశ ఆర్థిక ప్రగతికి సహకరించేవారిని భారత దేశంలోకి స్వాగతిస్తామని ప్రకటించారు. వలసలు, విదేశీయులు(ఇమ్మిగ్రేషన్స్ అండ్ ఫారినర్స్) 2025 బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. బిల్లులోని పలు అంశాలు ఇమ్మిగ్రేషన్ అధికారులకు అపరిమిత అధికారాన్ని ఇస్తున్నాయని, ఆయా అంశాలపై జేపీసీ(జాయింట్ పార్లమెంటరీ కమిటీ)తో అధ్యయనం చేయించాలని విపక్ష సభ్యులు చేసిన డిమాండ్లు ఫలించకపోగా.. మూజువాణీ పద్ధతిలో బిల్లు ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మూడు గంటలకు పైగా సాగిన చర్చలో.. వలసలు, విదేశీయులు బిల్లు ఆవశ్యకతను వివరిస్తూ అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. వలసలు, విదేశీయుల 2025 బిల్లు దేశ భద్రతను బలోపేతం చేస్తుందని, 2047 నాటికి భారత్‌ను అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా నిలబెడుతుందని తెలిపారు. భారత్-బంగా సరిహద్దులో జరుగుతున్న చొరబాట్లపై పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

షాపై హక్కుల నోటీసు తిరస్కరణ

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఇచ్చిన సభాహక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. మంత్రి ఎలాంటి హక్కులనూ అతిక్రమించలేదని చెప్పారు.

రాష్ట్రాల్లోకి నేరుగా సీబీఐ

» జాతీయభద్రతతో ముడిపడిన కేసుల్లో అనుమతి తీసుకోకుండానే దర్యాప్తు

» అటువంటి ప్రత్యేక చట్టం తీసుకురండి

» పార్లమెంటుకు స్థాయీ సంఘం నివేదిక

న్యూఢిల్లీ, మార్చి 27: ఒక రాష్ట్రం అనుమతి లేకుండా సీబీఐ ఆ రాష్ట్రంలో అడుగుపెట్టరాదనే ప్రస్తుత చట్టం విషయమై పునరాలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరింది. జాతీయ భద్రత, సమగ్రతతో ముడిపడిన కేసుల విషయంలో రాష్ట్రాల అనుమతి లేకుండానే సీబీఐ తన దర్యాప్తును జరిపేలా ప్రత్యేకమైన/కొత్త చట్టం తీసుకురావాలని సిఫారసు చేసింది. సీబీఐలో డిప్యుటేషన్‌పై పనిచేయడానికి వస్తున్న అభ్యర్థనల్లో సరైనవి చాలా తక్కువగా ఉండటంపై ఈ సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. జాతీయ దర్యాప్తు సంస్థలో డిప్యూటీ సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల వంటి కీలక పోస్టులను డిప్యుటేషన్‌పై కాకుండా నేరుగా భర్తీ చేయడంపై దృష్టిసారించాలని సూచించింది. దీనికోసం స్వతంత్ర నియామక వ్యవస్థను నెలకొల్పాలని సూచించింది. ముఖ్యమైన ర్యాంకుల్లోని అధికారులను స్టాఫ్ సెలక్షన్ కమిషన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారాగానీ, సీబీఐ ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించడం ద్వారా గానీ ఎంపిక చేయాలని అభిప్రాయపడింది. ఈ మేరకు సిబ్బంది వ్యవహారాలు, న్యాయ విషయాల స్థాయీ సంఘం తన 45వ నివేదికను గురువారం పార్లమెంటుకు సమర్పించింది. సీబీఐలో సిబ్బంది కొరత అధికంగా ఉందని, చాలా పోస్టులు ఖాళీగా ఉండి, సిబ్బందిపై అదనపు పని భారం పడుతోందని తెలిపింది. ఇది సీబీఐ పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది.

అవినీతే అసలు రోగం

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ ఖన్నాతోపాటు కొలీజియం సభ్యులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ విక్రమ్ నాథ్‌లు బార్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. న్యాయమూర్తి అధికార నివాసం ప్రాంగణంలో నగదు దొరికిన విషయమై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరారు. తాము లిఖితపూర్వకంగా కోరిన అన్ని అంశాలపై చట్టం పరిధిలో చర్యలు తీసుకుంటామని కొలీజియం హామీ ఇచ్చినట్లు అనిల్ తివారీ వెల్లడించారు. ఢిల్లీ హైకోర్టులో విధుల నుంచి తప్పించిన తర్వాత జస్టిస్ వర్మను పేరెంట్ కోర్టు(సొంత రాష్ట్రం కోర్టు)కు పంపడం సాధారణ విషయమేనని, అక్కడేమీ ఆయనకు విధులు అప్పగించరని సీజే తమకు చెప్పారన్నారు. అలహాబాద్ బార్ సమ్మె విరమించే విషయమై ప్రశ్నించగా, అందరం కలిసి కూర్చొని చర్చించుకుని నిర్ణయం తీసుకుంటామని అనిల్ తివారీ తెలిపారు. అన్ని రాష్ట్రాల హైకోర్టుల బార్ అసోసియేషన్లు అలహాబాద్ హైకోర్టు బార్‌కు మద్దతు తెలిపాయన్నారు. కొలీజియంతో సమావేశంలో ప్రధానంగా న్యాయవ్యవస్థలో అవినీతి గురించి చర్చించామన్నారు. జస్టిస్ వర్మ వ్యవహారం వ్యవస్థకు పట్టిన రోగానికి ఒక సంకేతం మాత్రమేనని, ఒక్క వర్మ కేసుకు పరిమితం కాకుండా మొత్తం న్యాయ వ్యవస్థలో అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కుళ్లిన యాపిల్ పళ్లను ఎప్పటికప్పుడే ఏరేయకపోతే మొత్తం న్యాయవ్యవస్థే భ్రష్టు పట్టిపోతుందని కొలీజియం దృష్టికి తీసుకెళ్లామని కేరళ హైకోర్టు బార్ అధ్యక్షుడు యశ్వంత్ షెనాయ్ తెలిపారు. కేవలం న్యాయమూర్తులే అవినీతిపరులని అనడంలేదని, మొత్తం వ్యవస్థను ప్రక్షాళించేందుకు కొలీజియం పూనుకుంటే తాము అండగా నిలబడతామని ప్రకటించారు. గుజరాత్, కర్ణాటక, జబల్పూర్, లక్నో బార్‌ల ప్రతినిధులు కొలీజియంను కలిసిన వారిలో ఉన్నారు.

న్యాయవాదులతో జస్టిస్ వర్మ భేటీ

జస్టిస్ వర్మ త్వరలో సుప్రీంకోర్టు నియమిత కమిటీ ముందు హాజరై నోట్ల కట్టల వివాదంపై వివరణ ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గత వారం రోజుల వ్యవధిలో ఆయన రెండుసార్లు పలువురు న్యాయవాదులతో సమావేశమై సలహాలు తీసుకున్నారు. ఆయన్ను కలిసిన వారిలో సిద్ధార్థ్ అగర్వాల్, అరుంధతి కట్జు, తారా నరులా, స్తుతి గుజ్రాల్ ఉన్నారు. సుప్రీంకోర్టు కమిటీలో పంజాబ్ హైకోర్టు సీజే జస్టిస్ శీల్ నాగు, హిమాచల్ సీజే జస్టిస్ జీఎస్ సంధ్వాలియా, కర్ణాటక సీజే జస్టిస్ అను శివరామన్ ఉన్నారు. కమిటీ జస్టిస్ వర్మతో పలుమార్లు సమావేశం కానుంది. నోట్ల వ్యవహారం క్రిమినల్ కేసుకు దారి తీస్తుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. మరోపక్క జస్టిస్ యశ్వంత్ వర్మ వివాదంపై పార్లమెంటులో చర్చించాలని విపక్షం డిమాండ్ చేసింది. కేంద్ర న్యాయమంత్రి లోక్‌సభలో ప్రకటన చేయాలని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ కోరారు. మరోవైపు దేశవ్యాప్తంగా 25 హైకోర్టుల్లో న్యాయమూర్తుల పదవులు వేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కలిసి పని చేయాలని న్యాయశాఖ స్థాయీ సంఘం పిలుపునిచ్చింది. అందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది.

విదేశీ వాహనాలపై అమెరికా 25% సుంకం

» డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం

» ఏప్రిల్ నుంచి అమల్లోకి


» ఇద్దరికీ భారమన్న యూరప్

» సుంకాల అంశంలో భారత్‌కు ఊరట!

» అమెరికాతో చర్చలు సానుకూలం

» కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి

వాషింగ్టన్/న్యూఢిల్లీ, మార్చి 27: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. విదేశాల్లో తయారు చేసి అమెరికాలో దిగుమతి అయ్యే వాహనాలపై 25శాతం సుంకం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఏప్రిల్‌2వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని, ఈ చర్య శాశ్వతంగా ఉంటుందని బుధవారం వైట్‌హౌస్‌లో వెల్లడించారు. ఈ నిర్ణయం దేశీయ వాహనాల తయారీ పరిశ్రమను ప్రోత్సహిస్తుందని వైట్‌హౌస్ పేర్కొంది. అయితే ప్రపంచవ్యాప్తంగా వాహనాల ఎగుమతిదారులపై ఆర్థికంగా ప్రతికూలంకానుంది. విదేశీ వాహనాలపై 25శాతం సుంకం విధించడం వల్ల ఏటా 100బిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని వైట్‌హౌస్ అంచనా వేస్తోంది. కాగా వాహనాల ధరలు భారీగా పెరగనుండటంతో అమ్మకాలు తగ్గే అవకాశముందని వాణిజ్యవర్గాలు భావిస్తున్నాయి. సుంకాలు పెంచడం వల్ల అమెరికాలో మరిన్ని వాహనాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తారని ట్రంప్ పేర్కొన్నారు. కాగా ట్రంప్ నిర్ణయంపై ఐరోపా దేశాల ఆటో పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేసింది. ట్రంప్ నిర్ణయం యూరప్‌తో పాటు అమెరికాలోని వినియోగదారులు, కంపెనీలకు భారమవుతుందని ఆటో పరిశ్రమ పేర్కొంది. ప్రతిపాదిత అమెరికా సుంకాల నుంచి భారత్‌కు ఉపశమనం లభిస్తుందని.. చైనా, మెక్సికో, కెనడా వంటి దేశాలపై తరహాలో భారం ఉండదని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు సజావుగా జరుగుతున్నాయని వెల్లడించాయి. అమెరికా ప్రతీకార సుంకాలు విధించేందుకు గడువు ఏప్రిల్ 2వ తేదీలోపు ప్రతిష్టంభన ఏర్పడే సంకేతాలులేవని తెలిపాయి. కొత్త ఒప్పందంలో అధిక డిమాండ్ ఉన్న భారత్ ఎగుమతులపై సుంకాలపెంపు పరిమితంగా ఉండే అవకాశముంది. వచ్చే మూడు రోజుల్లో కొత్త ఒప్పందం విధివిధానాల ఖరారుకు సంబంధిత అధికారులు కృషి చేస్తున్నారు. భారత్ నుంచి మరిన్ని రాయితీల కోసం అమెరికా అధికారులు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. భారత్‌తో ఉన్న ప్రత్యేక వాణిజ్య సంబంధాల నేపథ్యంలో చైనా, మెక్సికో, కెనడా దేశాలపై తరహాలో సుంకాలు వేయకపోవచ్చని, ఇది భారత ఎగుమతిదారులకు ఊరట కలిగిస్తుందని ఆశిస్తున్నారు. అమెరికా ఎగుమతులపై సుంకాలను భారత్ కూడా సమీక్షిస్తోంది. కొన్ని వస్తువులపై సుంకాలు తొలగించడం, మరికొన్నింటిపై మార్పులు చేయడం వంటి ప్రతిపాదనలు చర్చల దశలో ఉన్నాయి.



లోకం తీరు



కథువాలో భారీ ఎన్‌కౌంటర్

» ఇద్దరు పోలీసుల మృతి

» ముగ్గురు ఉగ్రవాదుల హతం

జమ్మూ, మార్చి 27: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లా జుథాని ప్రాంతంలో గురువారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు పోలీసులు మృతిచెందగా, ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆరుగురు జవాన్లు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు ఆర్మీ జవాన్లు కాగా, నలుగురు పోలీసులు. వారు ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం అందుకున్న భద్రత బలగాలు గత నాలుగు రోజులుగా గాలింపు చర్య లు చేపడుతుండగా రాజ్‌భాగ్ పరిధిలోని ఘాటి జుథానా ప్రాంతం జాఖోల్ గ్రామం వద్ద ఎదురు కాల్పులు జరిగాయి. పాక్ నుంచి వచ్చే ఉగ్రవాదులకు ఇటీవల కాలం కథువా కేంద్రంగా మారడంతో భద్రతాబలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

అమెరికా ఆరోగ్య శాఖలో 10వేల మంది ఉద్యోగులపై వేటు!

వాషింగ్టన్, మార్చి 27: పునర్వ్యవస్థీకరణలో భాగంగా అమెరికాలోని ఆరోగ్య, మానవ సేవల విభాగంలో 10వేల మంది ఉద్యోగులను తొలగించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గురువారం ప్రకటించింది. అంటు వ్యాధుల నివారణ; ఆహారం, ఆస్పత్రుల తనిఖీ, ఆరోగ్య బీమా వంటి విధులను ఈ విభాగమే నిర్వహిస్తుంది. ప్రస్తుతం దీంట్లో 82వేల మంది ఉద్యోగులు ఉండగా, దాన్ని 62వేలకు తగ్గించాలని నిర్ణయించింది. లేఆఫ్‌లు, స్వచ్ఛంద, ముందస్తు పదవీ విరమణలు, ఇతర మార్గాల్లో ఉద్యోగులను తొలగించనుంది. లేఆఫ్‌ల ద్వారా 10వేల మందిని, ఇతర మార్గాల ద్వారా మరో పది వేల మందిని తీసేయనుంది. అందులో భాగంగా తొలుత పది వేల మందిని తొలగించడానికి ఏర్పాట్లు చేస్తోంది.

హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా చిదంబరం



అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా కె.చిదంబరం వరుసగా రెండోసారి విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయనకు 937 ఓట్లు రాగా, సమీప అభ్యర్థి జీవీఎస్ కిషోర్ కుమార్‌కు 609 ఓట్లు పడ్డాయి. దీంతో కూటమి బలపర్చిన చిదంబరం.. వైసీపీ మద్దతు పలికిన కిషోర్ కుమార్‌పై 328 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఉపాధ్యక్షుడిగా కెవి. రఘువీర్ (797 ఓట్లు) గెలిచారు. సమీప అభ్యర్థి తోట సునీతకు 549 ఓట్లు వచ్చాయి. ఇక 952 ఓట్లతో ప్రధాన కార్యదర్శిగా సి.సుబోధ్ గెలుపొందారు. సమీప అభ్యర్థి చేజర్ల వెంకటేశ్వరరావుకు 423 ఓట్లు పడ్డాయి. సంయుక్త కార్యదర్శిగా పితాని చంద్రశేఖరరెడ్డి, గ్రంథాలయ కార్యదర్శిగా జంపని శ్రీదేవి, కోశాధికారిగా వై.దుర్గారావు గెలిచారు. క్రీడలు, సంస్కృతిక కార్యదర్శిగా తోట తేజేశ్వరరావు ఏకగ్రీవమయ్యారు. మహిళా ప్రతినిధిగా కంచర్ల ప్రసన్న గెలిచారు. కార్యనిర్వహణ సభ్యులు (30 సంవత్సరాలు)గా ఏవీవీఎస్ఎన్ మూర్తి, కార్యనిర్వహణ సభ్యులు(20 సంవత్సరాలు)గా కోనె సత్యానందరావు ఏకగ్రీవమయ్యారు. ఎగ్జిక్యూటివ్ మహిళా సభ్యులు(10 సంవత్సరాలు)గా ఎం.ఉమాదేవి గెలిచారు. ఈసీ సభ్యులుగా 12 మంది బరిలో ఉండగా.. అందులో గోడవర్తి కిరణ్‌బాబు, ఎన్.స్వర్ణలత, కారుమంచి ధీరజ్‌రెడ్డి, వీవీకె.చక్రవర్తి ఎంపికయ్యారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎన్నికల కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది ఎం.విజయ్‌కుమార్ వ్యవహరించారు.

ఏపీ బీపీసీఎల్ రిఫైనరీలో ఆరాంకో పెట్టుబడులు?

» మోదీ సౌదీ పర్యటనలో ఒప్పందానికి చాన్సు!

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నంలో బీపీసీఎల్ ఏర్పాటుచేయనున్న చమురు రిఫైనరీలో సౌదీ అరేబియా దిగ్గజ చమురు సంస్థ ఆరాంకో భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఈ దిశగా బీపీసీఎల్‌తో నేరుగా చర్చిస్తున్నట్లు తెలిసింది. అలాగే గుజరాత్‌లోని ఓఎన్‌జీసీ రిఫైనరీలో కూడా పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. రామాయపట్నం రిఫైనరీ-పెట్రోకెమికల్ ప్రాజెక్టులో రూ.95 వేల కోట్ల పెట్టుబడి పెడతామని బీపీసీఎల్ చైర్మన్ గత ఏడాది డిసెంబరులో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆరాంకో ఎంత పెట్టుబడి పెడుతుందో, ఎంత క్రూడాయిల్ సరఫరా చేస్తుందో పూర్తి వివరాలు తెలియరాలేదు. ప్రతి ప్రాజెక్టులో తన వాటాకు మూడు రెట్లు సమానంగా చమురు సరఫరా చేస్తామని ఆ సంస్థ ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రధాని మోదీ సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా ఆరాంకో పెట్టుబడులపై ఒప్పందానికి ఆస్కారం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

పుష్కరాల్లోపే పోల'వరం'!



ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబుకు ఖర్జూరం తినిపిస్తున్న మత పెద్ద

వక్ఫ్ ఆస్తులకు రక్షణ

ముస్లింలకు ఉన్నత స్థితి కల్పిస్తాం

» సద్గుణాలకు రంజాన్ ప్రతీక.. ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు

విజయవాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గత ఏడాది కంటే రూ.1,300 కోట్లు పెంచామన్నారు. వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పించి, మత సామరస్యాన్ని కాపాడటంతో పాటు ముస్లింలకు ఉన్నత స్థితి కల్పిస్తామని హామీ ఇచ్చారు. గురువారం విజయవాడలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ముస్లిం మతపెద్దలు స్వాగతం పలికి, పవిత్ర గ్రంథం ఖురాన్‌ను అందజేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మికత్వం... ఈ సద్గుణాలకు రంజాన్ ప్రతీక అని వ్యాఖ్యానించారు. ఇది ఎంతో పవిత్రమైన మాసమని, ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు చేస్తారన్నారు. పవిత్రమైన ఆచారంతో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఆయన అభినందనలు తెలిపారు. ధనవంతులు పేదలకు సహాయం చేయడం ఖురాన్ నేర్పిన మంచి గుణమన్నారు. మైనార్టీలతో టీడీపీకి ఎంతో అనుబంధం ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముస్లింలకు టీడీపీ పాలనలోనే న్యాయం జరిగిందన్నారు. ఎన్టీఆర్ మొదటిసారిగా మైనారిటీ ఫైనాన్స్ కమిటీ ఏర్పాటు చేస్తే, తాను ఉమ్మడి రాష్ట్రంలో ఉర్దూను రెండో భాషగా అమలు చేశానని చెప్పారు. మక్కా యాత్రకు వెళ్లే వారికి హైదరాబాద్‌లో హజ్ భవనం నిర్మించామన్నారు. కడపలో హజ్ భవనం నిర్మాణానికి శ్రీకారం చుడితే వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేసిందన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఉమ్మడిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో విభజన తర్వాత కర్నూలులో ఉర్దూ వర్సిటీ ఏర్పాటు చేయించామన్నారు. ఇమామ్‌లకు గౌరవవేతనం మొదటిసారిగా టీడీపీ అమలు చేసిందన్నారు. మౌజాన్‌లకు రూ.5 వేలు, ఇమామ్‌లకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తున్నామని తెలిపారు. అర్హులైన ఇమామ్‌లను ఖాజీలుగా నియమిస్తుమన్నారు. జకాత్ పేరుతో పేదలకు సహాయం చేసే గుణం ముస్లింలకు ఉందని కొనియాడారు.

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చవుతాయన్నారు. మొదటి దశ పూర్తయ్యాక 45.74 కాంటూరు పరిధిలో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. పరిహారం విషయంలో అందరికీ న్యాయం జరగాలని, ఎక్కడా అక్రమాలు జరగడానికి వీల్లేదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. 2019లో టీడీపీ ప్రభుత్వమే మళ్లీ వచ్చి ఉంటే 2020కే ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. గత పాలకులు దీనికి ఏ గతి పట్టించారో చూశామని.. ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగిపోయిందని చెప్పారు. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా ఎవరికీ తెలియలేదని, కాఫర్ డ్యాం సకాలంలో పూర్తి చేసి ఉంటే ఈ నష్టం జరిగేది కాదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్రం ముందే చెప్పినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఒక్కసారి ఓట్లేసినందుకు రాష్ట్రానికి జీవనాడి దెబ్బ తినే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. నిపుణుల కమిటీ పరిశీలించి, దెబ్బతిన్న వాల్ మళ్లీ నిర్మించాలని చేసిన సూచనకు కేంద్రం, రాష్ట్రం ఆమోదముద్ర వేశాయన్నారు. రూ.400 కోట్లతో తాము వాల్ పూర్తిచేశామని.. ఇప్పుడు జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మళ్లీ రూ.990 కోట్లతో కొత్తది కట్టాల్సి వస్తోందన్నారు. ఎగువ కాఫర్ డ్యాం నుంచి సీపేజీని నివారించేందుకు బట్రస్ డ్యాం నిర్మిస్తున్నామని.. రెండు నెలల్లోనే పూర్తవుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయాలని సూచించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం జీవితానికి ఒక పరమార్థమని.. ప్రధాని మోదీ సహకారంతో ఇది కూడా పూర్తిచేస్తామని తెలిపారు. ఇంకా సీఎం ఏమన్నారంటే..

> రాష్ట్రంలో మూడు పార్టీలు కలిశాయి. ఒకేమాట మీద ఉంటున్నాయి. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకొచ్చింది. నిధులివ్వడంతో పనులను ఒక ట్రాక్‌పై పెడుతున్నాం.
> - చంద్రబాబు

అలసత్వం కూడదు..

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ప్రాజెక్టు నిర్మాణ పనులన్నీ శరవేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టు ఏజెన్సీది.. ఇంజనీరింగ్ అధికారులదే. అలసత్వం కూడదు. పనులు పూర్తిచేసేందుకు దశల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తున్నాం. ఈ ఏడాది డిసెంబరుకల్లా డయాఫ్రం వాల్ పూర్తిచేయాలి. కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీలను 2026 జూలై నాటికి పూర్తి చేయాలి. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1 పనులను 2026 మార్చి నాటికి, ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2 పనులను 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యం విధించినా ఆలోపే పూర్తి చేయాలి. గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం.

రూ.10 లక్షల పరిహారం ఇచ్చారా?

2014-19 మధ్య మా ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సరిపోదని.. ప్రతిపక్షంలో ఉన్న జగన్ రూ.10 లక్షలు పరిహారం ఇస్తానన్నాడు.. గద్దెనెక్కాక ఇచ్చాడా? ఐదేళ్లలో రూపాయి కూడా ఇచ్చింది లేదు. కనీసం వరదలు వచ్చినప్పుడూ నిర్వాసితులను పట్టించుకోలేదు. ప్రాజెక్టు పూర్తవ్వాలంటే తెలంగాణలోని ఏడు ముంపు మండలాలు ఏపీలో విలీనం చేయాలని అప్పట్లో ప్రధానిని ఒప్పించాం. 2014లో మేం రాక ముందు చాలా తక్కువ పరిహారం ఇచ్చారు. మేమొచ్చాక రూ.4,311 కోట్లు చెల్లించాం. 2019లో వచ్చిన జగన్ ప్రభుత్వం ఆ ఐదేళ్లలో ఒక్కసారి కూడా మీ గురించి ఆలోచించలేదు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వాసితుల ఖాతాల్లో రూ.829 కోట్లు జమ చేశాం. సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని పనిచేశాను. 33 సార్లు ప్రాజెక్టును సందర్శించా. 2027 నాటికి పునరావాసాలు పూర్తిచేస్తాం. కొందరి పేర్లు తొలగించారని బాధితులు చెబుతున్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. అర్హులైన అందరికీ పరిహారం చెల్లిస్తాం. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే మీరు ఈ పాటికే స్థిరపడేవారు. పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రూ.2,500 కోట్లు ఆదాయం వచ్చేది. దానినీ ఆలస్యం చేయడంతో అదనపు భారం పడి ఖర్చు పెరిగింది.

ఇప్పుడా మాయమాటలు ఉండవు..

పునరావాసం కల్పించిన తర్వాత మీ ఆదాయ మార్గాలు, జీవన ప్రమాణాలు పెరగడానికి చర్యలు తీసుకుంటాం. మీరంతా ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించారు. మీరు ధైర్యంగా ఉండండి. ఇది మీ ప్రభుత్వం. మనందరి ప్రభుత్వం. మంచిని మంచిగా చెబితే మరింత మంచి జరుగుతుంది. మంచి చేసిన వారికి సహకరించకపోతే తప్పే అవుతుంది. ఈ ప్రభుత్వంలో దళారులు, దొంగలు, మోసగాళ్లు, మాయమాటలు చెప్పేవారు అసలు లేరు. చేసే పని మాత్రమే చెప్పి చేసి చూపిస్తాం. ప్రాజెక్టు కోసం గిరిజనులు ఎక్కువ త్యాగం చేశారు. ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75 వేలు అదనంగా మన ప్రభుత్వం అందిస్తుంది. ఖర్చు పెట్టే ప్రతి పైసా మీకే చెందాలి.



పోలవరం పర్యటనలో నిర్వాసితులు అందజేసిన గిరిజన సంప్రదాయ కొమ్ముపాగాతో సీఎం చంద్రబాబు



పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల

886 కోట్లు కావాలి..

ప్రాజెక్టు అత్యవసర పనుల నిమిత్తం రూ.400 కోట్లు, భూసేకరణ, పునరావాస కార్యక్రమానికి రూ.486 కోట్లు అవసరమని.. మొత్తమ్మీద రూ.886 కోట్లు అందుబాటులో ఉంచాలని ఇంజనీరింగ్ అధికారులు సీఎంను కోరారు. పర్యటనలో ఆయన వెంట జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు-ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరావు, ఆర్అండ్ఆర్ కమిషనర్ ఎస్.రామచంద్రారెడ్డి, జెన్‌కో ఎండీ చక్రధరబాబు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, మేఘా ఇంజనీరింగ్ కంపెనీ డైరెక్టర్ సుబ్బయ్య, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, సొంగా రోషన్ కుమార్, కామినేని శ్రీనివాస్, మాజీ మంత్రి పీతల సుజాత తదితరులు ఉన్నారు.

నిర్వాసితుల మాట..

బాబు మాట నిలబెట్టుకున్నారు



మాకు సంక్రాంతి కానుకగా 6.30 లక్షల పరిహారం సొమ్ము ఇచ్చారు. భూమికి రూ.10.80 లక్షలు ఇస్తానని గతంలో ఇచ్చిన మాట ప్రకారం మాకు పరిహారం అందించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- పరిటాల వరలక్ష్మి, కుక్కునూరు.

ఇంటింటికీ పైపులైన్లు వేశారు..



కివ్వాక నిర్వాసిత కాలనీలో ఇంటింటికీ పైపులైన్లు వేసి సీసీ రోడ్లు వేసి అభివృద్ధి చేశారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రోడ్లు, నీటి సదుపాయం లేక ఇబ్బందులకు గురయ్యాం. గత ప్రభుత్వంలో వరదల సమయంలో మమ్మల్ని ఎవరూ కన్నెత్తి చూడలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా ఇబ్బందులను గుర్తించారు.

- రమాదేవి, కివ్వాక, కుక్కునూరు మండలం.

కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

» కేంద్రానికి టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం ద్వారా అక్కడ నివసిస్తున్న ప్రజలకు భరోసా కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. 'కొల్లేరు ప్రాంతానికి హద్దులు నిర్ణయించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా నిర్దేశించిన పరిమితులతో... సన్న, చిన్నకారు రైతులు సుమారు 21 వేల ఎకరాల భూమిని కోల్పోతున్నారు. ఇది స్థానిక ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. కేంద్రం జోక్యం చేసుకొని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి' అని పుట్టా మహేశ్ విజ్ఞప్తి చేశారు.

స్వర్ణాంధ్ర చంద్రబాబు లక్ష్యం: ఎమ్మెల్సీ సోము

న్యూఢిల్లీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): '2027లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో సీఎం చంద్రబాబు ఉన్నారు. ఆయన తన దృష్టినంతా పోలవరం ప్రాజెక్టుపై పెట్టారు' అని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గురువారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అన్ని విధాలా పోలవరానికి నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

ఆ ఐదు కులాలను ఓబీసీల్లో చేర్చండి

» కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌కు రాష్ట్ర నేతల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లోని శిష్టకరణం, కళింగ వైశ్య, సొండి, తూర్పు కాపు, అర్వల కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి. ఆమేరకు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ) ఇప్పటికే సిఫారసు చేసింది' అని రాష్ట్ర నేతలు పేర్కొన్నారు. గురువారం పార్లమెంటు భవనంలోని సమావేశ గదిలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్‌తో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, కె.లక్ష్మణ్, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్, ఐదు కులాలకు చెందిన సుమారు 80 మంది నేతలు సుదీర్ఘంగా భేటీ అయ్యారు. శిష్టకరణం, కళింగ వైశ్య, సొండి, తూర్పు కాపు, అర్వల కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియను వేగవంతం చేసేలా సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించవలసిందిగా కోరారు.

రమేశ్‌రెడ్డిపై 48 గంటల్లోగా చర్యలు తీసుకోవాలి

» లేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా: కొలికపూడి



తిరువూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అలవాల రమేశ్‌రెడ్డిపై 48గంటల్లోగా చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలంలోని పలు గిరిజన తండాలకు చెందిన మహిళలు గురువారం తిరువూరులోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి నిరసన తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న రమేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

నాలా చట్టం రద్దుకు త్వరలో రూల్స్ : అనగాని

విజయవాడ(వన్‌టౌన్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్) చట్టం రద్దుపై త్వరలోనే విధివిధానాలను విడుదల చేస్తామని రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రియాల్టీ సంస్థ అయిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) ప్రతినిధులు గురువారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలిశారు. నాలా చట్టం రద్దు వెనుక ఆయన కృషి ఎంతో ఉందన్నారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఆయన్ను కలిసిన వారిలో నారెడ్కో సంస్థ ప్రతినిధులు గద్దె చక్రధర్, కిరణ్ పరుచూరి, దుర్గాప్రసాద్, సీతారామయ్య, జగన్, నాగవంశీ, పాపారావు ఉన్నారు.

వైసీపీకి వేసవి సెలవులు!

» వానాకాలం వచ్చేదాకా కార్యక్రమాల్లేవ్!!
» ప్రతి గురువారం బెంగళూరుకు జగన్
» సోమ, మంగళవారాల్లో తాడేపల్లికి
» ఈ ప్యాలెస్‌లో రెండ్రోజులే విడిది
» ప్రతి లోక్‌సభ స్థానంలో మూడేసి రోజులు బస చేస్తానంటూ గతంలో హామీ



అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వేసవి సెలవులు ప్రకటించేశారా? వానాకాలం వచ్చేదాకా పార్టీ కార్యక్రమాలు చేపట్టే యోచనే లేదా? ..వైసీపీ శ్రేణుల్లో ఇప్పుడు వీటిపైనే చర్చ జరుగుతోంది. జగన్ దంపతులు గడచిన కొన్ని నెలలుగా ప్రతి గురువారం బెంగళూరు యలహంక ప్యాలెస్‌కు వెళ్తున్నారు. తిరిగి సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకుంటున్నారు. అంటే.. గట్టిగా రెండ్రోజులు మాత్రమే తాడేపల్లిలో బస చేస్తున్నారు. ఈ రెండు రోజుల విడిదిలోనూ జగన్ పార్టీ తరఫున ప్రత్యేక కార్యక్రమాలేమీ చేపట్టడం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన రైతు పోరు, విద్యుత్ చార్జీల పోరు, యువత (ఫీజు) పోరు ఆందోళనల బాధ్యతలను పార్టీలో మిగిలి ఉన్న ముఖ్య నేతలపైనే వేసేశారు. తానెక్కడా పాల్గొనలేదు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కోటరీలో కీలకమైన నేతలుగా చెలామణి అయిన వారెవరూ ఈ నిరసనల్లో పాల్గొనడం లేదు. పైగా వాటికి ప్రజాస్పందన కూడా లేదు. అయినా భారీ స్థాయిలో ఉద్యమించినట్లుగా ఐప్యాక్ బృందం మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు చూపింది. యువత పోరులో పాల్గొనేందుకు విద్యార్థులను పంపాలని కాలేజీల యాజమాన్యాలతో వైసీపీ స్థానిక నేతలు గొడవ పడిన ఉదంతాలు బయటపడ్డాయి. విద్యార్థుల బదులు 45 ఏళ్లు పైబడినవారిని తీసుకొచ్చి నిలబెట్టారు. దీంతో ఈ ఆందోళన నవ్వులపాలైంది. రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు జనం రావడం లేదు. పార్టీ నేతలు జన సమీకరణ కూడా చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆందోళనలపై జగన్ పునరాలోచనలో పడ్డారని, వేసవి తీవ్రత తగ్గేంతవరకూ.. అంటే వానాకాలం వచ్చి వాతావరణం చల్లబడేవరకు నిరసనలు, పార్టీ సమావేశాలు చేపట్టకూడదని నిర్ణయించారని వైసీపీ నేతలు చెబుతున్నారు. ఇది ఒక విధంగా వైసీపీకి వేసవి సెలవులు ప్రకటించినట్లేనని అంగీకరిస్తున్నారు.

జిల్లా టూర్ల ఊసేదీ?

సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనకు వస్తానని.. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు రోజుల పాటు సమీక్షలు నిర్వహిస్తానని డిసెంబర్లో జరిగిన ముఖ్య నేతల భేటీలో జగన్ చెప్పారు. ఆ తర్వాత ప్రతి లోక్‌సభ స్థానంలో మూడేసి రోజులు బస చేసి.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై కీలక నిర్ణయాలు తీసుకుంటానన్నారు. కానీ ఉగాది వస్తున్నా.. ఆ ఊసే ఎత్తడం లేదు.

లులూ లీజులో నిబంధనలకు పాతర

'స్థానిక' ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ: బొత్స

విశాఖపట్నం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సుమారు రూ.2,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని 'లులూ' గ్రూపునకు 99 ఏళ్ల లీజుకు ఎలా ఇస్తారు? అని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 'ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చే సమయంలో పాటించాల్సిన నిబంధనలకు పాతరేస్తూ లులూ సంస్థకు రూ.170 కోట్ల మేర రాయితీలు ఇస్తున్నారు. ఆ మొత్తంతో రాష్ట్ర ప్రభుత్వమే భవన నిర్మాణాలు చేపట్టవచ్చు. ప్రైవేటు సంస్థకు మేలు చేసేందుకు కూటమి ప్రభుత్వం తెగబడుతోంది. 13 ఎకరాల భూమిని ఏడాదికి రూ.50 లక్షల అద్దెకు లీజుకు ఇవ్వడంలో మతలబు ఏమిటి? రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అరాచకానికి పాల్పడుతోంది. గెలుపు కోసం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. విశాఖలో యాదవ సామాజిక వర్గానికి చెందిన ఒక మహిళకు మేయర్‌గా వైసీపీ అవకాశం ఇచ్చింది. మరో ఏడాది పదవీకాలం ఉంది. ఇంతలోనే కుతంత్రాలతో టీడీపీ ఆమెను పదవి నుంచి దింపేందుకు ప్రయత్నిస్తోంది. దీనిని బీసీలు సహించరు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చినందున మేం మా పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీ చేస్తాం' అని బొత్స తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

అది హిందూ ధర్మంపై దాడే

'కాశినాయన క్షేత్రం' కూల్చివేతలపై జగన్



అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 'కాశినాయన క్షేత్రాన్ని కూల్చేసిన కూటమి ప్రభుత్వం... వాతలు పెట్టి వెన్నపూసిన మాదిరి వ్యవహరిస్తోంది' అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎక్స్ వేదికగా ఆయన కూటమి ప్రభుత్వంపై ఘాటైన పదజాలంతో విమర్శ చేశారు. 'కాశినాయన క్షేత్రాన్ని అటవీ శాఖ నుంచి మినహాయింపును ఇచ్చి ఆలయానికి రిజర్వ్ చేయాలంటూ సీఎం హోదాలో నేను రాసినలేఖతోనే కేంద్రం తన చర్యలను నిలుపుదల చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన ఆరు నెలల్లో కాశినాయన క్షేత్రంలో ఏం జరిగిందో రాష్ట్రమంతా చూస్తోంది. హిందూ ధర్మంపైనా, ఆధ్యాత్మిక క్షేత్రాలపైనా అధికార అహంకారంతో దాడి చేశారు' అని జగన్ విమర్శించారు.

మురికివాడలు లేని రాష్ట్రంగా ఏపీ: మంత్రి నారాయణ



విజయవాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని 2047 నాటికి మురికి వాడల రహితంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని మంత్రి పి.నారాయణ తెలిపారు. 'స్వర్ణాంధ్ర 2047'పై స్థానిక స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)లో గురువారం జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. 'విజన్ 2047లోని పది సూత్రాల అమలుతో అన్ని రంగాల్లోను ముందంజలో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. దేశం 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే సమయానికి రాష్ట్రాన్ని సమగ్ర, సమతుల్యమైన అభివృద్ధికి నమూనాగా రూపొందిస్తున్నాం. విజన్ 2047లో కీలక అంశం అమరావతి. కేంద్ర బడ్జెట్‌లో పట్టణాల అభివృద్ధికి నిధులు కేటాయించడంపై హర్షణీయం. ఈ నిధులతో పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.' అని మంత్రి కోరారు. కార్యక్రమంలో 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తదితరులు పాల్గొన్నారు.

సజ్జల, భార్గవ్‌లకు ముందస్తు బెయిల్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు భార్గవ్‌రెడ్డిలకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేలతో ఒక్కొక్కరూ రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం తీర్పు ఇచ్చారు. సజ్జల, ఆయన కుమారుడు ఇచ్చిన స్క్రిప్ట్, ప్రోత్సాహంతోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వారి కుటుంబసభ్యులు, కమ్మ సామాజికవర్గంపై అసభ్య పదజాలంతో దూషించానంటూ సినీనటుడు పోసాని కృష్ణ మురళి నేరాంగీకార వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. దీని ఆధారంగా ఓబుళవారిపల్లె పోలీసులు అరెస్టు చేస్తారని భయంగా ఉందని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించారు.

వంశీ పిటిషన్‌ను తిరస్కరించిన సీఐడీ కోర్టు

విజయవాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి విజయవాడ సీఐడీ కోర్టు ఝలక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. వంశీతోపాటు మరో నలుగురు నిందితులకు బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయాధికారి తిరుమలరావు గురువారం తీర్పు వెల్లడించారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు రజిని

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి, రూ.2.20 కోట్లు వసూలు చేశారనే ఆరోపణలతో నమోదైన ఏసీబీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజిని వేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని న్యాయస్థానం ఏసీబీ అధికారులను ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 2కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో విజిలెన్స్ తనిఖీల పేరుతో తనను బెదిరించి, రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారని పల్నాడు జిల్లా యడ్లపాడులోని లక్ష్మీబాలాజి స్టోన్ క్రషర్స్‌కు చెందిన నల్లపనేని చలపతిరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రజినిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రజిని హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది దుష్యంత్ రెడ్డి వాదనలు వినిపించారు.

తులసిబాబుకు షరతులతో బెయిల్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో నిందితుడు కామేపల్లి తులసిబాబుకు హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తునకు సహకరించాలని, ఐవో కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఎలాంటి ర్యాలీలు నిర్వహించవద్దని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం తీర్పు ఇచ్చారు. రఘురామపై సీఐడీ కస్టడీలో దాడి వ్యవహారంలో గుంటూరు నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టు అయిన తులసిబాబు.. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. ఆయన తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. పోలీసులు ఇప్పటికే రెండుసార్లు కస్టడీలోకి తీసుకొని విచారించారని, రఘురామను చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో తన పాత్రపై నిర్దిష్ఠ ఆధారాలు లేవన్నారు. రఘురామ అరెస్టులో కీలకపాత్ర పోషించిన అప్పటి దర్యాప్తు అధికారి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ బెయిల్‌పై విడుదల అయ్యారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టు షరతులకు కట్టుబడి ఉంటామని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

నిలకడగా కొడాలి నాని ఆరోగ్యం

హైదరాబాద్ సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుడివాడ వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఏఐజీ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కొన్ని పరీక్షల అనంతరం ఆయన గుండెకు వెళ్లే రక్తనాళాల్లో మూడు బ్లాక్‌లు ఉన్నట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు.



గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆరోగ్య మిత్రలు

వైద్య మిత్రల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత, మినిమమ్ టైమ్ స్కేల్ తదితర డిమాండ్లపై వైద్య మిత్రలు గురువారం మంగళగిరిలోని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. దాదాపు 500 మంది ఆందోళనలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో 17 ఏళ్లుగా ఫీల్డ్ హోదాలో విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 12వ తేదీన ట్రస్ట్ సీఈవోతో జరిపిన చర్చల్లో ఎలాంటి హామీ రాకపోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నా క్షేత్రస్థాయి ఉద్యోగులకు క్యాడర్ లేదని, కనీస వేతనాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తమ గోడును వినిపించాలనే ఉద్దేశంతో నిరసనలు చేస్తున్నామని తెలిపారు. తమ సమస్యలపై అధికారులు స్పందించడం లేదని, పైగా ఒకరికి న్యాయం.. మరొకరికి అన్యాయం అన్నట్లు ప్రత్యేక జీవోలు సృష్టించి ఉద్యోగుల్లో కుమ్ములాటలు పెట్టి చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న తమను ఇన్సూరెన్స్ కంపెనీల పరిధిలోకి పంపిస్తారేమోనన్న భయాందోళన ఉందన్నారు.

డౌన్‌లోడ్ చేస్తే మీ ఫోన్ పనిచేయదు

- బెట్టింగ్ యాప్‌లపై యుద్ధానికి 'ఐటీ' సిద్ధం
- త్వరలో హోం శాఖకు శక్తివంతమైన సాఫ్ట్‌వేర్

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం మోపాలని, వాటిపై నిషేధం విధించడానికి ఉన్న అన్ని అవకాశాలనూ పరిశీలించాలని హోం, ఐటీ శాఖలను సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ఐటీ శాఖ.. అమలులో ఉన్న జాతీయ, అంతర్జాతీయ చట్టాలను పరిశీలించేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లపై నిషేధం అమలులో ఉందని, అయితే వాటిని వాడుతున్నవారికీ, ప్రమోట్ చేస్తున్నవారికి కఠినశిక్షలు పడేలా చర్యలు లేవని గుర్తించింది. దీంతో.. ఇప్పటికే ఉన్న నిషేధం ఉత్తర్వును సరిదిద్దాలని నిర్ణయించింది. అందుకు తగ్గట్లుగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించనుంది. ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో బెట్టింగ్ యాప్‌లను ఎవరు డౌన్‌లోడ్ చేసుకున్నా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం చేరుతుంది. అంతేకాదు డౌన్‌లోడ్ చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరం ఆటోమేటిక్‌గా బ్లాక్ అవుతుంది. వీలైనంత త్వరగా ఈ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి హోం శాఖకు అందించే దిశగా ఐటీ శాఖ కృషి చేస్తోంది. అలాగే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తే కఠినంగా శిక్షలు పడేలా చట్టాలను అమలు చేసేందుకు హోం శాఖకు సహకరించనుంది. త్వరలోనే బెట్టింగ్ యాప్‌లను సంపూర్ణంగా నిషేధిస్తూ ఉత్తర్వు జారీ చేయనున్నట్లు ఐటీకి చెందిన ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

ఉగాది, రంజాన్ సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న ఉగాది, 31న రంజాన్ సెలవులు అయినప్పటికీ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు యథావిధిగా పని చేస్తాయి. మార్చి 31.. ఆర్థిక సంవత్సరాంతం కావడంతో రిజిస్ట్రేషన్లు అధికంగా జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఆ రెండు రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలకు సేవలందిస్తాయని రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా గురువారం ప్రకటించారు.

'కందుకూరి' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా కళాకారులకు రాష్ట్రస్థాయిలో విశిష్ట పురస్కారాలు అందజేస్తున్నట్లు రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎండీ హిమాన్షు శుక్లా తెలిపారు. ఏప్రిల్ 16న అందించబోయే పురస్కారాలకు రాష్ట్రంలోని రచయితలు, దర్శకులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు ఏప్రిల్ 7లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించబోమని, జిల్లా స్థాయి పురస్కారాలు అందుకున్న వారు రాష్ట్ర స్థాయికి అర్హులని శుక్లా వివరించారు. దరఖాస్తులను విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ పరిపాలనా భవనం నాలుగో అంతస్తులో నేరుగా అందజేయవచ్చన్నారు. దరఖాస్తు ఫారంను www.apsftvtdc.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పోర్టుల నిర్మాణంతోనే సహజ వనరుల వినియోగం

- అధికారులతో మంత్రి బీసీ జనార్దనరెడ్డి సమీక్ష

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పోర్టులు, షిప్పింగ్ హార్బర్ల నిర్మాణంతోనే సుదీర్ఘ సముద్రతీర ప్రాంతంలోని సహజ వనరులను వినియోగించుకోగలుగుతామని మౌలిక సదుపాయాలు, రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్దనరెడ్డి పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలోని మారిటైమ్ బోర్డు కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఈపీసీ విధానంలో చేపట్టిన రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం పోర్టుల ప్రగతిపై ఆరాతీశారు. త్వరితగతిన పోర్టులను పూర్తి చేయాలని, షిప్పింగ్ హార్బర్లను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.

'భోగాపురం ఎయిర్‌పోర్టు'ను వేగవంతం చేయండి

- కేంద్ర మంత్రులకు మంత్రి కొండపల్లి వినతి

న్యూఢిల్లీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఏపీలోని భోగాపురం విమానాశ్రయ పనులను వేగవంతం చేయాలని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడిని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. గురువారం ఆయన పార్లమెంటులోని మంత్రి కార్యాలయంలో కలిశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు. అలాగే రాష్ట్రంలో అత్యధికంగా సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల మంత్రి జితిన్ రామ్ మాంజీని కోరారు. అంతకుముందు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి, స్త్రీనిధి బ్యాంక్ ద్వారా అందించే రుణాలపై వడ్డీ రాయితీని కల్పించాలని కోరారు. తన విజ్ఞప్తులకు కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు మంత్రి శ్రీనివాస్ తెలిపారు.

ఉగాది వేడుకలకు ముస్తాబు

రాజధానిలో 50 ఎకరాలు సిద్ధం

- సభా ప్రాంగణంలో రెండు షెడ్లు ఏర్పాటు
- పీ4కి కూడా ఇక్కడి నుంచే సీఎం శ్రీకారం
- ప్రారంభ ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



యాభై ఎకరాల్లో ఏర్పాటు చేసిన రెండు షెడ్లు

మంగళగిరి/అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ఉగాది వేడుకలకు ముస్తాబవుతోంది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం వెనుక వైపు స్థలాన్ని ఆ వేడుకలకు వేదికగా నిర్ణయించారు. గత వారం రోజులుగా ఆ ప్రాంగణాన్ని వేడుకల కోసం సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పీ4 విధానాన్ని కూడా ఉగాది రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక్కడి నుంచే ప్రారంభించనున్నారు. ఇదే ప్రాంగణాన్ని ఏప్రిల్ మూడవ వారంలో ప్రధాని మోదీ పర్యటనకు కూడా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాని మోదీ సభకు 250 ఎకరాలను ఇక్కడ సిద్ధం చేయాలని నిర్ణయించారు. అయితే ఈనెల 30న నిర్వహించనున్న ఉగాది వేడుకలకు మాత్రం 50 ఎకరాలను మాత్రమే వినియోగించుకోనున్నారు.

ఉగాది రోజు పీ4 లాంఛనంగా ప్రారంభం: సీఎస్

ఉగాది రోజున సీఎం చంద్రబాబు పీ4 (ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజలు, భాగస్వామ్యం) విధానాన్ని రాష్ట్ర స్థాయిలో లాంఛనంగా ప్రారంభించనున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4 విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందన్నారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న పేదలను దత్తత తీసుకుని వారికి అండగా నిలిచి పేదరికం నుంచి పైకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. ఉగాది రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ పీ4 ప్రారంభ కార్యక్రమం అమరావతి వేదికగా జరుగుతుందన్నారు. సుమారు 11,500 మంది హాజరయ్యే అవకాశం ఉందని, ఇందులో 3 వేల వరకు మహిళలు ఉండొచ్చని చెప్పారు.



ఉగాది రోజున 'మార్గదర్శి-బంగారు కుటుంబం'

విజయవాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది రోజున రాష్ట్రంలో 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమానికి శ్రీకారం చుడతామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. పీ4 కార్యక్రమంలో భాగంగా దీన్ని అమలు చేస్తామన్నారు. దీనికి 'మార్గదర్శి-బంగారు కుటుంబం' అని నామకరణం చేశామన్నారు. గురువారం విజయవాడలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మూడు పూటలా తిండిలేని పేదలు ఉన్నారని, వారి జీవన ప్రమాణాలు సరిగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాళ్లతోనే ఉండాలన్నది తన జీవిత ఆశయమని, పేదరికంలో ఉన్న వాళ్లను పైకి తీసుకువస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు ఫరూక్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకటరావు, పార్టీ నాయకులు ఫారూక్ షిబ్లీ, జలీల్‌ఖాన్, నెట్టెం రఘురాం, కంభంపాటి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర-వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

- వచ్చేనెల రెండో వారంలో ఇంటింటా ప్రచారం

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్టీజీఎస్).. మనమిత్ర కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సేవలన్నింటినీ వాట్సాప్‌లోనే అందిస్తోంది. ఆండ్రాయిడ్ ఫోన్‌లో 9552300009కు మెసేజ్ చేస్తే చాలు. ఇలా ఇప్పటికే దాదాపు 350 ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. కానీ వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో పూర్తి అవగాహన లేకపోవడంతో దీనిని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. మధ్యవర్తులు, లంచాలు లేని వ్యవస్థను అమలు చేస్తున్నందున ఈ సేవల విధానంపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఆర్టీజీఎస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల రెండో వారం నుంచి ఇంటింటికీ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించింది. ఇకపై ప్రజలు కార్యాలయాలకు వెళ్లకుండా నేరుగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు పొందేలా అలవాటు చేయాలని ఆర్టీజీఎస్ భావిస్తోంది.

పీ4పై ప్రజల సూచనలకు ఆహ్వానం

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047లో భాగంగా వచ్చే ఐదేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వ, ప్రజల, దాతల భాగస్వామ్య(పీ4) పథకాన్ని ఉగాది నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. సమాజంలో సంపన్న కుటుంబాలు రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించడమే దీని లక్ష్యం. ఈ పథకం అమలుకు ఉపయోగపడే సూచనలను ప్రభుత్వం ప్రజల నుంచి ఆహ్వానిస్తోంది. swarnandhra.ap.gov.in\p4 అనే వెబ్‌సైట్ ద్వారా ప్రజలు స్పందించవచ్చు. మెరుగైన సలహాలిచ్చిన వారికి ప్రభుత్వం ప్రశంసా పత్రం అందజేస్తుంది.

ఒక్క సందేశం.. ప్రాణం పోసింది..!

- గుంటూరులో మహిళ బ్రెయిన్ డెడ్
- అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబం
- గ్రీన్‌చానల్‌లో గుంటూరు నుంచి తిరుపతికి తరలింపు

అమరావతి, తిరుపతి, గుంటూరు మెడికల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఒక్క సందేశం.. ఒక కుటుంబం ఆశయాన్ని.. మరో కుటుంబం అవసరాన్ని తీర్చింది. అవయవదానానికి సంబంధించిన సందేశం అందుకున్న మంత్రి నారా లోకేశ్ దాని ప్రాధాన్యాన్ని గుర్తించి సత్వరమే సొంత ఖర్చుతో విమానాన్ని ఏర్పాటుచేసి.. అవయవదానానికి తన వంతు సహకారం అందించారు. గుంటూరుకు చెందిన చెరుకూరి సుష్మ (47) తీవ్ర అనారోగ్యంతో ఈ నెల 23న గుంటూరులోని ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్‌లో చేరారు. ఆమె గురువారం బ్రెయిన్ డెడ్ అయ్యారు. జీవచ్ఛవంలా మారిన తమ ఇంటి వెలుగు సుష్మ మరణాన్ని సజీవం చేయడానికి కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఆమె అవయవాలను దానం చేస్తామని రమేశ్ హాస్పిటల్స్ వైద్యులకు తెలిపారు. వారు వెంటనే.. అవయవాలు తరలించి మరికొందరికి ప్రాణదానం చేసే అవకాశం కల్పించాలని కోరుతూ మంత్రి లోకేశ్‌కు మెసేజ్ పంపారు. దీనిపై 12 నిమిషాల్లోనే స్పందించిన మంత్రి... బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి గుండె తరలింపు కోసం ప్రత్యేక విమానాన్ని సొంత ఖర్చుతో ఏర్పాటు చేయడంతోపాటు తిరుపతి ఆసుపత్రికి చేరే వరకు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసేలా సంబంధిత అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. గురువారం సాయంత్రం గుంటూరు నుంచి గన్నవరం విమానాశ్రయం వరకు రోడ్డు మార్గంలో గుండెను తరలించి, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు చేర్చారు. అక్కడి నుంచి రాత్రి 9.59 గంటలకు తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతున్న తెనాలికి చెందిన 53 ఏళ్ల వ్యక్తికి దాన్ని అమర్చేందుకు వైద్యులు వెంటనే గుండె మార్పిడి శస్త్ర చికిత్సను ప్రారంభించారు. మంత్రిగా ఎంత బిజీగా ఉన్నా మానవత్వంతో స్పందించి సొంత ఖర్చులతో ప్రత్యేక విమానం ఏర్పాటు చేయడమే కాకుండా, గ్రీన్ చానల్‌కు మార్గం సుగమం చేసిన లోకేశ్‌కు ఇరువురి కుటుంబ సభ్యులు, రమేశ్ హాస్పిటల్ వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా.., బ్రెయిన్‌డెడ్ అయిన సుష్మ ఊపిరితిత్తులను చెన్నైలోని ఎంజీఎం హాస్పిటల్‌కు, ఒక మూత్రపిండాన్ని విజయవాడలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. కాలేయం, మూత్రపిండం గుంటూరు రమేశ్ హాస్పిటల్స్‌కు కేటాయించారు.



బూటు, బెల్టులోనూ బొక్కేశారు!

(మొదటి పేజీ తరువాయి)

కమీషన్ల పర్వానికి అడ్డుకట్ట వేసింది. విద్యార్థులకు నాణ్యమైన వస్తువులు పంపిణీ చేస్తూనే, అధిక ధరలు తగ్గించి ప్రజల సొమ్మును ఆదా చేస్తోంది. విద్యార్థుల కిట్లలోనే వచ్చే విద్యా సంవత్సరానికి రూ.64 కోట్లు ఆదా కాగా ఇప్పుడు చిక్కీల్లోనూ రూ.63 కోట్లు ఆదా అయ్యాయి. మరోవైపు పాఠశాలలు, అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్ల రవాణాలోనూ భారీగా నిధులు మిగలనున్నాయి. గుడ్ల కొనుగోలు ధరలు అటుంచితే ఒక్క రవాణాలోనే ఏడాదికి రూ.36 కోట్లు మిగులుతున్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ కోసం కొనుగోలు చేసే కెమికల్స్‌లోనూ భారీగా నిధులు ఆదా కానున్నాయి. దీంతో ఒక ఏడాదికి రూ.200 కోట్లు మిగిలే పరిస్థితి ఏర్పడింది. ఈ లెక్కన ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్లు మిగలనున్నాయి. అంటే గత ప్రభుత్వం ఆ రూ.వెయ్యి కోట్లు అదనంగా చెల్లించినట్లు స్పష్టమవుతోంది. పైగా ధరల పెరుగుదల, మార్పుల ప్రకారం లెక్కిస్తే గత ఐదేళ్లలో వస్తువుల ధరలు ఇంకా తగ్గాలి. అయినా సరే విద్యార్థులకిచ్చే వస్తువులను అంత ఎక్కువ ధరలతో ఎందుకు కొన్నారన్నది ప్రశ్న. సాధారణంగా ఏటా వస్తువుల ధరలు పెరుగుతుంటాయి. కానీ, కూటమి ప్రభుత్వంలో విచిత్రంగా వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ధరలు తమకు అవసరం లేదని, తక్కువకే వస్తువులు సరఫరా చేస్తామని కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. నోట్ పుస్తకాల్లో 36 శాతం ధరలు తగ్గాయి. బూట్లు, యూనిఫాం క్లాత్, బ్యాగులు అన్ని వస్తువుల ధరలూ తగ్గిపోయాయి. మధ్యాహ్న భోజనంలో ఇచ్చే చిక్కీలనూ ఒక్క ఏడాదిలోనే రూ.63 కోట్లు తక్కువకు సరఫరాకు కంపెనీలు ముందుకొచ్చాయి. ఒకట్రెండు రోజుల్లో వర్క్ ఆర్డర్లు జారీకానున్నాయి. స్కూళ్లు, అంగన్‌వాడీల్లో పంపిణీ చేసే గుడ్లను పౌల్ట్రీల నుంచి రవాణా చేస్తారు. గుడ్డు ధరకు నెక్‌ను ప్రామాణికంగా తీసుకున్నా, రవాణాలో 36 కోట్లు తగ్గించేందుకు కాంట్రాక్టర్లు అంగీకరించారు.

ఇంత తేడా ఎలా వచ్చింది?

జగన్ హయాంలో విద్యా కానుక కిట్లు, గుడ్లు, చిక్కీలు ప్రతి దాంట్లో వైసీపీ నేతలు ప్రత్యక్షంగా జోక్యం చేసుకునేవారు. కమీషన్లు వసూలు చేసుకున్నారు. ఓ మంత్రి అయితే ప్రతిదాంట్లో తనకు కచ్చితంగా 5శాతం కమీషన్ ఇవ్వాలనే నిబంధన పెట్టి మరీ వసూలు చేశారు. చివరికి పాఠ్యపుస్తకాల ప్రింటర్ల వద్ద కూడా ఆయన 5శాతం తీసుకున్నారు. చిక్కీలకు చివరి రెండేళ్లు టెండర్లు పిలవకుండా మేనేజ్ చేసి, కావాల్సిన వారికి కాంట్రాక్టు పొడిగించారు. కాంట్రాక్టు ఎందుకు పొడిగించారనే దానికి అప్పటి ప్రభుత్వం సరైన కారణం చూపలేదు. చివరి ఏడాది విద్యా కానుకకు టెండర్లు పిలకుండా పాత కాంట్రాక్టర్లకే కట్టబెట్టారు. ఇక, కోడి గుడ్ల కాంట్రాక్టు వైసీపీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా పంచుకున్నారు. ఇలా పలు దశల్లో కాంట్రాక్టర్లు ముడుపులు చెల్లించాల్సి వచ్చింది. దీంతో అసలు ధర కంటే 10 నుంచి 20శాతం అదనంగా అప్పట్లో కాంట్రాక్టులు ఖరారయ్యాయి. కూటమి ప్రభుత్వం రాగానే కాంట్రాక్టర్లకు 'కమీషన్లు ఉండవు' అనే సందేశం ఇచ్చారు. ఎవరికీ ఎక్కడా ముడుపులు ఇవ్వాల్సిన అవసరం లేదని, అందుకు తగ్గట్టుగా ధరలు కోట్ చేయాలనే స్పష్టత ఇవ్వడంతో కాంట్రాక్టర్లు కమీషన్ల లెక్క తీసేసి, అసలు ధరలను కోట్ చేశారు. దీంతో ప్రభుత్వానికి భారీగా నిధులు ఆదా అవుతున్నాయి.

పాఠ్యపుస్తకాలపై నాన్చుడు!

పాఠశాల విద్యాశాఖలో అన్ని టెండర్లలో నిధులు ఆదా అవుతుంటే పాఠ్యపుస్తకాల టెండర్లపై మాత్రం మిగులు లెక్కలు బయటకు రాలేదు. రూ.250 కోట్ల టెండర్లలో ఎంత ఆదా చేశారో తెలియాల్సి ఉంది. పైగా ఈ ఏడాది పేపరు ధర తగ్గడంతో నిధులు ఎక్కువ ఆదా అయ్యే చాన్సుంది. కానీ అటూ ఇటూగా పాత ధరలకే ఇస్తున్నట్లు తెలిసింది. ప్రైవేటు పాఠశాలలకు ఇచ్చే సేల్ బుక్స్‌లోనూ పాఠ్య పుస్తకాల విభాగం నిబంధనలు ఉల్లంఘించింది. గైడ్లు ముద్రించే కంపెనీల్లో ఆరోపణలున్న కంపెనీలకు కూడా ముద్రణకు అవకాశం ఇచ్చింది. దీంతో పెద్ద కంపెనీలకు ఉద్దేశపూర్వకంగా ముద్రణ కాంట్రాక్టు కట్టబెడుతున్నారనే విమర్శలున్నాయి.

రారెత్తిస్తున్న ఎండలు

- ప్రకాశంలో 42.4 డిగ్రీలు
- నేడు, రేపు తీవ్ర వడగాడ్పులు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో గురువారం ఎండ, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. ప్రకాశం జిల్లా నందనమూరెళ్లలో 42.4, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 42.2, కడప జిల్లా ఒంటిమిట్టలో 42.1, కర్నూలులో 41.7, మన్యం జిల్లా సీతంపేటలో 41.4, తిరుపతి జిల్లా రేణిగుంటలో 41.3, చిత్తూరు జిల్లా కొత్తపల్లి, నంద్యాల జిల్లా రుద్రవరంలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని 89 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు 208 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శనివారం 230 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

సీపీఎస్ ఉద్యోగులకు సర్కార్ బొనాంజా

- 2,300 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ బకాయిల విడుదల
- ఒకేసారి మొత్తం విడుదలపై ఉద్యోగుల హర్షం

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు సీపీఎస్ ఉద్యోగులను జగన్ సర్కార్ రాచిరంపాన పెడితే... కూటమి సర్కార్ వారిని అక్కున చేర్చుకుంది. ఒకేసారి సీపీఎస్ ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లోకి ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలు రూ.2,300 కోట్లు చెల్లించేసింది. గత ప్రభుత్వం బకాయిపెట్టిన 5 నెలల సొమ్ముతోపాటు, కూటమి సర్కార్ వచ్చిన తర్వాత 9 నెలల మ్యాచింగ్ గ్రాంట్‌ను ఒకేసారి చెల్లించింది. ఫిబ్రవరి వరకు మ్యాచింగ్ గ్రాంట్ ప్రాన్ ఖాతాల్లో జమయిందని మెయిల్స్ రావడంతో సీపీఎస్ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ 12 నెలల మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండేవని, దాని వల్ల లక్షల్లో నష్టపోయే వారిమని ఏపీసీపీఎస్‌ఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీశ్, సీఎం దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గడచిన 18 ఏళ్లలో జీరో నెలల మ్యాచింగ్ గ్రాంట్ ఉండడం చాలా అరుదంటూ, ఇందుకు సహకరించిన ఏపీజేఏసీ, సీఎం చంద్రబాబుకు 4 లక్షల సీపీఎస్ ఉద్యోగుల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కాగా, కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు మంచి జరుగుతుందనడానికి ఇది మంచి ఉదాహరణని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. డీఏ బకాయిలూ త్వరలోనే జమ చేస్తారని ఆశిస్తున్నామన్నారు.

స్మార్ట్ ఏపీ ఫౌండేషన్‌కు పరమేసు బయోటెక్ 50 లక్షల విరాళం

కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్‌కు పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన పరమేసు బయోటెక్ లిమిటెడ్ 50 లక్షలు విరాళం అందజేసింది. కంపెనీ ఎండీ ఆనంద స్వరూప్ అదవానీ గురువారం ఉండవల్లిలో లోకేశ్‌ను కలిసి చెక్కు అందజేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.